
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 316
మంగళవారం 6-2-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



భారత్ ఘన విజయం
వైజాగ్‌లో జరిగిన రెండో టెస్టులో 106 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చిత్తు -12లో



ఆఖర్లో అమ్మకాల బెల్
సెన్సెక్స్ 354 పాయింట్లు డౌన్...
82 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ -13లో



బలపరీక్షలో నెగ్గిన చంపయ్
జార్ఖండ్ అసెంబ్లీలో సోమవారం జరిగిన బలపరీక్షలో చంపయ్ సోరెన్ ప్రభుత్వం సునాయాసంగా విజయం సాధించింది.
- వివరాలు 6లో

ప్రచారంలో పిల్లలు వద్దు
ఎన్నికల ప్రచారంలో పిల్లాజెల్లా తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేసే పార్టీలకు ఈసీ హెచ్చరికలు పంపింది.
- వివరాలు 6లో



'అభ్యాస్' పరీక్ష విజయవంతం
శత్రు క్షిపణులు వేర్వేరు దిశల్లో దూసుకొస్తుంటే వాటిలో ఒకదానిని లక్ష్యంగా చేసుకుని కూల్చే పరీక్షను డీఆర్‌డీఓ నిర్వహించింది.
- వివరాలు 6లో



ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే
చండీగఢ్ మేయర్ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి తీరుపై సుప్రీంకోర్టు తీవ్రంగా మండిపడింది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

బీజేఎల్పీ నేత ఎవరు?



బీజేపీ శాసన సభాపక్షనేత ఎన్నికపై ఇంకా ఏటూ తేలలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పక్షాన ఎనిమిది మంది గెలుపొందగా, వీరిలో ఒకరిద్దరు మినహా మిగతా వారంతా కూడా ఈ పదవి తమకే కావాలంటూ తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.
- వివరాలు 2లో ▶

యాసంగి పంటల సాగు 97 శాతం



యాసంగి పంటల సాగు విస్తీర్ణం 97 శాతానికి చేరుకుంది. అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా ఇప్పటివరకు 53.30 లక్షల ఎకరాల్లో నాట్లు పడినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది.
- వివరాలు 14లో ▶

కటకటాల్లోకి పంజగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు



బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రహీల్ ప్రధాన నిందితుడిగా ఉన్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం' కేసులో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బి.దుర్గారావును గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో పోలీసులు అరెస్టుచేశారు.
- వివరాలు 14లో ▶

ప్రకృతి ఒడిలో నేచర్ క్యాంప్



ప్రకృతి ఒడిలో గడిపేందుకు అవకాశం కల్పిస్తున్న 'నేచర్ క్యాంప్'లకు మంచి స్పందన లభిస్తోంది. ఎకో టూరిజం కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న హైకింగ్, నైట్‌ట్రెకింగ్, క్యాంపింగ్, బర్డ్‌వాక్ తదితర అడ్వంచర్ యాక్టివిటీస్‌కు ఆదరణ పెరుగుతోంది.
- వివరాలు 14లో ▶

వెయ్యేళ్ల ప్రగతికి పునాది

హ్యాట్రిక్ కొట్టేస్తున్నాం: ప్రధాని నరేంద్ర మోదీ

మా మూడో టర్మ్‌లో బీజేపీకి 370, ఎన్డీఏకు 400 దాటేస్తాయి

- కాంగ్రెస్ దుకాణానికి శాశ్వతంగా తెర... దశాబ్దాల పాటు దానికి ప్రతిపక్ష పాత్రే
- ప్రేక్షకుల గ్యాలరీకే పరిమితమవుతుంది... ప్రధాన ప్రతిపక్షంపై లోక్‌సభలో నిప్పులు
- విపక్షాలు ముందుగానే కాడి కిందపడేశాయి... ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం కోల్పోయాయి
- కాంగ్రెస్ వల్లే వాటికీ దుస్థితి.. 'అబ్ కీ బార్, 400 పార్' అంటూ సభను హోరెత్తించిన మోదీ
- మూడో టర్మ్‌లో మరిన్ని పెద్ద నిర్ణయాలుంటాయన్న ప్రధాని



కలలు కంటున్నారు
మోదీపై విపక్షాల మండిపాటు
- 6లో

లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: పార్లమెంటు సాక్షిగా ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ ఎన్నికల శంఖారావం చేశారు. ఈసారి కూడా ఘనవిజయం సాధించి ఖాయంగా హ్యాట్రిక్ కొడతామన్నారు. ''సాధారణంగా నేను అంకెల జోలికి వెళ్లను. కానీ ఈసారి మాత్రం దేశం మనోగతాన్ని స్పష్టంగా అంచనా వేయగలను. ఎన్డీఏ కూటమికి ఏకంగా 400 పైచిలుకు స్థానాలొస్తాయి'' అని జోస్యం చెప్పారు. బీజేపీ ఒంటరిగానే కనీసం 370 స్థానాలు సాధిస్తుందని ధీమా వెలిబుచ్చారు. ''మళ్లీ అధికారంలోకి వచ్చేస్తున్నాం. వచ్చాక చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటాం. మూడో టర్మ్‌లో వెయ్యేళ్ల ప్రగతికి పటిష్ట పునాదులు వేస్తాం'' అని ప్రకటించారు. విపక్షాలన్నీ అప్పుడే కాడి కింద పడేశాయంటూ ఎద్దేవా చేశారు. ''కనీసం ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వాటికి ధైర్యం చాలడం లేదు. తమకు మరిన్ని సీట్లు తగ్గి మరోసారి విపక్ష పాత్ర ఖాయమన్న నిర్ణయానికి వచ్చేశాయి'' అన్నారు. కాంగ్రెస్ దుకాణం త్వరలో మూతపడుతుందని, దశాబ్దాల పాటు విపక్ష స్థానానికే పరిమితమవుతుందని ప్రధాని జోస్యం చెప్పారు. భారతీయుల సామర్థ్యంపై నెహ్రూకు, ఇందిరాగాంధీకి ఎన్నడూ నమ్మకమే లేదంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలన కూడా అదే ఆత్మవిశ్వాస రాహిత్య ధోరణిలో సాగిందని విమర్శించారు. పదేళ్ల పాలనలో తాము సాధించిన ఘనతలను సాధించాలంటే కాంగ్రెస్‌కు కనీసం 100 ఏళ్లయినా పట్టి మిగతా 6వ పేజీలో ▶



లాస్ ఏంజెలిస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామీ అవార్డుతో ఉస్తాద్ జాకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్, సెల్వగణేష్, గణేశ్ రాజగోపాలన్

భారత్‌కు 'గ్రామీ' సంబరం

ఈ ఏడాది ఐదుగురు భారతీయులకు ప్రతిష్టాత్మక పురస్కారాలు

➤ ప్రపంచ సంగీత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాది భారతీయ సంగీతానికి పట్టం కట్టారు. 2024 సంవత్సరానికి గాను ఏకంగా ఐదుగురు భారత కళాకారులు, గాయకులు గ్రామీ అవార్డులు గెలుచుకున్నారు. అమెరికాలోని లాస్‌ఏంజెలిస్ నగరంలో ఆదివారం రాత్రి ఈ పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. ప్రఖ్యాత తబలా కళాకారుడు జాకీర్ హుస్సేన్, వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియా, గాయకుడు శంకర్ మహదేవన్, వయోలిన్ కళాకారుడు గణేశ్ రాజగోపాలన్, డ్రమ్స్ కళాకారుడు సెల్వగణేశ్ వినాయక్‌రామ్‌ను గ్రామీ అవార్డులు వరించాయి. జాకీర్ హుస్సేన్‌కు మొత్తం మూడు, రాకేశ్ చౌరాసియాకు రెండు గ్రామీలు లభించడం విశేషం. - వివరాలు 6లో

తెలంగాణ నుంచి పోటీ చేయండి


సోనియాగాంధీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

- పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని స్పష్టీకరణ
- రాష్ట్రంలో మరో రెండు గ్యారంటీలు అమలు చేయనున్నట్లు వెల్లడి
- ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలపై రాహుల్‌కు వివరణ



ఢిల్లీలో సోనియా గాంధీతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీకి ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇప్పటికే పీసీసీ తీర్మానించిన విషయాన్ని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. సోనియాను తెలంగాణ ఇచ్చిన తల్లిగా రాష్ట్ర ప్రజలు గుర్తిస్తున్నందున రాష్ట్రం నుంచి పోటీ చేయాల్సిందిగా కోరుతున్నట్లు చెప్పారు. కాగా దీనిపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని సోనియా.. రేవంత్‌కు చెప్పారు. సోమవారం ఢిల్లీలోని సోనియా అధికారిక నివాసం 10, జనపథ్‌లో.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు ఆమెతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హామీల గురించి మిగతా 2వ పేజీలో ▶



నేటి నుంచి శ్రీశైలం, సాగర్‌లో ఎన్డీఎస్‌ఏ తనిఖీలు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) నేతృత్వంలోని నిపుణుల బృందం తనిఖీ చేయనుంది. మంగళవారం నుంచి 8వ తేదీ వరకు శ్రీశైలం ప్రాజెక్టును, 13–15 తేదీల్లో నాగార్జునసాగర్‌ను ఎన్డీఎస్‌ఏ బృందం సందర్శించనుంది. గత నెల 9న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి నేతృత్వంలో తెలంగాణ, ఏపీతో సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టనుంది. ఎన్డీఎస్‌ఏ సభ్యుడు (డిజాస్టర్, రిసిలియన్స్) వివేక్ త్రిపాఠి నేతృత్వంలోని బృందం శ్రీశైలం ప్రాజెక్టును, ఎన్డీఎస్‌ఏ సాంకేతిక సభ్యుడు రాకేశ్ కశ్యప్ నేతృత్వంలోని బృందం సాగర్ ప్రాజెక్టును తనిఖీ చేయనుంది. ఈ బృందంలో ఎన్డీఎస్‌ఏ నుంచి ముగ్గురు, సీడబ్ల్యూసీ, కేఆర్‌ఎంబీ, ఏపీ, సీఎస్‌ఎంఆర్‌ఎస్, తెలంగాణ నుంచి చెరో అధికారి కలిపి మొత్తం ఎనిమిది మంది సభ్యులు ఉండనున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి భారీగా వరద విడుదల చేస్తుండటంతో మిగతా 3వ పేజీలో ▶

షేర్లు.. ఆస్తులు.. పెట్టుబడులు

తవ్వినకొద్దీ బయటపడుతున్న శివ బాలకృష్ణ అక్రమార్జన

- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ రియల్ దందాపై ఏసీబీ ఫోకస్
- అడ్డగోలుగా ఇచ్చిన అనుమతులపై లోతుగా ఆరా
- ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధించి ప్రశ్నలు



సాక్షి, హైదరాబాద్: వందల కోట్ల అక్రమార్జనతో దొరికిపోయిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసులో తవ్వినకొద్దీ మరిన్ని అక్రమ ఆస్తులు బయటపడుతున్నాయి. పలువురు రియల్ ఎస్టేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా కీలక నిర్ణయాలు తీసుకుని తాను పెద్ద మొత్తంలో లబ్ధి పొందినట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. కొన్ని రియల్ ఎస్టేట్ కంపెనీల్లోనూ బినామీల పేరిట షేర్లు తీసుకోవడంతో పాటు పెట్టుబడులు సైతం పెట్టినట్టు సమాచారం. శివబాలకృష్ణను ఏసీబీ కోర్టు మిగతా 3వ పేజీలో ▶



పేపర్ లీకేజీలు, నియామక పరీక్షల్లో అక్రమాలపై కొరడా

- అవకతవకలకు పాల్పడితే గరిష్టంగా ఐదేళ్ల జైలు, రూ. కోటి జరిమానా
- సంబంధిత బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

➤ ఉద్యోగాల భర్తీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీ ఉదంతాలతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో పరీక్షల అక్రమార్కులపై కేంద్రం కఠినచర్యల కొరడాను ఝుళిపించింది. పేపర్ లీకేజీలు, నకిలీ వెబ్‌సైట్లుసహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకునేందుకు కేంద్రం 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు–2024'ను తెచ్చింది. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.
- వివరాలు 6లో

ఇంటింటికీ 'అయోధ్య' ఫొటోలు
- వివరాలు 2లో

రేషన్‌కార్డే ప్రామాణికం!

200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కు సిలిండర్ అమలుపై సర్కార్ కసరత్తు

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే రెండు గ్యారంటీల అమలు ప్రక్రియ షురూ
- ఇప్పటికే సంబంధిత సన్నాహాలు మొదలెట్టిన విద్యుత్, పౌరసరఫరాల శాఖలు
- నేటి నుంచే వినియోగదారుల నుంచి అర్హత వివరాల సేకరణ..రేషన్‌కార్డు లేకపోతే నో

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



వీళ్లందరినీ చేర్చి మీరు మాగ్జిమమ్ కనిపించకుండా ఉంటే సభలకు జనం ఎందుకు రారో చూద్దాం సార్!

విషయం లేకనే వితండ వాదం

సీఎం రేవంత్‌కు ప్రాజెక్టులపై సబ్జెక్ట్ లేక గాయిగత్తర చేస్తున్నారు: హరీశ్‌రావు

- కేంద్రం తెలంగాణ ప్రాజెక్టుల జోలికి రాకుండా కేసీఆర్ పదేళ్లు అడ్డుకున్నారు
- కాంగ్రెస్ వచ్చిన రెండు నెలల్లోనే అప్పగించి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టింది
- పోతిరెడ్డిపాడు జీవో తెచ్చినప్పుడు మేం సర్కారులో లేం
- ఏపీ రాయలసీమ లిఫ్ట్‌ను వ్యతిరేకించినది మేమే..
- అసెంబ్లీలో చర్చిద్దాం.. మంచీచెడూ అన్నీ తెలుస్తాయి
- బూతులతో బుల్డోజ్ చేసే ప్రయత్నం చేస్తే ఊరుకోబోం
- పదవుల కోసం పార్టీలు మారిన చరిత్ర మీది.. పేగులు తెగేదాక కొట్లాడిన చరిత్ర మాది అని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టుల జోలికి రాకుండా కేసీఆర్ పదేళ్లు అడ్డుకున్నారని.. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని ప్రాజెక్టులను కృష్ణా బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగించిందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు మితిమీరిన అహంకారంతో, సంస్కారం లేని భాషలో సీఎం రేవంత్‌రెడ్డి వితండవాదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జనవరి 17న కృష్ణా బోర్డు సమావేశం జరిగింది. ఏడు రోజుల్లోగా రాష్ట్ర ప్రాజెక్టులను అప్పగించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నెలరోజుల్లోగా 15 ఔట్‌లెట్లను అప్పగిస్తామని చెప్పింది. ఇంత అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నారని నేను ప్రెస్‌మీట్ పెట్టి నిలదీశాను. ఇప్పుడు తమ తప్పులేదంటూ కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారు.

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారు

కృష్ణాబోర్డు రెండో మీటింగ్ ఫిబ్రవరి 1న హైదరాబాద్‌లో జరిగింది. ఇంజనీర్లు సీఆర్పీఎఫ్ అనుమతితోనే ప్రాజెక్టుల వద్దకు వెళ్లాలని అందులో పేర్కొన్నారు. పవర్‌హౌజ్ ఔట్‌లెట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కావాలన్నారు. మరి ప్రాజెక్టులను అప్పగించినది నిజం కాకుంటే మిగతా 2వ పేజీలో ▶

శాశ్వత నష్టం చేసిందే బీఆర్‌ఎస్!

తెలంగాణకు, ఇక్కడి రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది: మంత్రి ఉత్తమ్ ఫైర్

- హరీశ్‌రావు మాటలన్నీ పచ్చి అబద్ధాలు
- తెలంగాణకు 551 టీఎంసీలు, ఏపీకి 260 టీఎంసీలు రావాల్సి ఉండేది
- కానీ ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలకు బీఆర్‌ఎస్ సర్కారు ఒప్పుకొంది
- ప్రాజెక్టులను అప్పగించేందుకూ అంగీకరించింది
- ఏపీ రాయలసీమ లిఫ్ట్ కట్టేందుకు సహకారం అందించింది
- ఇప్పుడు కాంగ్రెస్‌పై తప్పునెడుతున్నారని మండిపాటు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి, రైతులకు శాశ్వత నష్టాన్ని చేకూర్చినది బీఆర్‌ఎస్ సర్కారేనని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత 2015 నుంచి 2019 వరకు ఏటా ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కృష్ణాజలాల పంపిణీకి బీఆర్‌ఎస్ సర్కారు అంగీకరించిందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో కంటే తెలంగాణ ఏర్పాటయ్యాకే కృష్ణాజలాల విషయంలో ఎక్కువ అన్యాయం జరిగిందన్నారు. సోమవారం ఉత్తమ్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించిందంటూ బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఖండించారు. ఉత్తమ్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 56 రోజులైంది. ఈ కాలంలో ప్రాజెక్టుల అప్పగింతపై ఎలాంటి నిర్ణయం జరగలేదు. హరీశ్‌రావు ఆరోపణలు పచ్చి అబద్ధం. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే వారి వ్యవహారశైలితో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. పరీవాహక ప్రాంతం, కరువు నేలలు, జనాభా, సాగు యోగ్యమైన భూములు వంటి అంశాల ఆధారంగా తెలంగాణకు 551 టీఎంసీలు, ఏపీకి 260 టీఎంసీల కృష్ణా జలాలను పంచేలా బీఆర్‌ఎస్ సర్కారు మిగతా 2వ పేజీలో ▶

తాగునీటి కష్టాలకు కారణం కేసీఆరే: మంత్రి కోమటిరెడ్డి 5లో

క్లుప్తంగా...

8 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు

నోటిఫికేషన్ జారీచేసిన గవర్నర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ రెండో సెషన్ సమావేశాలు ఈ నెల 8వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలను 8వ తేదీ నుంచి నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తొలిరోజు గవర్నర్ తమిళిసై ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

హైదరాబాద్‌లో సుప్రీం బెంచ్ పెట్టండి

రాజ్యసభలో డిమాండ్ చేసిన బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హిందీ కచ్చితంగా మాట్లాడాలని ప్రజలపై బలవంతంగా రుద్దడం సరికాదన్నారు. విధానపర నిర్ణయాలను మరింత శక్తిమంతంగా తీసుకొనేందుకు వీలుగా పార్లమెంటుతోపాటు రాష్ట్రాల అసెంబ్లీల పనిదినాలను పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ మెంబర్స్ బిల్లులను ప్రవేశపెట్టే విషయంలో అధికారపక్షం సీరియస్‌గా తీసుకొని చర్చ జరిగేలా చూడాలని కోరారు.

కేంద్రం వివక్షకు వ్యతిరేకంగా 8న నిరసన



సాక్షి, హైదరాబాద్: కేరళ పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షాపూరిత విధానాలు, రాష్ట్రాల హక్కు లపై దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 8న ఆయా రాష్ట్ర కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీఎం కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ ఇందిరాపార్కు వద్ద ఉదయం 10.30 గంటలకు జరిగే ధర్నా కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని వెల్లడించారు.

కృష్ణా బోర్డు తీరుతో రాష్ట్రానికి చేటు

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో బీఆర్ఎస్ పక్ష నేత నామా



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినా విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు విమర్శించారు. చట్టంలో పేర్కొన్న ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, జిల్లాకు ఒక నవోదయ పాఠశాల ఏర్పాటులో కేంద్రం పట్టనట్టుగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చలో నామా మాట్లాడారు. కృష్ణా బోర్డు తీరుతో రాష్ట్రానికి ఇక్కట్లు ఎదురవుతున్నాయని, నదుల అనుసంధాన విషయంలో కేంద్రం మరింత దృష్టి పెట్టాల్సి ఉందని పేర్కొన్నారు.

ప్రాజెక్టుల పేరుతో ఆ రెండు పార్టీలు రాజకీయం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ప్రాజెక్టుల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయం చేస్తున్నాయని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మండిపడ్డారు. ఈ పార్టీల నేతలు పోటీ పడి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారని ధ్వజమెత్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు రూ.500 లేదా 600 కోట్లు ఇవ్వడానికి కూడా మాజీ సీఎం కేసీఆర్‌కు చేతులు రాలేదని ఇప్పుడేమో ధర్నాలు, నిరసనలు అంటున్నారని విమర్శించారు. సోమవారం బూర నర్సయ్య మీడియాతో మాట్లాడుతూ...ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన సమయంలో కాంగ్రెస్ ఎన్నో లింకులు పెడితే, కృష్ణా జల వివాదంపై బీజేపీ సర్కార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి పరిష్కార చర్యలు చేపట్టిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.13 వేల కోట్ల బడ్జెట్‌తో మోదీ విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టిందని, రాష్ట్రంలో ఇప్పటివరకు 1.20 లక్షల మందిని విశ్వకర్మ యోజనలో చేర్పించామని తెలిపారు. అయితే పరిశీలన పూర్తిచేసి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని చెప్పారు.

బీజేఎల్పీ నేత ఎవరు?

- బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఇంకా తొలగని సందిగ్ధత
- ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి ఎక్కువగా అవకాశాలు
- రేసులో రాజాసింగ్, కాటిపల్లి, పాయల్ శంకర్ కూడా..



ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



రాజాసింగ్



వెంకటరమణారెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ శాసనసభాపక్షనేత ఎన్నికపై ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు దగ్గరపడుతున్నా, బీజేపీ నేతలు ఎటూ తేల్చలేకపోతున్నారు. గత డిసెంబర్‌లోనే కేంద్రహోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడే బీజేఎల్పీ నేత ఎన్నిక ప్రక్రియ పూర్తవుతుందని అంతా భావించారు. అయితే అప్పుడు తగిన సమయం లేకపోవడంతో తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కొద్దిరోజులకు బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి తరుణ్‌చుగ్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నేతలు ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయసేకరణ నిర్వహించారు. ఢిల్లీలో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చర్చించాక బీజేఎల్పీ నేతను ప్రకటిస్తామన్నారు. ఇది జరిగి కొద్దిరోజులు గడుస్తున్నా బీజేఎల్పీనేత ఎవరన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నెల 8వ తేదీ నుంచి రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బీజేఎల్పీనేతగా ఎవరిని ఎంపిక చేస్తారనే దానిపై రాజకీయంగా, పార్టీలో చర్చనీయాంశమవుతోంది. శాసనసభ కార్యకలాపాలపై అవగాహన, వివిధ అంశాలపై విషయ పరిజ్ఞానం, రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అసెంబ్లీ వేదికపై చోటుచేసుకునే ఆయా పరిణామాలకు తగ్గట్టుగా చురుగ్గా స్పందించగలిగే వారికి ఈ బాధ్యతలు అప్పగించాలనే అభిప్రాయంతో పార్టీ నేతలున్నట్టు సమాచారం.

- వరుసగా మూడుసార్లు గెలవడంతోపాటు నగరం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఈ పదవి కోరుకుంటున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు సీఎం అభ్యర్థులను ఓడించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డితోపాటు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, పైడి రాకేశ్‌రెడ్డిలు కూడా బీజేఎల్పీ నేత పదవిని ఆశిస్తున్నారు.
- గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తే బీసీ నేతను సీఎం చేస్తామని నాయకత్వం ప్రకటించిందని, కనీసం బీజేఎల్పీ నేతగా బీసీ ఎమ్మెల్యేకు అవకాశం కల్పించాలనే డిమాండ్ కూడా పార్టీలో అంతర్గతంగా వినిపిస్తోంది.
- ఈ నెల 8న బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఆ తర్వాత జరిగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశానికి వివిధ రాజకీయపక్షాల తరఫున నేతలు హాజరై ఎన్ని రోజులు సభ నిర్వహించాలనే దానిపై నిర్ణయం తీసుకుంటారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యే నాటికి లేదా బీఏసీ భేటీ జరిగే నాటికి బీజేఎల్పీనేతను ఎన్నుకుంటారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.అయితే బీఏసీ భేటీకి శాసనసభాపక్షం ఎవరో ఒకరిని నామినేట్ చేసినా సరిపోతుందని, అందువల్ల దానితో బీజేఎల్పీనేత ఎన్నికకు ముడిపెట్టాల్సిన అవసరం లేదని మరికొందరు వాదిస్తున్నారు.

తెలంగాణ నుంచి పోటీ చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

సోనియాగాంధీకి రేవంత్ వివరించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు హామీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15 లక్షలకు పెంపు అమలు చేస్తున్నామని తెలిపారు. తాజాగా రూ.500కే గ్యాస్ సిలిండర్ , 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచిత సరఫరా అమలుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

బీసీ కులగణన చేపడుతున్నాం

రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టాలని నిర్ణయించామని, ఇందుకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈ మేరకు ఇప్పటికే అన్ని రకాల సన్నాహాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, వాటిపై పూర్తిస్థాయిలో కసరత్తు అనంతరం బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని వివరించారు.

భారత్ న్యాయ్ యాత్రలో సీఎం

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ న్యాయ్ యాత్రలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. భట్టి, పొంగులేటితో కలిసి జార్ఖండ్ వెళ్లిన సీఎం రాజధాని రాంచీలో రాహుల్‌ను కలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేస్తున్న రెండు గ్యారంటీల గురించి వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తీరును కూడా వివరించారు.



జార్ఖండ్‌లో రాహుల్‌గాంధీని కలిసిన రేవంత్‌రెడ్డి, భట్టి, పొంగులేటి

రూ.1,800 కోట్ల గ్రాంటు విడుదలకు సహకరించండి

కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావల్సిన రూ.1,800 కోట్ల గ్రాంటు వెంటనే విడుదలయ్యేలా సహకరించాలని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ భేరీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో ఆయనతో భేటీ అయిన రేవంత్.. హైదరాబాద్‌లో మూసీ నది రివర్ ఫ్రంట్ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇప్పించాలని కోరారు. ప్రపంచ బ్యాంకు ఎయిడ్ విడుదలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు అవసరమైన నిధులు ఇవ్వాలని, వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల్లో తమ ప్రభుత్వం తీసుకురానున్న సంస్కరణలకు మద్దతు ఇవ్వాలని సీఎం కోరారు.

4 కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకే ఆ నిర్ణయం

'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వాహన రిజిస్ట్రేషన్లలో టీఎస్‌కు బదులు ఉద్యమ సమయంలో ప్రజలు నినదించిన టీజీ అక్షరాలు ఉండాలనేది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని, వాటిని నెరవేరుస్తూ రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఒక జాతి అస్తిత్వానికి చిరునామా ఆ జాతి భాష, సాంస్కృతిక వారసత్వమే. ఆ వారసత్వాన్ని సమున్నతంగా నిలబెట్టాలన్న సదుద్దేశంతో 'జయ జయహే తెలంగాణ'గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా మార్చాం. సగటు తెలంగాణ ఆడబిడ్డ రూపురేఖలే తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రతిరూపం. రాచరిక పోకడలు లేని చిహ్నమే రాష్ట్ర అధికారిక చిహ్నం'అని రేవంత్ పేర్కొన్నారు.

విషయం లేకనే వితండ వాదం

▶ మొదటి పేజీ తరువాయి

రెండు రాష్ట్రాల ఉద్యోగుల నిష్పత్తి, వారి జీతాల చెల్లింపు దాకా చర్చ ఎందుకు జరిగింది? రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేలా నిర్ణయం తీసుకుని ఇప్పుడు అబద్ధాలు చెప్తున్నారు. కేసీఆర్ పదేళ్లగా ప్రాజెక్టులను అప్పగించకుండా ఉంటే.. కాంగ్రెస్ వాళ్లు రెండు నెలల్లో ఢిల్లీ చేతిలో పెట్టి అడుక్కుతినే పరిస్థితికి తెచ్చారు.

మేం కృష్ణాబోర్డు పరిధిని ఒప్పుకోలేదు

2022లో జరిగిన కృష్ణాబోర్డు 16వ సమావేశంలోగానీ, 2023లో జరిగిన 17వ సమావేశంలోగానీ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలనే ప్రతిపాదనకు బీఆర్ఎస్ సర్కారు ఒప్పుకోలేదు. 16వ సమావేశంలో శ్రీశైలం ప్రాజెక్టులో రెండు, నాగార్జునసాగర్‌లో ఏడు కంపోనెంట్స్‌ను అప్పగించే ప్రతిపాదనకు ఒప్పుకోబోమని చెప్పాం. ఏపీ ఒప్పుకుందని, తెలంగాణ నిర్ణయం పెండింగ్‌లో ఉందని మినిట్స్‌లో స్పష్టంగా ఉంది. అలాగే ఈ అంశాన్ని అపెక్స్ కమిటీకి పంపాలని 17వ సమావేశంలో స్పష్టంగా చెప్పాం. కేసీఆర్ సంతకాలు చేశారని రేవంత్ అంటున్నారు. ఆ సమావేశానికే రాని కేసీఆర్ సంతకాలు చేశారనడం పచ్చి అబద్ధం. ఇంతకంటే జుటా సీఎం ఉంటారా?

అప్పుడు మేం సర్కారులోనే లేము

వైఎస్సార్ పోతిరెడ్డిపాడును వెడల్పు చేసే జీఓ తెచ్చినప్పుడు మేం కాంగ్రెస్ ప్రభుత్వంలో లేము. 610 జీవో అమలు, పులివెందుల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా 2005 జూలై 4న మంత్రి పదవులకు రాజీనామా చేశాం. తర్వాత సెప్టెంబర్ 13న పోతిరెడ్డిపాడు జీఓ వచ్చింది. అలాంటిది మేం పదవుల్లో ఉన్నపుడు పోతిరెడ్డిపాడు జీఓ వచ్చిందని రేవంత్ ఎలా మాట్లాడారు? నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణ నేతలే పదవుల కోసం పెదవులు మూసుకున్నారు. మాతో గొంతు కలిపినది పీజేఆర్ ఒక్కరే. జీవోకు వ్యతిరేకంగా మేం పోరాటం చేశాం. 40 రోజులు అసెంబ్లీని స్తంభింపజేశాం. పదవుల కోసం పార్టీలు మారిన చరిత్ర మీదైతే.. పేగులు తెగేదాక కొట్లాడిన చరిత్ర మాది.

మొదట వ్యతిరేకించింది మేమే..

రాయలసీమ లిఫ్టుకు వ్యతిరేకంగా మొదట స్పందించినది బీఆర్ఎస్ పార్టీనే. రెండో అపెక్స్ కమిటీ మీటింగ్‌లో ఏపీ సీఎం జగన్ సమక్షంలోనే కేసీఆర్ వ్యతిరేకించారు. విభజన చట్టాన్ని రూపొందించినదే కాంగ్రెస్ పార్టీ. మీరు తెచ్చిన బిల్లులో కృష్ణా బోర్డు గురించి పెడితే ఆ బాధ్యత మీది కాదా? తెలంగాణ ఉద్యమానికి కారణమే నీటి సమస్య. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరగలేదని మంత్రి ఉత్తమ్ అనడం ఎంతవరకు సమంజసం? జయశంకర్ గారిని, అమరుల త్యాగాలను తప్పుపట్టేలా మీరు మాట్లాడుతున్నారు.

మేం పుట్టిందే తెలంగాణ కోసం..

మీరు తెలంగాణ నీళ్లను ఆంధ్రాకు తరలించే ప్రయత్నం చేస్తే.. కేసీఆర్ పంట పొలాలకు తరలించారు. సీఎం రేవంత్ వద్ద సబ్జెక్ట్ లేక గాయిగత్తర చేస్తున్నారు. అసెంబ్లీలో సరైన సమాధానం చెప్తాం. బూతులతో బుల్డోజ్ చేసే ప్రయత్నం చేస్తే ఊరుకోబోం. గతంలో ప్రిపేర్ కాక అడ్డంగా దొరికి పోయిన రేవంత్.. ఈసారి అసెంబ్లీకి ప్రిపేరై రావాలి. చర్చిద్దాం. మంచి చెడూ అన్ని తెలుస్తాయి. మేం పుట్టిందే తెలంగాణ కోసం. రేవంత్ నోరు జారినా, రెచ్చగొట్టినా.. మేం రెచ్చిపోం. తెలంగాణ హక్కుల కోసం పోరాడుతాం. దమ్ముంటే అఖిలపక్షం ఏర్పాటు చేయండి.. ఢిల్లీకి వెళ్దాం. రేవంత్ భేషజాలకు వెళ్లకుండా ప్రజలకు క్షమాపణలు చెప్పాలి..'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

శాశ్వత నష్టం చేసిందే బీఆర్ఎస్!

▶ మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేయాల్సి ఉన్నా.. దానికి భిన్నంగా ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల కేటాయింపులకు ఒప్పుకుంది. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అసమర్థత, చేతకానితనం, అవినీతి, కక్కుర్తి వల్లే ఈ సమస్య తలెత్తింది.

రాయలసీమ లిఫ్టుకు కేసీఆర్ సహకారం

2020లో కేసీఆర్ సీఎంగా ఉండి ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో పదేపదే ఏకాంత చర్చలు జరిపి.. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం చేసేందుకు కుట్ర చేశారు. తర్వాత కొన్ని రోజులకే మే 5న శ్రీశైలం ఫోర్‌షోర్ నుంచి 92,592 క్యూసెక్కుల సామర్థ్యంతో రోజుకు 8 టీఎంసీల కృష్ణా జలాలను తరలించుకునే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపడుతూ ఏపీ ప్రభుత్వం జీవో 203 జారీ చేసింది. గ్రావిటీ ద్వారా తెలంగాణకు ఉచితంగా వచ్చే కృష్ణాజలాలను ఏపీకి తీసుకుపోతుంటే బీఆర్ఎస్ వాళ్లు సహకరించారు. కలసి కుట్ర చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పనుల కోసం ఏపీ పిలిచిన టెండర్లకు 2020 ఆగస్టు 10తో గడువు ముగిస్తే.. అంతకంటే ఐదు రోజుల ముందే ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసింది. తెలంగాణ సీఎంను రావాలని కోరింది. కానీ రాయలసీమ ఎత్తిపోతల టెండర్లకు సహకరించడం కోసం కేసీఆర్ ఆ సమావేశానికి వెళ్లకుండా వాయిదా కోరారు. టెండర్లు ముగిశాకే మీటింగ్‌కు వెళ్లారు. తెలంగాణకు అందాల్సిన నీటిని కేసీఆర్, జగన్ కలసి రాకుండా చేశారు.

నీటిపారుదల శాఖను కుప్పకూల్చారు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేకపోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి, భీమా, కోయిల్‌సాగర్, నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారు. కృష్ణా జలాల వినియోగంలో కేసీఆర్ ప్రభుత్వం అన్నిరకాలుగా విఫలమైంది. అసంబద్ధంగా నీటి పారుదల శాఖను నడిపి కుప్పకూల్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ.లక్ష కోట్లు అప్పుచేశారు. దాని నిర్వహణ కోసం ఏటా రూ.10వేల కోట్లు కావాలి. ఈ ప్రాజెక్టులోని ఒక బ్యారేజీ కూలిపోయి, మరో బ్యారేజీ కూలిపోయే స్థితిలో ఉండి.. ఒక్క చుక్క నీటిని వాడుకోలేని దుస్థితి ఉంది.

చావులకు కారణం హరీశ్‌రావే..

ఉద్యమకాలంలో హరీశ్‌రావులా పెట్రోల్ పోసుకున్నట్టు నటించి వేరే వారి చావులకు మేం కారణం కాలేదు. ఆ సమయంలో హరీశ్, మిగతావారు పెద్ద బ్లాక్‌మెయిలర్లుగా ఉన్నారు. ఆ వివరాలు సైతం బయటపెట్టాల్సి ఉంటుంది. హరీశ్‌రావు అబద్ధాలను మానుకోవాలి..'' అని ఉత్తమ్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ సర్కారే ఒప్పుకుంది

2022 మే 6న జరిగిన కృష్ణా బోర్డు 16వ సమావేశంలో ప్రాజెక్టుల అప్పగింతకు నాటి బీఆర్ఎస్ సర్కారు ఒప్పుకొన్నట్టు మినిట్స్‌లో రికార్డు చేశారని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఆ మినిట్స్ ప్రతినిధులను మీడియా ప్రతినిధులకు చూపారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పెద్దవాగు ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించాలని నిర్ణయించామని, అందు కోసం రూ.200 కోట్ల సీడ్ మనీ కేటాయించామని బీఆర్ఎస్ ప్రభుత్వ చివరి బడ్జెట్ (2023-24) ప్రతిపాదనల్లో కూడా పొందుపర్చారని పేర్కొన్నారు. ఇలా ప్రాజెక్టుల అప్పగింతకు పలుమార్లు అంగీకరించి, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

ఇంటింటికీ 'అయోధ్య' చిత్రపటాలు

కరీంనగర్‌లో 4.21 లక్షల చిత్రపటాలను అందించనున్న ఎంపీ సంజయ్



హుజూరాబాద్ రూరల్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఇంటికే అయోధ్య రామయ్య రానున్నారు. అదేంటి అనుకుంటున్నారా? అవును.. ఎంపీ బండి సంజయ్‌కుమార్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజల ఇళ్లకు రాములోరి చిత్రపటాలను పంపిణీ చేయనున్నారు. అయోధ్య వెళ్లలేని వారు తమ ఇళ్లల్లోనే స్వామివారిని దర్శించుకోవాలన్న ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందు కోసం తన పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంతమంది ఓటర్లున్నారు? ఎన్ని కుటుంబాలున్నాయి? వారిలో రామయ్యను కొలిచే వాళ్లెందరున్నారు? అనే వివరాలను సేకరించారు. మొత్తం 5 లక్షల కుటుంబాలకు పైగా ఉండగా.. వాటిలో నాలుగు లక్షలకు పైగా కుటుంబాలు హిందువులని తేలింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని, 4.21 లక్షల అయోధ్య రాముని చిత్రపటాలను తయారు చేయించే పనిలో ఎంపీ నిమగ్నమయ్యారు. ఇప్పటికే లక్షకు పైగా సిద్ధమవడంతో ఇంటింటికీ చేరవేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి. మరోవైపు బీజేపీ జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఎంపీ సంజయ్ మంగళవారం హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని రంగాపూర్ గ్రామంలో పర్యటించనున్నారు.

తెలంగాణ భవన్‌కు నేడు కేసీఆర్

కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ఉమ్మడి జిల్లాల నేతలతో భేటీ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల తర్వాత మొదటిసారిగా బీఆర్ఎస్ అధినేత, శాసనసభ పక్షనేత కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం తెలంగాణభవన్‌కు రానున్నా రు. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నాయ కులతో సమావేశమవుతారు. ఈ మేరకు ఎమ్మెల్యే లు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు రావాలని అధినేత ఆదేశించారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో కృష్ణా బేసిన్‌లో ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడంపై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. అసెంబ్లీ సమావేశాలు, కేబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించనున్నట్టు సమాచారం. అసెంబ్లీ సమావేశాల్లో ఎలా ముందుకు వెళ్లాలి? ప్రజాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎండగట్టడం లాంటి అంశాలను ప్రధానంగా చర్చించనున్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై కేసీఆర్ చర్చించి నేతలకు సూచనలు చేస్తారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా తెలంగాణభవన్‌కు కేసీఆర్ రానుండటంతో పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చే అవకాశముంది. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆశావహులు వచ్చి కలవనున్నారు.

రేవంత్‌రెడ్డిని చెప్పుతో కొడతా

చెప్పు చూపిస్తూ సీఎంపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు

మంచిర్యాల క్రైం, సాక్షి, హైదరాబాద్, సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎం రేవంత్‌రెడ్డిపై మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో బాల్క సుమన్ తీవ్ర పదజాలంతో దూషించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ సమావేశంలో సుమన్ మాట్లాడుతూ '' రేవంత్‌రెడ్డి ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నడు.. ఈ గుంపుమేస్త్రీ గాడు ఏం మాట్లాడుతున్నడు.. ఏం మాట్లాడాలే.. సరే కాలం కలిసి నీ అదృష్టమో తెలంగాణ ప్రజల దురదృష్టమో కుర్చీలో కూర్చున్నవ్.. నువ్వు కూర్చున్న స్థాయి.. పదవిని బట్టి దానికి ఉన్న విలువను బట్టి పద్ధతిగా మాట్లాడాలే.. ఒక ఉద్యమ నాయకుడు ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ తెచ్చిన నాయకుడు.. పదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను పట్టుకుని ..దూషిస్తాడా.. ఈ చెత్త నా కొడుకును ఈ చెప్పు తీసుకుని కొడతా..'' అంటూ తన కాలికి ఉన్న చెప్పు తీసి చూపిస్తూ దూషించారు. ఈ వ్యాఖ్య లు వైరల్ కావడంతో తీవ్ర దుమారం లేపాయి.



చెప్పు చూపిస్తున్న బాల్క సుమన్

ప్రజలే నిన్ను బట్టలూడదీసి కొడతారు..

బాల్క సుమన్‌పై భగ్గుమన్న కాంగ్రెస్ నేతలు

- మంచిర్యాలలో పోలీసులకు ఫిర్యాదు
- చెన్నూరు, మందమర్రి, దండేపల్లిలో దిష్టిబొమ్మల దహనాలు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై కాంగ్రెస్ నేతలు నిప్పులు చెరిగారు. రేవంత్‌రెడ్డికి చెప్పు చూపిన బాల్క సుమన్‌ను ప్రజలు బట్టలూడదీసి కొడతారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్ నేత హెచ్చరించారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అవినీతిపై నేడు అమరవీరుల స్తూపం వద్ద చర్చకు సిద్ధమా అని సుమన్‌కు కైలాశ్ సవాల్ చేశారు. మరో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారగొండ వెంకటేశ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతాచారి, వేణుగోపాల్ రెడ్డి చావుకు బాల్క సుమన్‌నే కారణమని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే సుమన్‌ను తెలంగాణలో తిరగనివ్వబోమని, గుండు కొట్టించి గాడిద మీద ఊరేగిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. స్థాయి మరచి బాల్క సుమన్ సీఎం రేవంత్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నాడని, తాము వారిలాగా దిగజారి మాట్లాడలేమని గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ అన్నారు. బాల్క సుమన్‌కు తప్పనిసరిగా బుద్ధి చెబుతామనీ, ఆయన చేసిన రాసలీలలు, కథలు అన్నీ బయటపెట్టి తగిన శాస్తి చేస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) హెచ్చరించారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ స్పందిస్తూ బీఆర్ఎస్ నాయకులు అధికారంలో ఉండగా అహంకారంతో ఇలానే వ్యాఖ్యలు చేశారని, ప్రజలు సరైన గుణపాఠం నేర్పినా మారలేదన్నారు. చెన్నూరు, మందమర్రి, దండేపల్లిలో సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బాల్క సుమన్ మాట్లాడుతున్న తీరు సంస్కారహీనంగా ఉందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి ధ్వజమెత్తారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా ఉన్న బాల్క సుమన్ మరీ దిగజారి మాట్లాడుతున్నారని ఓ ప్రకటనలో విమర్శించారు.

జార్ఖండ్‌లో ప్రజాస్వామ్యం గెలిచింది

ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: కొద్దిరోజుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోతోందంటూ బీఆర్ఎస్ నేతలు అప్రజాస్వామికంగా మాట్లాడుతున్నారని ఏఐసీసీ కార్యదర్శి ఎస్.సంపత్‌కుమార్ విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోసి అనైతికంగా గద్దెనెక్కాలన్న నరేంద్రమోదీ ఆలోచనను జార్ఖండ్ తిప్పికొట్టిందని, అక్కడ ప్రజాస్వామ్యం గెలిచిందని చెప్పారు. జార్ఖండ్ ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో రక్షణ కల్పించామని, బిహార్ ఎమ్మెల్యేలు కూడా ఈనెల 11వ తేదీ వరకు హైదరాబాద్‌లో ఉంటారని, ఈ నెల 12న బిహార్‌లో కూడా ప్రజాస్వామ్యం విజయం సాధిస్తుందని సంపత్ ధీమా వ్యక్తం చేశారు. ఈ రెండు రాష్ట్రాల ఫలితాలు బీజేపీకి గొడ్డలిపెట్టుగా మారుతాయని ఆయన వ్యాఖ్యానించారు.

తెలంగాణలో 1.23 లక్షల గృహాల పంపిణీ

రాజ్యసభ ప్రశ్నోత్తరాల్లో కేంద్రమంత్రి కౌశల్ కిషోర్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాన్‌మంత్రి ఆవాస్ యోజన అర్బన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 21.32 లక్షల గృహాల కేటాయింపు జరగగా, అందులో 20.07 లక్షల గృహాల పనులు ప్రారంభమయ్యాయని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ సోమవారం రాజ్యసభలో తెలిపారు. అందులో 9.08 లక్షల గృహాల నిర్మాణం పూర్తయిందని, 7.74 లక్షల గృహాలను రాష్ట్రప్రభుత్వం లబ్ధిదారులకు అందించిందన్నారు. కాగా, తెలంగాణలో 2.50 లక్షల గృహాల కేటాయింపు జరగగా, 2.44 లక్షల గృహాల నిర్మాణం ప్రారంభమైందని, 2.24 లక్షల గృహాల నిర్మాణం పూర్తయిందన్నారు. అందులో 1.23 లక్షల గృహాలను లబ్ధిదారులకు అందించినట్లు బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

రేషన్‌కార్డే ప్రామాణికం!

200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కు గ్యాస్ సిలిండర్ అమలుపై సర్కార్ కసరత్తు

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే రెండు గ్యారంటీల అమలు ప్రక్రియ షురూ
- ఇప్పటికే సంబంధిత సన్నాహాలు మొదలెట్టిన విద్యుత్, పౌరసరఫరాల శాఖలు
- నేటి నుంచే వినియోగదారుల నుంచి అర్హత వివరాల సేకరణ.. రేషన్‌కార్డు లేకపోతే నో



సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీలలో భాగంగా ఈ నెలలోనే అమలు చేయాలని భావిస్తున్న మరో రెండు గ్యారంటీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లోనే రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ (గృహజ్యోతి) హామీల అమలు ప్రక్రియ ప్రారంభించాలని మంత్రివర్గం నిర్ణయించిన సంగతి తెలిసిందే. కాగా ఈ రెండు హామీలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికకు రేషన్‌కార్డు (ఆహార భద్రతా కార్డు)నే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకోసం సంబంధిత అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు కూడా ప్రారంభించింది. పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు సంబంధించి విద్యుత్ శాఖ, రూ 500కు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే ప్రక్రియపై పౌరసరఫరాల శాఖ విధి విధానాలు రూపొందిస్తున్నాయి. ఇప్పటికే ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు అందినప్పటికీ, నేరుగా వినియోగదారుల నుంచి అర్హతకు సంబంధించిన పత్రాలు తీసుకోవాలని ఆయా శాఖలు భావిస్తున్నాయి. దీనికి సంబంధించిన ప్రక్రియను మంగళవారం నుంచే ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.

కోత తప్పదా?

రాష్ట్రంలో 1.28 కోట్ల డొమెస్టిక్ (గృహ వినియోగ) గ్యాస్ కనెక్షన్లు ఉండగా, 1.23 కోట్ల గృహావసర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీరిలో ప్రభుత్వ పథకాలకు అర్హులను ఎంపిక చేసేందుకు ప్రస్తుతం రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కింద జారీ అయిన ఆహార భద్రతా కార్డులు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆహార భద్రతా కార్డులు కలిపి 90,14,263 రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం వీరందరికీ రెండు గ్యారంటీలను అమలు చేయాల్సి వస్తే ఎలాంటి అభ్యంతరాలు, నిబంధనలు లేకుండా అమలు చేయాలి. కానీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలనే అర్హులుగా పరిగణించాలని భావిస్తే మాత్రం గణనీయంగా కోత తప్పదని ఓ అధికారి తెలిపారు. ఈ పరిస్థితుల్లో లబ్ధిదారుడి ఆర్థిక, సామాజిక స్థితి గతులను కూడా పరిగణనలోకి తీసుకొని రెండు గ్యారంటీలను అమలు చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే వచ్చిన ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులను అంచనా వేసే కార్యక్రమం ఓవైపు సాగుతుండగా, విద్యుత్ శాఖ, పౌరసరఫరాల శాఖ తరఫున మరోసారి లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియ సాగనున్నట్లు సమాచారం.

బిల్లులు ఎవరు కడితే వారి పేరుపైనే..

పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని అమలు చేసేందుకు మంగళవారం నుంచే విద్యుత్ శాఖ రంగంలోకి దిగనుంది. ఈనెల కరెంటు బిల్లు లెక్కలు తీసుకునేందుకు వచ్చే వ్యక్తి బిల్లు కోసం వచ్చినప్పుడే మీటర్ నంబర్ యాక్టివేట్ అవుతుంది. ఆ బిల్లుకు సంబంధించి ఉన్న ఇంటి యజమాని ఆధార్, రేషన్‌కార్డు (ఆహారభద్రతా కార్డు), ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు ఎంట్రీ చేసే కార్యక్రమం కొనసాగనుంది. ఒకవేళ ఇంటి యజమాని కాకుండా అద్దెకు ఉన్న వ్యక్తులు కరెంటు బిల్లులు చెల్లిస్తున్నట్టయితే, ఆ కిరాయిదారు పేరు మీద మీటర్‌ను యాక్టివేట్ చేస్తారు. రేషన్‌కార్డు లేని వారి నుంచి వివరాలు తీసుకోరు. ఈ వివరాలతో పాటు ప్రజాపాలన కింద వచ్చిన దరఖాస్తుల్లోని వివరాలు కూడా పరిశీలించి ప్రభుత్వం అర్హులను ఎంపిక చేయనుంది. ఉచిత విద్యుత్ పథకానికి ఏటా రూ.4 వేల కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిసింది.

ఏడాదికి ఆరు సిలిండర్లు!

గ్యాస్ సిలిండర్ పథకానికి సంబంధించి.. సిలిండర్ బుక్ చేసినప్పుడు డెలివరీ కోసం వచ్చిన వ్యక్తి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కేవైసీ తరహాలో లబ్ధిదారుల వివరాలను సేకరించడంతో పాటు గ్యాస్ సిలిండర్, ఆధార్, రేషన్‌కార్డు నంబర్లను తీసుకుంటారు. వీటితో పాటు ఆర్థిక స్తోమతను అంచనా వేయడానికి కుటుంబ వివరాలను కూడా తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఇలావుండగా ఒక కుటుంబానికి సంవత్సరానికి ఎన్ని సిలిండర్లు రూ.500 చొప్పున సరఫరా చేయాలనే అంశంపై స్పష్టత రావలసి ఉంది. అయితే ఒక పేద కుటుంబానికి ఏడాదికి 6 సిలిండర్లు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. సంవత్సరానికి 6 సిలిండర్లు రూ.500 చొప్పున ఇచ్చినా రేషన్‌కార్డుల లెక్క ప్రకారం ఏడాదికి రూ.3,245 కోట్లు సబ్సిడీ రూపంలో వెచ్చించాల్సి వస్తుందని అంచనా. అయితే దీనికి సంబంధించి ఇంకా విధి విధానాలు ఖరారు కాలేదు. అసెంబ్లీ సమావేశాల్లో పూర్తి వివరాలను ప్రభుత్వం వెల్లడించనుంది.

టీచర్ల బదిలీలు సాధారణ ప్రక్రియే

- ఒక చోటు నుంచి వేరే ప్రాంతానికి పంపడమూ సహజమే
- పాఠశాల విద్యాకమిషనర్ దేవసేన స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: జిల్లా స్థాయి పాఠశాలల్లో విధుల సర్దుబాటు కోసమే ఒక చోటు నుంచి మరో చోటుకు టీచర్లను బదిలీ చేయడం జరిగిందనీ, ఇది సాధారణ ప్రక్రియేనని పాఠశాల విద్యాకమిషనర్ ఎ.దేవసేన స్పష్టం చేశారు. 'టీచర్లు సిటీకి.. చదువులు గాలికి, తప్పు మీదంటే మీదే' అనే శీర్షికలతో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తలకు ఆమె మంగళవారం వివరణ ఇచ్చారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలలకు టీచర్లు ఎక్కువగా ఉన్న స్కూల్స్ నుంచి ఉపాధ్యాయులను పంపినట్టు వెల్లడించారు. టీచర్ల ప్రత్యేక అవసరాలను మానవతా కోణంలో పరిశీలించిన తర్వాత వారిని ఇతర స్కూళ్ళకు పంపే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను అమలు పరిచే విషయంలో గానీ, పాలన సంబంధమైన విషయాల్లో గానీ విద్యాశాఖ అధి కార వ్యవస్థలో పూర్తిగా సమన్వయ, సద్భావనలు ఉన్నా యని వెల్లడించారు. ఈ విషయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి, తనకు భిన్నాభిప్రాయాలు లేవని పునరుద్ఘాటించారు.

నేటి నుంచి శ్రీశైలం, సాగర్‌లో ఎన్డీఎస్‌ఏ తనిఖీలు

▶ మొదటి పేజీ తరువాయి

దిగువ భాగంలో 40 మీటర్లలోతు గుంత (ప్లజ్ పూల్) ఏర్పడింది. దిగువ భాగంలో రక్షణ చర్యలతోపాటు కాంక్రీట్ వాల్ నిర్మాణం, స్పిల్ వేకు అత్యవసర మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుందని, దీనికి రూ. 800 కోట్లు అవసరమని కేఆర్ఎంబీ గతంలో అంచనా వేసింది. ఇక నాగార్జునసాగర్ స్పిల్‌వే ఓగీలో కాంక్రీట్ పనులు, సీపేజీ గుంతలకు మరమ్మతులు, కుడికాలువ హెడ్ రెగ్యులేటరీ గేట్లకు మరమ్మతులు, పూడికను బయటకు పంపే గేటు మార్పిడి వంటి పనులు చేయాల్సి ఉందని కేఆర్ఎంబీ ఇప్పటికే గుర్తించింది. ఇందుకు రూ. 20 వేల కోట్లు అవసరం కానున్నాయి. ఎన్డీఎస్‌ఏ బృందం తనిఖీల అనంతరం రెండు ప్రాజెక్టుల మరమ్మతులపై కేఆర్ఎంబీ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

నో క్యాస్ట్, నో రెలిజియన్ కోసం... ఏం చర్యలు తీసుకున్నారు?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కుల, మతరహితంగా జీవించాలనుకొనే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏం చర్యలు చేపట్టిందో చెప్పాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులిచ్చింది. బర్త్ సర్టిఫికేట్ నుంచి డెత్ సర్టిఫికెట్ జారీ వరకు కులం, మతం లేకుండా జీవించాలని భావించే వారిని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినా స్పందించడం లేదంటూ డీవీ రామకృష్ణారావు, కృపాళిని తదితరులు 2017లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదుల్లో ఒకరైన రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా తరపున హైదరాబాద్ సెన్సస్ ఆపరేషన్స్ జాయింట్ డైరెక్టర్ ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశారు. పిటిషనర్ కోరిన అంశాలు తమ పరిధిలోకి రావని చెప్పారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొనే విధాన నిర్ణయమన్నారు. అయితే జనాభా లెక్కలప్పుడు మతం చెప్పడానికి ఇష్టపడని వారికి నో రిలీజియన్ అని నమోదు చేస్తామని వివరించారు. ఇక ఎస్సీ, ఎస్టీలవి తప్ప ఇతరుల కులాల డేటాను జనాభా లెక్కలప్పుడు సేకరించబోమని పేర్కొన్నారు. కులాల గుర్తింపును ప్రోత్సహించవద్దనే కేంద్రం నిర్ణయం మేరకు 1951 నుంచి కులాల లెక్కలు సేకరించడం లేదన్నారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం వద్ద సోమవారం మరోసారి విచారణకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ వేయకపోవడంతో 3 వారాలు గడువిస్తూ ధర్మాసనం విచారణ వాయిదా వేసింది. ఇదే తరహా పిటిషన్ హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద గత జూలైలో విచారణకు రాగా ప్రభుత్వ ధ్రువపత్రాల్లో నో క్యాస్ట్, నో రిలీజియన్ అనే కాలాన్ని చేర్చాలని జడ్జి ఆదేశించారు.

అప్పుడు ధర్నాచౌక్ వద్దని.. ఇప్పుడక్కడ ధర్నానా?

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నేరెళ్ల శారద

సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్నప్పుడు ధర్నాచౌకే వద్దన్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు అక్కడ ధర్నా చేస్తామనడం హాస్యాస్పదమని టీపీసీసీ ప్రధానకార్యదర్శి నేరెళ్ల శారద ఎద్దేవా చేశారు. సోమవారం ఆమె గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తామంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అప్పుడెందుకు నోరుమెదపలేదని ప్రశ్నించారు. పదేళ్లలో అప్పటి సీఎం కేసీఆర్ ఏ ఒక్క ఉద్యోగ నియామకం చేపట్టలేదని ధ్వజమెత్తారు.

షేర్లు.. ఆస్తులు.. పెట్టుబడులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎనిమిది రోజుల కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. ఆరో రోజు కస్టడీలో భాగంగా సోమవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. తమ సోదాల్లో గుర్తించిన ఆస్తులు, ఆభరణాలు, బ్యాంకు ఖాతాలు, కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న బ్యాంకు ఖాతాలు, లాకర్లు, కీలక ఆస్తులకు సంబంధించిన పత్రాలు.. ఇలా పలు అంశాలపై గత ఐదు రోజులుగా శివబాలకృష్ణ నుంచి సమాచారం సేకరించిన ఏసీబీ అధికారులు.. తాజాగా రియల్ ఎస్టేట్ కంపెనీలతో లింకులపై ఫోకస్ పెట్టారు. పలు రకాల అనుమతులకు సంబంధించి లోతుగా ఆరా తీస్తున్నారు.

రెండు రియల్ కంపెనీలతో పలు లావాదేవీలు

ప్రాథమిక ఆధారాల ప్రకారం..ప్రధానంగా రెండు రియల్ ఎస్టేట్ కంపెనీలతో శివబాలకృష్ణ పలు లావాదేవీలు జరిపినట్టు తెలిసింది. సోమవారం నాటి విచారణలో భాగంగా సంబంధిత వివరాలు ఏసీబీ అధికారులు సేకరించినట్టు తెలిసింది. అదేవిధంగా లాకర్లు ఓపెన్ చేసినప్పుడు లభించిన పలు భూ పత్రాలపైనా ప్రశ్నించినట్టు సమాచారం. ఇప్పటికే శివబాలకృష్ణ సోదరుడు సునీల్‌ను అధికారులు ప్రశ్నించారు. అతడి నుంచి సేకరించిన వివరాల ఆధారంగా మరిన్ని అంశాలపై శివబాలకృష్ణను ప్రశ్నించినట్టు తెలిసింది. ఔటర్ చుట్టూ కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు సంబంధించిన అనుమతుల్లోనూ అవినీతికి పాల్పడిన శివబాలకృష్ణ తన బినామీల పేరిట ఆస్తులు కూడబెట్టినట్టు సమాచారం. వీటి గురించి కూడా అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. రెండు రోజుల్లో కస్టడీ ముగియనున్న నేపథ్యంలో కీలక అంశాలపై మరిన్ని వివరాలు సేకరించేలా ఏసీబీ అధికారులు ప్రశ్నావళి రూపొందించుకుంటున్నట్టు తెలిసింది.

హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో తనిఖీలు

అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయం ప్లానింగ్ విభాగంలో పదిమంది ఏసీబీ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టినట్టు సమాచారం. పలు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు నమోదు చేసినట్లు తెలిసింది.

ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా హనుమంతరావు బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ(ఐఅండ్ పీఆర్) కమిషనర్‌గా ఎం.హనుమంతరావు సోమవారం ఇక్కడి మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కమిషనర్‌గా వ్యవహరించిన అశోక్‌రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యానవన శాఖ సంచాలకులుగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎం.హనుమంతరావు వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. శాఖపరంగా చేపడుతున్న కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. అనంతరం సచివాలయంలో ఐఅండ్ పీఆర్ ప్రత్యేకకార్యదర్శిగా సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను ఆదివారంరాత్రి బదిలీ చేస్తూ ఉత్త ర్వులు జారీ చేయగా, సో మవారం ప లువురు బా ధ్యతలు స్వీక రించారు. బీ సీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా బి.బాలమాయాదేవీ సోమవారం డీఎస్ఎస్ భవన్‌లోని బీసీ సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులుగా ఎ.నిర్మల కాంతివెస్లీ అమీర్‌పేట్‌లోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.


ఆర్ఎస్ యునానీ ఫార్మసీని సీజ్ చేసిన డీసీఏ

- కిడ్నీలో రాళ్లు కరిగించే మందులంటూ అసత్య ప్రకటనలు
- రూ.7,070 విలువైన మందులు స్వాధీనం


సాక్షి, హైదరాబాద్: కిడ్నీలో రాళ్లు, గాల్ స్టోన్‌లకు వైద్యం చేస్తామంటూ ప్రచారం చేసుకుంటూ యూఎస్‌ఐ స్టోన్స్ పౌడర్ పేరిట మందులు విక్రయిస్తున్న బహదూర్‌పురాలోని ఆర్ఎస్ యునానీ ఫార్మసీని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు సోమవారం సీజ్ చేశారు. కిడ్నీలో రాళ్లకు వైద్యం అంటూ ఈ మోసపూరిత ప్రకటనలు జారీ చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఆర్ఎస్ యునానీ ఫార్మసీ స్టోర్స్‌లో సోదాలు నిర్వహించిన డీసీఏ మొత్తం రూ.7,070 విలువైన మందులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అబ్జక్షనబుల్ అడ్వైర్టైజ్‌మెంట్)యాక్ట్ 1954 కింద ఈ తరహా ప్రకటనలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు తెలిపారు. రోగులను తప్పుదోవ పట్టించేలా ఇలాంటి ప్రకటనలు చేస్తే చర్యలు తప్పవని డీసీఏ అధికారులు హెచ్చరించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ అక్రమ అమ్మకాలపై డీసీఏ నిఘా లేబోరేటరీ రీ ఏజెంట్‌గా (ప్రయోగశాలల్లో) వాడే హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణాన్ని మందుల దుకాణాల్లో రోగులకు నేరుగా విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని, హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం ఐపీని మాత్రమే విక్రయించాలని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్‌రెడ్డి సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఈ నెల 9లోగా నిర్ణయం తీసుకోండి

- భావ ప్రకటన స్వేచ్ఛ అనేది ప్రాథమిక హక్కు
- నిర్మాత కూడా పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టారు
- 'వ్యూహం'తీర్పులో ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యలు
- కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని సీబీఎఫ్‌సీకి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్‌వర్మ దర్శకత్వం వహించిన వ్యూహం చిత్ర విడుదలపై ఈ నెల 9లోగా నిర్ణయం తీసుకోవాలని సీబీఎఫ్‌సీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్)ని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. సింగిల్ జడ్జి తీర్పును కొంచెం మారుస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. 'చట్టబద్ధమైన పాలనలోని ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛ అనేది ప్రాథమిక హక్కు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం నిర్మాతకు ప్రాథమిక హక్కు ఉంది. ఇది అతని దృక్కోణం నుంచి చిత్రాన్ని చూపించడానికి అనుమతిస్తుంది. అంతేకాదు నిర్మాత ఈ చిత్రాన్ని నిర్మించడానికి పెద్ద ఎత్తున డబ్బును పెట్టుబడి పెట్టారు. సినిమా విడుదలకు ముందే థియేటర్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. సీబీఎఫ్‌సీ చైర్మన్ ఇప్పటికే మరో రివైజింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఒకవేళ ఇంకా ఏర్పాటు చేయకుంటే వెంటనే ఆ ప్రక్రియ ప్రారంభించాలి. రివైజింగ్ కమిటీ సినిమా వీక్షించి, సినిమా సర్టిఫికేషన్‌కు తన నిర్ణయాన్ని చైర్మన్‌కు తెలియజేయాలి. దానిపై చైర్మన్ నిర్ణయం తీసుకోవాలి. ఈ ప్రక్రియ 9లోగా పూర్తి చేయాలి' అని ఆదేశాలు జారీ చేసింది. వ్యూహం చిత్రానికి సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఈ నెల 22న తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మ హైకోర్టులో వేర్వేరుగా అప్పీల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ఈ నెల 1న తీర్పు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. సోమవారం తీర్పు వెలువరించింది.



ఈ ప్రపంచంలో గౌరవంగా జీవించడానికి గొప్ప మార్గం మనం ఎప్పుడూ నటిస్తూ ఉండటమే.
– సోక్రటీస్

మంగళవారం, 6 ఫిబ్రవరి 2024

గ్రామీ అవార్డుల పంట!

సంగీతం ఎల్లలెరుగదు. అది విశ్వభాష. ఏ ప్రాంతానిదో తెలియదు... ఎవరు మాట్లాడే భాషో తెలియదు... కనీసం దాని భావమేమిటో కాస్తయినా అర్థంకాదు. కానీ శ్రుతిలయలు జతకలిసి హృదయాలను స్పృశించినప్పుడు ఆ రాగలహరిలో మునకేయని మనిషంటూ వుండరు. అందుకే ఆదివారం రాత్రి అమెరికాలో జరిగిన 66వ గ్రామీ అవార్డుల ఉత్సవంలో మన సంగీత దిగ్గజాలు జకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్, రాకేష్ చౌరాసియా అవార్డుల పంట పండించారు. విఖ్యాత తబలా విద్వాంసుడు జకీర్ హుస్సేన్ ఏకంగా మూడు పురస్కారాలు అందుకున్నారు. నిరుడు జూన్‌లో శక్తి బ్యాండ్ తరఫున విడుదలైన 'దిస్ మూమెంట్' ఆల్బమ్‌కు శంకర్ మహదేవన్‌తో కలిసి ఆయనకు ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్ పురస్కారం లభించగా, సొంతంగా రూపొందించిన 'యాజ్ వి స్పీక్' ఆల్బమ్‌కు పాష్తో కేటగిరిలో మరో రెండు పురస్కారాలొచ్చాయి. ఇదే ఆల్బమ్‌కు ఫ్లూటు అందించిన రాకేష్ చౌరాసియాకు సైతం రెండు అవార్డులొచ్చాయి. ఎనిమిది గీతాలతో రూపొందించిన 'దిస్ మూమెంట్'కు శంకర్ మహదేవన్ గాత్రం సమకూర్చగా, జకీర్ తబలా, జాన్ మెక్‌లాగ్లిన్ గిటార్, గణేష్ రాజగోపాలన్ వయొలిన్ రాగాలు అందించారు. శక్తి బ్యాండ్ విలక్షణమైనది. దాని స్థాపన వెనకున్న ఉద్దేశాలు ఉన్నతమైనవి. 1973లో మెక్ లాగ్లిన్ నేతృత్వంలో అవతరించిన ఆ బృందం ఖండంతరాల్లోని సంగీత దిగ్గజాలను ఒక దరికి చేర్చి ప్రాచ్య, పాశ్చాత్య సంగీత రీతులను మేళవించి తరతరాలుగా ప్రపంచ సంగీత ప్రియులను అబ్బురపరుస్తోంది. ఇప్పుడు గ్రామీ పురస్కారాల ఉత్సవంలో ఎందరో సంగీత దిగ్గజాల సృజనను దాటుకుని 'దిస్ మూమెంట్' విజేతగా నిలిచిందంటే అది సాధారణమైనది కాదు. నిజానికి శక్తి బ్యాండ్ ప్రత్యేక ఆల్బమ్ రూపొందించి దాదాపు 45 ఏళ్లవుతోంది. అనంతరం నిరుడు 'దిస్ మూమెంట్' వచ్చినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆ ఆల్బమ్ ఎన్నో ప్రశంసలు అందుకుంది. జకీర్ హుస్సేన్ గ్రామీ అందుకోవటం ఇది మొదటిసారి కాదు. 1992, 2009లలో కూడా గ్రామీ పురస్కారాలు గెలుచుకున్నాడు. అరవై ఆరేళ్ల గ్రామీ పురస్కారాల చరిత్రలో ప్రముఖ సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్ 1967లో తొలిసారి ఆ అవార్డు గెలుచుకుని భారత సంగీతానికి ప్రపంచఖ్యాతిని తీసుకొచ్చారు. ఆ తర్వాత ఆయనను 1972, 2001 సంవత్సరాల్లోనూ గ్రామీ అవార్డులు వరించాయి. 2008లో ఏఆర్ రెహమాన్ 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రానికి రెండు గ్రామీ అవార్డులు గెలుచుకోగా మన దేశానికి ఒకేసారి ఆరు పురస్కారాలు లభించటం ఇదే తొలిసారి.

విశ్వవిఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ అల్లారఖా కుమారుడిగా జకీర్ హుస్సేన్‌కు ఆ విద్య చిన్ననాడే పట్టుబడింది. పట్టుమని పన్నేండళ్ల ప్రాయానికే దేశదేశాల్లోనూ కచేరీలు ఇవ్వగలిగాడు. ఇరవయ్యేళ్ల వయసుకే ఏటా 150 సంగీత కచేరీలు నిర్వహించేంత తీరికలేని విద్వాంసుడు కావటం జకీర్ ప్రత్యేకత. 70వ దశకంలో ప్రపంచాన్ని విస్మయపరిచిన బీటిల్స్ బృందంతో జతకట్టి అందరితో ఔరా అనిపించుకున్నాడు. సంగీతంలో వాషింగ్టన్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పొందటమే కాదు... ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో ఔత్సాహికుల కోసం వర్క్‌షాప్‌లు నిర్వహించి ఎందరినో తీర్చిదిద్దిన ఘనత జకీర్‌ది. తాను ప్రపంచంలో ఉత్తమ తబలా విద్వాంసుణ్ణి కాదని, ఎందరో విద్వాంసుల్లో ఒకడిని మాత్రమేనని చెప్పుకొనే వినమ్రత జకీర్ సొంతం. తనకు తబలా నేర్పాలని ఏడేళ్ల వయసులో తండ్రి అల్లారఖాను అడిగినప్పుడు 'బేటా ఇందులో నిష్ణాతుణ్ణి కావాలని అత్యాశపడకు. ఒక మంచి విద్యార్థిగా ఎదగాలని కోరుకో. అప్పుడు మెరుగ్గా తయారవుతావు' అని సలహా ఇచ్చారట. తండ్రికిచ్చిన మాట ప్రకారం రోజూ తెల్లారుజామున మూడు గంటలకు లేచి తబలా వాద్యంలో మెలకువలు నేర్చుకోవటం ఆయన ప్రత్యేకత. తాను పుట్టిపెరిగిన ముంబై నగరంలో అందరూ గాఢనిద్రలో వుండేవేళ ఆయన సంగీత సాధన మొదలయ్యేది. అందుకే మరో అయిదేళ్లకే కచేరీలు చేసే స్థాయికి జకీర్ ఎదిగాడు. ఈ కళలో మరేదో నేర్చుకోవాలన్న నిరంతర తపన, ఎప్పటికప్పుడు తనను తాను పునరావిష్కరించుకోవటం అనే గుణాలే జకీర్‌ను ఉన్నత శిఖరాలకు చేరుస్తూ వచ్చాయి. తన సంగీతయానంలో ప్రపంచవ్యాప్తంగా ఎందరో విద్వాంసులను కలుసుకునే అవకాశం లభించటం, వారినుంచి ఎన్నో సంగతులు నేర్చుకోవటం తన ఉన్నతికి దోహదపడ్డాయంటారు జకీర్. కొందరు సంగీత విద్వాంసులు అభిప్రాయపడినట్టు ఆయన సృష్టించిన మేళనాలు వాటికవే విప్లవాత్మకమైనవి కాదు. కానీ తన వాద్యంపై ఆయన సాధించిన అసాధారణమైన పట్టు, సంక్లిష్ట స్వరాల మలుపులకు అనుగుణంగా అలవోకగా తబలాను పలికించటం, తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపొందించుకోవటం జకీర్ విశిష్టత.

ఒక సంగీతకారుడన్నట్టు కళాత్మకమైన సృజనే సంగీత నియమాలను సృష్టిస్తుంది. నిబంధనలు సంగీతాన్నీ, సంగీతకారులనూ సృజించలేవు. జకీర్ అయినా, గుక్కతిప్పుకోకుండా ఎంతటి సంక్లిష్టమైన స్వరాలనైనా ఏకబిగిన పలికించగల శంకర్ మహదేవన్ అయినా, వేణుగాన విన్యాసంలో పేరుప్రఖ్యాతులు గడించిన రాకేష్ చౌరాసియా అయినా గాల్లోంచి ఊడిపడరు. ఎప్పటికప్పుడు తమను తాము ఉన్నతపరుచుకోవాలన్న తపన, నిరంతర అధ్యయన శీలత వారిని ప్రపంచంలో ఉత్తములుగా నిలుపుతాయి. ఏ రంగంలో ఎదగదల్చుకున్నవారికైనా దగ్గరదారులంటూ ఉండవు. సంగీత ప్రపంచాన మన ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసిన ఈ ముగ్గురూ రాగలకాలంలో ఎందరికో ఆదర్శనీయులవుతారు.

మద్దతు ఇవ్వడమే శాశ్వత పరిష్కారం

సందర్భం



దేవీందర్ శర్మ

యూరప్‌లో కనివిని ఎరుగని వ్యవసాయ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్రాన్స్‌లో ప్రారంభమై, జర్మనీకి వ్యాపించి, రొమేనియా, నెదర్లాండ్స్, పోలండ్, బెల్జియం దేశాలను కూడా తాకాయి. మరోవైపు దేశంలో పంజాబ్, హరియాణా, పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల రైతులు తమ నిరసన ప్రదర్శన కోసం ఢిల్లీకి వెళ్లడానికి మళ్లీ సిద్ధమవుతున్నారు. వ్యవసాయ మార్కెట్ల క్రమబద్ధీకరణను ఎత్తివేయడం, వ్యవసాయంపై కార్పొరేట్ నియంత్రణను తీసుకురావడం ఆచరణీయమైన ప్రత్యామ్నాయాలు కావని ఐరోపా అనుభవాలు చాటుతున్నాయి. మార్కెట్లను సరళీకరించడం అనేది వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో విఫలమయింది. అందుకే భారతీయ రైతులు కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కోరుతున్నారు.

ప్రస్తుతం వ్యవసాయదారుల నిరసనలు ఫ్రాన్స్‌లో ప్రారంభమై, జర్మనీకి వ్యాపించాయి. అక్కడ కోపోద్రిక్తులు అయిన రైతులు బెర్లిన్‌ను దాదాపుగా స్తంభింపజేశారు. ఇప్పుడు మళ్లీ ఈ నిరసన ఫ్రాన్స్‌కు తిరిగి వచ్చింది. ఆగ్రహించిన రైతులు ప్యారిస్‌ను ట్రాక్టర్లతో ముట్టడిస్తామని హెచ్చరించారు. వ్యవసాయదారుల ప్రకంపనలు రొమేనియా, నెదర్లాండ్స్, పోలాండ్, బెల్జియంలకు కూడా విస్తరించాయి. స్పానిష్ రైతులు కూడా నిరసనల్లో పాల్గొనాలని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. రైతులు ట్రాఫిక్‌ని అడ్డుకుని ప్రభుత్వ భవనాలపై పేడ చల్లుతున్నారు.

యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్, సభ్య దేశాలలో వ్యవసాయ సమాజంలో పెరుగుతున్న నిరుత్సాహాన్ని, నిరాశను గుర్తించడం ద్వారా బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ పార్లమెంట్‌లో చర్చను ప్రారంభించారు. 'ఎటువంటి ప్రశ్న లేకుండా, సవాళ్లు పెరుగుతున్నాయని మేము అందరం అంగీకరిస్తాము. విదేశాల నుండి పోటీ కావచ్చు, స్వదేశంలో అధిక నియంత్రణ కావచ్చు, వాతావరణ మార్పు కావచ్చు లేదా జీవవైవిధ్యం కోల్పోవడం... పేర్కొనడానికి ఇవి కొన్ని అంశాలు' అని ఆమె అన్నారు.

కానీ సమస్యలను ప్రస్తావించడంలో ఆమె విఫలమైన విషయం ఏమిటంటే... రైతులకు భరోసా ఇవ్వకపోవటం, సరైన ధరను నిరాకరించడం పైనే ప్రధానంగా రైతుల ఆగ్రహం ఉంటోందని. ఉక్రెయిన్ (లేదా ఇతర ప్రాంతాల) నుండి వస్తున్న దిగుమతులు ధరలు తగ్గడానికి కారణమయ్యాయి. అలాగే అనేక దశాబ్దాలుగా వ్యవసాయ వాహనాలకు ఇస్తున్న డీజిల్ సబ్సిడీని ఉపసంహరించుకున్నారు. వాస్తవికత ఏమిటంటే వ్యవసాయ ఆదాయం క్రమంగా క్షీణించడం. 'మాకు ప్రోత్సాహకాలు అక్కర్లేదు. మా ఉత్పత్తులు విలువైనవి, అవి మంచి ధరలకు విక్రయం అవాలని మేము కోరుకుంటున్నాము' అని ఆగ్రహించిన ఒక బెల్జియన్ రైతు చెప్పాడు. వీటన్నింటికీ నిరసనగా వేలాది ట్రాక్టర్లతో ముట్టడించడానికి యూరోపియన్ రైతులను నడిపిస్తున్న నిరాశను ఆయన క్రోడీకరించాడు. 'మేము చనిపోవడానికి మాత్రమే ఇక మిగిలి ఉన్నాము' అని మరొక బెల్జియన్ రైతు వ్యాఖ్యానించాడు.

ఫ్రాన్స్ రైతులలో మూడింట ఒకవంతు మంది కేవలం నెలకు 300 యూరోల (సుమారు రూ. 27,000)తో జీవిస్తున్నారనీ, ఎంపీల భత్యాలను మరో 300 యూరోలు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నారనీ ఒక ఫ్రెంచ్ ఎంపీ ఇటీవల అన్నారు. రైతులు నిరసనల తరుణంలో ఎంపీలకు భత్యాల పెంపుపై తీవ్ర వ్యతిరేకత వస్తుందని భావించి వాటిని తాత్కాలికంగా ఉపసంహరించుకున్నారు. జర్మనీలో 2016–23 సంవత్సరాల మధ్య, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని వ్యవసాయ ఆర్థిక బారోమీటర్ సూచిక చూపిస్తోంది. రొమేనియాలో నికర వ్యవసాయ ఆదాయం 2023లో 17.4 శాతం క్షీణించింది.



యూరప్‌లో రైతుల నిరసన ప్రదర్శన

ఈ పరిస్థితి యూరప్‌కే పరిమితం కాదు. 'వారు మమ్మల్ని ప్రపంచ పటం నుండి తుడిచివేయడానికి ప్రయత్నిస్తున్నారు' అని అమెరికాలోని చిన్న రైతులను ఉటంకిస్తూ వచ్చిన మీడియా నివేదికలను ఇది నాకు గుర్తు చేస్తోంది. అమెరికాలో గ్రామీణ ఆత్మహత్యలు జాతీయ సగటు కంటే 3.5 రెట్లు అధికంగా ఉండటంతో, వ్యవసాయ మాంద్యంలో పెరుగుతున్న ఆటుపోట్లను పరిష్కరించడం జాతీయ సమస్యగా మారుతోంది. భారతదేశంలో 2022లో 11,290 మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతు పట్ల మార్కెట్లు అవగాహనతో ఉన్నట్లయితే రైతులు ప్రపంచ వ్యాప్తంగా అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొనేవారు కాదు. ఇంకా, వ్యవసాయ సంక్షోభానికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనే బదులు, వ్యవసాయం నుండి రైతులను తప్పించడానికి యూరోపియన్ దేశాల ప్రభుత్వాలకు వాతావరణ మార్పు ఉపయోగపడుతోంది.

'రైతుల నిరసనలు సమర్థనీయమైనవే' అని రొమేనియా ప్రధాన మంత్రి మార్సెల్ చొలాకూ అంగీకరించారు. కొత్తగా నియమితులైన ఫ్రెంచ్ ప్రధాని గాబ్రియేల్ అటల్ తమ ప్రభుత్వం 'వ్యవసాయాన్ని అన్నింటికంటే ఉన్నత స్థాయిలో ఉంచాలని' నిర్ణయించుకున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి డీజిల్ సబ్సిడీని ఒకేసారి రద్దు చేయడానికి బదులుగా దశలవారీగా తొలగించాలని జర్మనీ ఇప్పటికే నిర్ణయించింది. ఈ హామీలు ఉన్నప్పటికీ, రైతులకు భరోసాగా ఆదాయాన్ని అందించడంలో మార్కెట్ల వైఫల్యం, వ్యవసాయ రంగంలో పెరుగుతున్న నిరుత్సాహం వెనుక ఉన్న అసలు విలన్‌ను యూరోపియన్ నాయకులెవరూ ఎత్తి చూపలేకపోయారనేది వాస్తవం.

వ్యవసాయ మార్కెట్ల క్రమబద్ధీకరణను ఎత్తివేయడం, వ్యవసాయంపై కార్పొరేట్ నియంత్రణను తీసుకురావడం ఆచరణీయమైన ప్రత్యామ్నాయం అయివుంటే, ఐరోపా ఇప్పుడు దశాబ్దంగా ఎక్కడో ఒకచోట పునరావృతమౌతున్న రైతుల అశాంతిని ఎదుర్కొనేందుకు ఎటువంటి కారణమూ లేకపోయేది. మార్కెట్లను సరళీకరించడం అనేది వ్యవసాయ ఆదాయాన్ని పెంచడంలో విఫల మయిందని ఇప్పుడు స్పష్టంగా చెప్పాలి. వ్యవసాయ ధరలను తక్కువగా ఉంచడం ద్వారా ఆర్థిక సంస్కరణలను ఆచరణీయంగా ఉంచడానికి రూపొందించిన స్థూల ఆర్థిక విధానాలు ప్రాథమికంగా లోపభూయిష్టంగా ఉన్నాయని ఇది చూపిస్తుంది. ఆహార ద్రవ్యోల్బణాన్ని తక్కువగా ఉంచడంపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ, ద్రవ్యోల్బణం యొక్క నిజమైన చోదక శక్తులైన గృహ నిర్మాణం, విద్య, ఆరోగ్యం ఉద్దేశపూర్వకంగా దూరంగా ఉంచబడ్డాయి. అది స్థూల ఆర్థిక వంచన.

రైతులు తరచుగా ఎదుర్కొంటున్న నష్టాలను పూడ్చేందుకు మరిన్ని ప్రోత్సాహకాలు అందించడం శాశ్వత పరిష్కారం కాదని స్పష్టంగా అర్థమైంది. 2020–22లో సంవత్సరానికి 107 బిలియన్ డాలర్ల భారీ మద్దతును గుమ్మరించినప్పటికీ (ఏదేమైనప్పటికీ, సబ్సిడీలు, ప్రత్యక్ష ఆదాయ మద్దతును అత్యధికంగా స్వీకరించే వారిలో యూరోపియన్ రైతులే ఎక్కువగా ఉన్నారు) వ్యవసాయ జనాభాను చెక్కుచెదరకుండా ఉంచడంలో విఫలమయ్యారు. 2023లో యూరోపియన్ వ్యవసాయ నిరసనల కోపాన్ని కూడా అది తగ్గించలేదు. 2024 ప్రారంభం ఆందోళన విస్తరిస్తున్నట్లు, ఇంకా తీవ్రతరం అవబోతున్నట్లు కనిపిస్తోంది.

భారతదేశంలోని రైతు సంఘాల డిమాండ్ ప్రపంచవ్యాప్తంగా వర్తిస్తుండటం ఇక్కడే నేను చూస్తున్నాను. ప్రోత్సాహకాల కోసం అడగడానికి బదులుగా, భారతీయ రైతులు కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను కోరుతున్నారు. కనీస మద్దతు ధరని రూపొందించే ఫార్ములాకు పునర్విమర్శ అవసరం అయినప్పటికీ, మార్కెట్ల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తే, వ్యవసాయ జనాభా త్వరలోనే అంతరించిపోతుందని యూరోపియన్ రైతులు అర్థం చేసుకోవాలి. వ్యవసాయాన్ని ఆచరణీయమైనదిగా మార్చడానికి, వ్యవసాయ ధరలకు కచ్చితమైన హామీ ఇస్తూ, నిర్దేశిత ధర కంటే తక్కువ కొనుగోళ్లకు అనుమతి లభించకుండా చూసుకోవడం ఒక్కటే మార్గం.

హామీ ఇవ్వబడిన వ్యవసాయ ధరలు మార్కెట్లను అస్తవ్యస్తం చేస్తాయని ప్రధాన ఆర్థికవేత్తలు వాదిస్తారు. మార్కెట్లు సర్దుబాటు అవుతాయి, ఆ పేరుతో రైతులకు జీవన ఆదాయాన్ని తిరస్కరించలేము. ధర విధానాలలో చరిత్రాత్మక దిద్దుబాటుకు ఇది సమయం. ఏ రైతూ బాధను అనుభవించకుండా లేదా అతని జీవితాన్ని బలవంతంగా ముగించకుండా ఇది నిలుపుతుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ఫార్ములా



ఓలా, ఊబర్ వంటి టాక్సీలకు కర్ణాటక సరసమైన ధరలను నిర్దేశించింది. 10 లక్షల లోపు వాహనానికి మొదటి 4 కి.మీ.లకు 100 రూపాయలు. తర్వాతి నుంచి కి.మీ.కు 24 రూపాయలు. 10–15 లక్షల వాహనానికి మొదటి 4 కి.మీ.లకు 115. తర్వాతి నుంచి కి.మీ.కు 28. 15 లక్షలు దాటిన వాహనాలకు మొదటి 4 కి.మీ.కు 130. తర్వాతి నుంచి కి.మీ.కు 32. ప్రయాణికులకు, డ్రైవర్‌లకు ప్రయోజనకరమైన ఈ ఫార్ములాను దేశానికంతటికీ వర్తింప చేయగలమా?

– నబీలా జమాల్, జర్నలిస్ట్

మతి తప్పిన మేధావి!



మేధావి యోగేంద్ర యాదవ్ ఏమంటున్నారో వినండి. మమతా బెనర్జీ దేశానికి కొత్త ఆశాజ్యోతి అవ్వాలని మహారాష్ట్ర యువత కోరుకుంటోందట! అప్పుడు మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బెంగాల్‌లా మారితే ఏమౌతుందో తెలుసా?

– అభిషేక్, కాలమిస్ట్

దాచిపెట్టడం దేనికి!



పారదర్శకత విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. విశ్వాసం ఎలాంటి తుపానునైనా ఎదుర్కోగల బృందాలను నిర్మిస్తుంది. కంపెనీ సవాళ్లు, నిర్ణయాలు, కంపెనీ ఏ దిశగా వెళుతోంది అనే వాటిని బహిరంగంగా ఉంచండి. దీని వల్ల మీ బృందం మరింత నిబద్ధతను కలిగి ఉండి, సృజనాత్మకంగా, చురుకుగా పని చేస్తుంది.

– అలెక్సిస్ ఒహానియన్, ఆంత్రప్రెన్యూర్

పెట్టుబడి ప్రియులు



అత్యధిక సంఖ్యలోని స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులతో భారత్‌లో తొలి 7 స్థానాలలో ఉన్న రాష్ట్రాలు: మహారాష్ట్ర – 2 కోట్లు. గుజరాత్ – 1.2 కోట్లు. ఉత్తర ప్రదేశ్ – 80 లక్షలు. కర్ణాటక – 58 లక్షలు. తమిళనాడు– 51 లక్షలు. రాజస్థాన్– 50 లక్షలు. ఢిల్లీ 46–లక్షలు.

– ఆర్.కె., ఐపీవో మంత్ర వ్యవస్థాపకులు

పెళ్లిళ్ల స్కామ్



ఉత్తర ప్రదేశ్‌లో కనివిని ఎరుగని భారీ కుంభకోణం! ఆ ప్రభుత్వం నిర్వహించిన సామూహిక వివాహాలలో వరుళ్ల జాడే లేదు. చివరికి వధువులే తమకు తాము పూల మాల వేసుకుని వెళ్లిపోయారు.

– స్పందన్ జైన్, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ఫత్వా జారీ తగదు!

'ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్' అధ్యక్షుడు డాక్టర్ ఇమామ్ ఉమర్ అహమ్మద్ ఇల్యాసీ సౌమ్యుడు. మతాలు వేరైనప్పటికీ, దేశ ప్రజలందరూ సద్భావనతో మెలగాలనీ, దేశభక్తిని కలిగి ఉండాలనీ, దేశ అభివృద్ధిని కాంక్షించాలనీ, అందుకోసం శక్తి వంచన లేకుండా ప్రజలందరూ కష్టించి పని చేయాలనే ఉన్నత భావాలు కలిగిన వ్యక్తి. జనవరి 22న అయోధ్య రామ మందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా దేశంలోని అనేక రాజకీయ నాయకులకూ, మత సంస్థలవారికీ, వివిధ రంగాల ప్రముఖులకూ 'అయోధ్య రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఆహ్వానం పలికింది. ఆహ్వానం అందుకున్నవారిలో ఇల్యాసీ కూడా ఒకరు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాధు సంతులు, మఠాధిపతులు, స్వామీజీల మధ్య కలివిడిగా ఉంటూ, దేశానికి సంబంధించిన విషయాలు ఎన్నో చర్చించారు. రామ మందిరం ప్రతిష్ఠ కార్యక్రమంతో దేశంలో రూపుదిద్దుకున్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని చూసి ఓర్వ లేని, మతోన్మాద భావజాలాన్ని తలకెక్కించుకున్న కొన్ని ముస్లిం సంస్థలు ఆయనకు వ్యతిరేకంగా ఫత్వాలను జారీ చేసి, దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి.

తనకు వ్యతిరేకంగా ఫత్వా జారీ చేసే అధికారం ఎవరికీ లేదనీ, తాను ఎటువంటి నేరం చేయలేదనీ ఆయన ధీటుగానే సమాధానం ఇచ్చారు. ఆయన సమాధానం ఈ దేశ హితాన్నీ, మత సామరస్యాన్నీ కోరుకునేవాళ్లందరూ స్వాగతిస్తున్నారు. ఈ దేశంలో హిందువులకు ముస్లిములకు మధ్య ఒక వారధిని ఏర్పరచడం అవసరమని ఆలోచించే తాను ఈ కార్యక్రమానికి హాజరయ్యానని ఆయన దేశ ప్రజలకు ఇచ్చిన వివరణ ఎంతో ఉదాత్తంగా ఉంది. మతతత్వ ఆలోచనలకు మేము వ్యతిరేకమని డబ్బా కొట్టుకునే లౌకికవాద నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, మానవ హక్కుల సంఘాల వాళ్ళు, రాజ్యాంగ హక్కుల పరిరక్షకులు అహమ్మద్ ఇల్యాసీకి వ్యతిరేకంగా ఇచ్చిన ఫత్వాపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

– ఉల్లి బాల రంగయ్య, రాజకీయ విశ్లేషకులు

అయినవాళ్లకు తీపి... సామాన్యులకు చేదు...

అభిప్రాయం



జూలకంటి రంగారెడ్డి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల భావోద్వేగాలతో చెలగాట మాడుతూ ఉంది. మరీ ముఖ్యంగా ప్రతి ఎన్నికల సందర్భంలో ఇది మామూలు అయ్యింది. మతాన్ని అడ్డు పెట్టుకొని అధికారాన్ని హస్త గతం చేసుకోవడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని చాప కింద నీరులా దేశం మొత్తం వ్యాప్తిచేసే కార్యక్రమాన్ని యథేచ్ఛగా అమలు చేస్తున్నది. అందుకు నిదర్శనం అయోధ్యలో రామ మందిర ప్రారంభంలో ప్రధాని చేసిన ఉపన్యాసమే! ఎన్నికల ముందు రామ మందిరాన్ని ప్రారంభించి ప్రజల భావోద్వేగాలను తమ వైపు మరల్చుకోవడం బీజేపీ – ఆర్‌ఎస్‌ఎస్‌ల ప్రధాన భూమిక. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాని మోదీ కలిసి రామమందిరాన్ని ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంతో మతం ముసుగులు పూర్తిగా తొలిగిపోయాయి. ఇక అంతా బహిరంగమే!

1990లో ఎల్‌కే అద్వానీ రామజన్మభూమి పేరుతో రథయాత్ర ప్రారంభించి రెండు సీట్లున్న బీజేపీ బలాన్ని 150 సీట్లకు తీసుకొచ్చారు. ఆ తర్వాత అదే రామజన్మ భూమి స్మరణతో బీజేపీ అధికార పీఠాన్ని అధిరోహించింది. ప్రస్తుతం అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ అంకం పూర్తయింది. ఇక మధురలో కృష్ణ దేవాలయం, ఇతర ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలపై దృష్టి సారించింది. రాముడు ప్రజా సంక్షేమాన్ని కాంక్షించాడని చెప్తారు. అధికారాన్ని వదిలి ఇచ్చిన మాట కోసం అడవులకు పోయాడట. అయితే రామనామం జపించే పాలకులు మాత్రం చేసిన వాగ్దానాలను ఉట్టి మీదకు ఎక్కించారు. నిత్యావసర ధరలను ఆకాశ మార్గం పట్టించారు. రైల్వే స్టేషన్‌లో చాయ్ అమ్మినవాడు, వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన నాయకుడు, అందరి కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా మోదీ గురించి ప్రచారం చేస్తే అందరూ గుడ్డిగా నమ్మారు. బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చారు.

పేద ప్రజల, కార్మికవర్గ సంక్షేమం, బడుగు బలహీనవర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు మోదీ. రైతాంగం పట్ల దోపిడీ విధానాన్ని అనుసరించే చట్టాలను సంస్కరణల పేరుతో తీసుకొచ్చారు. కార్మిక వర్గాలను పరిశ్రమల అధిపతులకూ, పెట్టుబడి దారులకూ బానిసలుగా మార్చే చేదు మందులాంటి సంస్కరణలకు చక్కెర పూత పూశారు. కోట్లాది టన్నుల ధాన్యం గోడౌన్లలో మూలుగుతున్నా పేద ప్రజలకు పంచడానికి చేతులు రావడం లేదు కానీ కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను రాయితీలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఈ దేశంలో నిరుద్యోగాన్ని వేగంగా పెంచి పోషిస్తున్నది



ఎవరు? ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన చేస్తామని చెప్పి... ఉన్న ఉద్యోగాలను ఊడ పీకుతున్నారు.

ఎన్ని ప్రభుత్వరంగ సంస్థలను అమ్మింది, బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టితే ఎంత సంపద వచ్చిందో గర్వంగా చెపుకుంటున్నారు. కానీ దేశాన్ని దోచుకుని సరిహద్దులు దాటించిన బడా పారిశ్రామిక వేత్తలను గురించి ఒక్కరోజు కూడా మాట్లాడరు! ప్రజల సొమ్మును పట్టపగలే నిర్భయంగా కోట్లాది రూపాయలను బ్యాంకు రుణాల ద్వారా దోచుకున్న విజయ్ మాల్యా, నీరవ్ మోదీ లాంటి వాళ్ళ గురించి అసలు తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ పదేండ్ల పాలనలో కార్పొరేట్ కంపెనీల అధినేతలు ప్రపంచ కుబేరుల స్థాయికి చేరారు కానీ ప్రజల ఆదాయం, జీవనస్థితులు మాత్రం మారకపోవడం శోచనీయం.

మోదీ అధికారంలోకి వచ్చిన సమయానికి రూ. 65 లక్షల కోట్ల అప్పు ఉన్న మన దేశం నేడు రూ. కోటి 55 లక్షల కోట్లకు ఎగబాకింది. ఇది మోదీ పాలనలో జరిగిన అప్పుల అభివృద్ధి. అప్పులు తీర్చడానికే కేంద్ర బడ్జెట్‌లో అధిక శాతం వడ్డీలకు కట్టాల్సి వస్తోంది.

పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధింపు వంటి చర్యలు దేశాన్ని కుదేలు చేశాయనే సంగతి అందరికీ తెలిసిందే. ఆ తర్వాత వచ్చిన కరోనా మహమ్మారి ప్రజల బతుకులను మరింత కుంగదీసింది. పెద్ద నోట్ల రద్దు ద్వారా ఈ దేశంలో ఉన్న నల్లధనం బయటికి తీసు కొస్తామని జబ్బలు చరిచింది బీజేపీ ప్రభుత్వం. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రజల జన్‌ధన్ ఖాతాల్లో రూ. 15 లక్షలు చొప్పున వేస్తామని చెప్పింది. తీరా చూస్తే ఒక్క రూపాయి నల్లధనం కూడా బయట పెట్టలేకపోయింది? దీనికి తోడు ధరల్ని అదుపు చేయడంలో, నిరుద్యోగం రూపుమాపటంలో, వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో మోదీ పూర్తిగా విఫలమయ్యారు.

ఇది దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న మోదీ రాజ్యం. ఈ రాజ్యంలో ప్రజాసంక్షేమం లేకపోగా పేదల బాధలు రెట్టింపయ్యాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదల తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. కార్మికుల హక్కులు కాలరాయబడ్డాయి. చదువు, వైద్యం కార్పొరేట్ల పరమైంది. మోదీ ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు సీపీఐ (ఎం) లాంటి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ప్రతిఘటిస్తున్నాయి. అయితే ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ – ఆరెస్సెస్ 'రామ రాజ్యం' స్థాపన అంటున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సందర్భంగా మోదీ వేస్తున్న అడుగులను ఈ దేశంలోని యువకులు, ప్రజలు, విద్యావంతులు, మేధావులు గమనించాలి. భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నమైన భారత లౌకికత్వాన్ని ఓటు ద్వారా బలపరచాలి. అంధ విశ్వాసాల నుండి దేశాన్ని కాపాడుకోవాలి.

వ్యాసకర్త మాజీ శాసనసభ్యులు
మొబైల్: 94900 98349

పంచ యజ్ఞాలు

యజ్ఞం అనగానే వేదబ్రాహ్మణులు చేసేది అనుకుంటాం. అయితే 'పంచ మహా యజ్ఞాలు' ఋత్విక్కులు చేసే యజ్ఞాలు కాదు. శాస్త్ర ప్రకారం ప్రతి వ్యక్తీ అనునిత్యం పాటించ వలసిన విధులు. అవి ఏమిటి?

1. **దేవ యజ్ఞం** : నిత్యం దేవుడికి పూజ చేసి ధూపహారతి, కర్పూర హారతి ఇవ్వడం వల్ల దేవతలు తృప్తి చెందుతారు. ఇది దేవయజ్ఞం. సృష్టికి మూల కారకుడైన దేవదేవుని నిత్యం తలుచుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలపటమే దీని ముఖ్యోద్దేశ్యం.



2. **పితృ యజ్ఞం** : మనల్ని కని పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కనిపెట్టుకుని వుండటమే 'పితృ యజ్ఞం'. మరణించిన తాత ముత్తాతలు, మన వంశీయులు మనకు పితృదేవతలు. సదా పూజ్యులు. తల్లిదండ్రులు మరణిస్తే వారు మరణించిన తిథిని గుర్తుపెట్టుకుని ఆ రోజున ఆబ్దికం పెట్టి, బంధు మిత్రాదులకు భోజనం పెట్టడం, నిత్యం పితృదేవత లకు తర్పణాలివ్వడం వల్ల వారు తృప్తిచెందుతారు. ఇది కూడా పితృ యజ్ఞంలో భాగమే!

3. **భూత యజ్ఞం** : గృహస్థు సర్వప్రాణికోటి మీద దయ కలిగి వుండాలి. పశుపక్షులు, క్రిమి కీటకాదులు మానవుడి మీద ఆధారపడి వున్నాయి. అందుకే మనిషికి భూత దయ వుండాలి. రోజూ వాటిలో కొన్నింటికన్నా ఆహారం పెట్టాలి.

4. **మనుష్య యజ్ఞం**: తోటి వారి పట్ల దయ కలిగి వుండాలి. అందరితో సఖ్యంగా వుండాలి. ఎవరైనా సహాయం కోరితే, మనం చెయ్యగలిగితే నిస్వార్థంగా చెయ్యాలి. ఇదే మనుష్య యజ్ఞం.

5. **బ్రహ్మ యజ్ఞం** : వేదాన్ని అధ్యయనం చేయడాన్ని స్వాధ్యాయం అంటారు. ఇదే బ్రహ్మయజ్ఞం. కానీ, అది అందరికీ సాధ్యమయ్యేది, అవకాశమున్నదీ కాదు. కనుక మహర్షులు మరొక అవకాశాన్నిచ్చారు. రామాయణం సాక్షాత్తూ వేదమే. భారతం పంచమవేదం. భాగవతం వేదమనే కల్పవృక్షం నుంచి జారిపడిన పండు. కనుక మనం రామాయణ, భారత, భాగవత, భగవద్గీతాదులను చదివినట్లయితే స్వాధ్యాయం చేసినట్లే. మన అధ్యయనం ద్వారా తెలిసిన విషయాలను ఇతరులతో పంచుకోవడం కూడా ఇందులో భాగమే.

ఈ యజ్ఞాలు దాదాపు ప్రతి ప్రాణి పట్ల మన కర్తవ్యం ఏమిటో చెబుతున్నాయి. ఈ ప్రపంచంలోని అన్ని ప్రాణులూ – ఒకదానిపై మరొకటి ఆధార పడి ఉన్నదన్న సత్యాన్ని ఇవి యజ్ఞాలు గుర్తు చేస్తాయి. పంచ యజ్ఞాలంటే ఎంతో క్లిష్టతరమైనవని అనుకుంటాంగానీ.. ఇవన్నీ ఎంత సులభమైనవో చూశారు కదా! వీటిని మనందరం బాధ్యతగా నిర్వర్తించినట్లయితే మనకూ, మన కుటుంబానికీ, సమాజానికీ శ్రేయస్సును ప్రసాదిస్తాయి.

– భారతి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.ఏకాదశి ప.12.07 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మూల రా.3.31 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ప.11.43 నుండి 1.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.51 నుండి 9.34 వరకు తదుపరి రా.10.56 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** రా.9.11 నుండి 10.56 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.53.

క్లుప్తంగా...

కవిత పిటిషన్ వాయిదా వేసిన సుప్రీం కోర్టు

- ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో వాదనలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. మద్యం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు రద్దు చేయాలంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం విచారించింది. కవిత తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ....గతేడాది మార్చి 27న కోర్టు ఒక ఆర్డర్ ఇచ్చిందని, నళిని చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ వ్యాజ్యాన్ని జత చేశారని గుర్తు చేశారు. అప్పట్నుంచి ఈ కేసు విచారణ వాయిదాలు పడుతోందని, వాదనలకు సిద్ధంగా ఉన్నామని ఒక తేదీని నిర్ణయించాలని కోరారు. ఈ సందర్భంగా ఈడీ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజు సమన్లు అందినప్పటికీ కవిత విచారణకు హాజరుకావడం లేదని ధర్మాసనం దృష్టికి తీసుకురాగా...కేసు కోర్టులో ఉన్నందునే ఆమె విచారణకు హాజరుకాలేదని, కోర్టు ఆదేశాల వరకూ కవితను విచారణకు పిలవబోమని ఈడీ చెప్పిందని సిబల్ వివరించారు. అనంతరం తదుపరి విచారణ ఈ నెల 16న చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

లోక్‌సభ ఎన్నికలకు ముందే కులగణన చేపట్టాలి: జాజుల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల బీసీ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. కులగణన ప్రక్రియను కేబినెట్ ఆమోదించడం శుభపరిణామమంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి మండలి సభ్యులకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కులగణన నిర్వహించకపోవడంతో నిధులు, నియామకాల్లో బీసీలకు న్యాయంగా అందాల్సిన వాటా అందలేదని, కులగణన నిర్ణయంతో వారికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ముందే ఈ కసరత్తు ప్రారంభించాలని, బీసీల లెక్కలు తేలిన వెంటనే రిజర్వేషన్లను పెంచి వేగవంతంగా అమలు చేయాలని జాజుల కోరారు.

బీసీ కులగణన కేసు విచారణ ఏప్రిల్ 29కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: బీసీ కులగణన చేపట్టాలంటూ దాఖలైన వేర్వేరు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్యతోపాటు జి.మల్లేష్ యాదవ్, ఆళ్ల రామకృష్ణ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. ఆయా పిటిషన్లు ఏప్రిల్ 29తో ప్రారంభమయ్యే వారంలో ఒకరోజు విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

రామగుండంలో నిలిచిన విద్యుదుత్పత్తి

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ-థర్మల్ విద్యుత్‌కేంద్రంలో సోమవారం ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్‌లో ఏర్పడిన సాంకేతికలోపంతో విద్యుదుత్పత్తికి విఘాతం కలిగినట్లు అధికారులు తెలిపారు. అప్రమత్తమైన ఇంజనీర్లు, కార్మికులు యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. విద్యుత్ కేంద్రం 50 ఏళ్ల జీవితకాలం పూర్తి చేసుకోవడంతో తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తడం, విద్యుదుత్పత్తి నిలిచిపోవడం సర్వసాధారణంగా మారింది.

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే రాజమల్లు కన్నుమూత



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు (73) సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని తన నివాసంలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఇటీవల తన నివాసంలోకి వెళ్లి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మరణించారని కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు ఆయన భౌతికకాయాన్ని పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లోని స్వగృహానికి తీసుకొచ్చారు. కారోబార్‌గా పనిచేస్తూనే సుల్తానాబాద్ సర్పంచ్‌గా 1981లో ఎన్నికయ్యారు. 1983 ఎన్నికల్లో పెద్దపల్లి అసెంబ్లీ నుంచి టీడీపీ టికెట్ ఆశించినా పొత్తులో భాగంగా సంజయ్ విచార్ మంచ్‌కు ఆ స్థానం కేటాయించడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలయ్యారు. 1989లో టీడీపీ టికెట్‌పై పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1994లో మళ్లీ టీడీపీ తరఫున పోటీ చేసి సుమారు 40 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆయనకు భార్య సుశీల, నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా, రాజమల్లు మృతి పట్ల ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

తాగునీటి కష్టాలకు కారణం కేసీఆరే..

- ఎస్ఎల్‌బీసీ, డిండిలను పట్టించుకోక నల్లగొండ జిల్లాకు అన్యాయం చేశారు: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- కేసీఆర్ కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి తాకట్టు పెట్టారు
- పైగా ఉల్టా కాంగ్రెస్ సర్కారుపై ఆరోపణలు చేస్తున్నారు
- ఆయన మా జిల్లాకు ఎలా వస్తారో చూస్తాం
- బీఆర్ఎస్ హయాంలో అంతా అవినీతేనని ఆరోపణ



నల్లగొండ: ''మాజీ సీఎం కేసీఆర్ కృష్ణా ప్రాజెక్టులను బీజేపీకి తాకట్టు పెట్టారు. పైగా రేవంత్‌రెడ్డే కేంద్రానికి అప్పగించారని ఉల్టా మాట్లాడుతున్నారు. దీనిపై నల్లగొండలో సభ పెడతామంటున్నారు. కేసీఆర్ నల్లగొండకు ఎలా వస్తారో చూస్తాం. కేసీఆర్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలి. లేకుంటే అయన మిలటరీని పెట్టుకుని వచ్చినా నల్లగొండ ప్రజలు తరిమికొడతారు'' అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నల్లగొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం సొరంగమార్గం), డిండి లిఫ్ట్, లోలెవెల్ కెనాల్ ప్రాజెక్టులను పక్కనబెట్టి దక్షిణ తెలంగాణకు కేసీఆర్ అన్యాయం చేశారని వెంకట్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్ హయాంలో ఎస్ఎల్‌బీసీ మంజూరు చేస్తే.. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదని.. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు సాగు, తాగునీటి ఎద్దడి ఏర్పడిందని మండిపడ్డారు. తన బిడ్డ కవిత లిక్కర్ కేసులో జైలుకు పోకుండా ఉండేందుకు కేసీఆర్ బీజేపీకి తలొగ్గి కృష్ణా ప్రాజెక్టులను అప్పగించారని వ్యాఖ్యానించారు. ఏపీ సీఎం వైఎస్ జగన్‌తో కుమ్మక్కై ఏపీ రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు సహకరించి తెలంగాణకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు.

కేసీఆర్ పారిపోయేలా ఉన్నారు!

కమీషన్ల కోసం చేసిన ప్రాజెక్టుల వల్లే జార్ఖండ్ ముఖ్యమంత్రి అరెస్టు అయ్యారని.. కేజ్రీవాల్‌ను కూడా అరెస్టు చేస్తారంటున్నారని కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. తాను జైలుకు పోవాల్సి వస్తుందనే భయంతోనే కేంద్రం ఏం చెబితే కేసీఆర్ అది చేశారని ఆరోపించారు. ''పులి వస్తోందని హరీశ్‌రావు అంటున్నారు. పులి లేదు, గిలి లేదు. మూటాముల్లె సర్దుకుని పోవాల్సిందే. కేసీఆర్ ఓడిపోయినా ప్రైవేటు స్పెషల్ ఫ్లైట్‌ను ఇంకా ఎందుకు రద్దు చేసుకోలేదు? కవిత లిక్కర్ కేసు సమయంలో అద్దెకు తీసుకుని, మాజీ సీఎం అయినా దాన్ని అలానే ఉంచారంటే ఏ రాత్రి అయినా అరెస్టు చేస్తామంటే.. తక్కువ ఫ్యామిలీ అంతా పారిపోయేందుకు స్పెషల్ ఫ్లైట్‌ను సిద్ధంగా ఉంచుకున్నారు. దుబాయ్ వెళ్లిపోతే ఎవరూ అరెస్టు చేయరనేది వారి ఉద్దేశం..'' అని వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. మేడిగడ్డ విషయంలో కేసు నమోదవడం, కేసీఆర్, హరీశ్‌రావు అరెస్టవడం ఖాయమని పేర్కొన్నారు.

హంతకుడికి మంత్రి పదవి ఇచ్చారు

నల్లగొండ జిల్లాకు చెందిన హంతకుడికి కేసీఆర్ మంత్రి పదవి ఇచ్చారని.. ఆ మంత్రి అవినీతికి పాల్పడ్డారే తప్ప ఏనాడూ ప్రాజెక్టులను సందర్శించలేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఉద్దేశించి వెంకట్‌రెడ్డి ఆరోపణలు చేశారు. రెండు పూటలా తిండికి లేని వ్యక్తి మంత్రి అయ్యాక దోపిడీకి పాల్పడ్డాడని, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో దోచుకున్నాడని వ్యాఖ్యానించారు. ఆ అవినీతిపై విచారణ చేయిస్తున్నామని, ఆయన జైలుకుపోక తప్పదని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అంతా అవినీతేనని, హెచ్ఎండీఏ కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తి దగ్గరే వెయ్యి కోట్లు దొరికాయంటే పరిస్థితేమిటో అర్థం చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు.

దద్దమ్మలు కాబట్టే కేంద్రానికి అప్పగించారు

గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ వాళ్లు దద్దమ్మలు కాబట్టే సాగర్ ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ నల్లగొండకు వస్తున్నాడంటేనే కాంగ్రెస్ వారికి ఒంట్లో వణుకు మొదలైందని, వారి లాగులు తడుస్తున్నాయన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించి దొంగ నాటకాలు ఆడుతున్నారంటూ విమర్శించారు. తొమ్మిదేళ్లలైనా నదీ జలాల పంపిణీ చేయలేదని, సాగర్ నుంచి నీరు కావాలంటే కేంద్రం అంత త్వరగా ఇస్తదా అన్నది ఆలోచన చేయాలన్నారు. ప్రాజెక్టులను కేంద్ర పరిధిలోకి తీసుకుపోవడమంటే ఆంధ్రాకు అప్పనంగా నీరు రాసివ్వడమేనని ఆరోపించారు. కాంగ్రెస్ నిర్వాకం వల్ల సాగర్ డ్యామ్ కేంద్రం పరిధిలోకి పోయి మనల్ని అడుగు కూడా పెట్టనివ్వడం లేదని ఆయన విమర్శించారు.

ఆదిలాబాద్ జిల్లాకు నర్సారెడ్డి పేరు పెట్టేందుకు కృషి

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి
- గాంధీభవన్‌లో నర్సారెడ్డి సంతాప సభ
- ఆయన సేవలు గుర్తు చేసుకున్న జానారెడ్డి, కోదండరెడ్డి, వీహెచ్



సోమవారం గాంధీభవన్‌లో జరిగిన నర్సారెడ్డి సంతాప సభలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో కోదండరెడ్డి, వీహెచ్, జానారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవలు చేసిన మాజీ మంత్రి, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి పేరును ఆదిలాబాద్ జిల్లాకు పెట్టేందుకు కృషి చేస్తానని, ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో జరిగిన నర్సారెడ్డి సంతాప సభలో మాజీ మంత్రులు జానారెడ్డి, వి. హనుమంతరావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఏపీలో ఎన్నో పదవులు చేపట్టిన నర్సారెడ్డి సిద్ధాంతం, విలువల కోసం ఎప్పుడూ పాటు పడేవారని కొనియాడారు. మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే నర్సారెడ్డి శాసనసభ ఐక్య వేదిక ఫోరాన్ని ఏర్పాటు చేసి పోరాటం చేశారని, అలాగే కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. వీహెచ్ మాట్లాడుతూ నర్సారెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ నర్సారెడ్డి నియమ, నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీలో పని చేశారన్నారు. కోదండరెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేశారనీ, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన భూ సంస్కరణలో రెవెన్యూ మంత్రిగా తన భూమిని పేదలకు త్యాగం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

అణగారినవర్గాల అభ్యున్నతికే యునైటెడ్ పూలే ఫ్రంట్

- ఎమ్మెల్సీ మధుసూదనాచారి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మధుసూదనాచారి

పంజగుట్ట(హైదరాబాద్): అణగారినవర్గాల అభ్యున్నతికి యునైటెడ్ పూలే ఫ్రంట్ ఏర్పాటు చేశామని, అసెంబ్లీ పవిత్రత మరింత పెరగాలంటే...అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది బీసీలను ఐక్యం చేసి వారి హక్కుల కోసం పోరాడేందుకే ఈ ఫ్రంట్ స్థాపించినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆవిర్భావసభ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ప్రకటించారు. అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ పూలే విగ్రహం ఏర్పాటు చేయడం అంటే..మనల్ని మనం గౌరవించుకోవడమే అన్నారు. హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ అసెంబ్లీకి బీసీలు వెళ్లేందుకు విస్తృతమైన ఆలోచనతో ఏర్పడ్డ సంస్థ యునైటెడ్ పూలే ఫ్రంట్ అన్నారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు మాట్లాడుతూ పూలే విగ్రహ ఏర్పాటు, బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఇందిరాపార్కు వద్ద భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వెంటనే బీసీ కులగణన జరపాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. జ్యోతిబా పూలే, రమాబాయి చరిత్రను పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేశారు.

యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కమిటీ

రాష్ట్ర కన్వీనర్: గట్టు రామచంద్రరావు
అడ్వయిజర్లు: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్
కోకన్వీనర్లు: తాడూరి శ్రీనివాస్, కాసాని వీరేష్ ముదిరాజ్, కృష్ణ, రాజారాంయాదవ్, బొల్ల శివశంకర్, శ్రీనివాస్ పూసల, ముప్పు భిక్షపతి, రాచమల్ల బాలకృష్ణ, రవీంద్రచారి, మహేందర్
ప్రచార కార్యదర్శి: యేరుకొండ నరసన్న

నత్తనడకన 'విశ్వకర్మ'

- రిజిస్ట్రేషన్ టార్గెట్‌లో చొరవ చూపని తెలంగాణ సహా పలు రాష్ట్రాలు
- పీఎం విశ్వకర్మ పథకానికి ఏపీలో 43 వేల రిజిస్ట్రేషన్లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గతేడాది ప్రారంభించిన పీఎం విశ్వకర్మ పథకం అమలు తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో నత్తనడకన సాగుతోంది. 2023-24లో 6 లక్షల లబ్ధిదారులకు ఈ పథకం చేరాల్సి ఉండగా... రిజిస్ట్రేషన్ టార్గెట్‌లో తెలంగాణసహా పలు రాష్ట్రాలు చొరవ చూపించడంలేదని గణాంకాలు వెల్లడించాయి. గత నెల 31వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 3,23,556 మంది కళాకారులు మాత్రమే తమ పేర్లను నమోదు చేసుకున్నారని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ సహాయ మంత్రి భానుప్రతాప్ సింగ్ వర్మ సోమవారం రాజ్యసభలో పేర్కొన్నారు. కాగా ఈ పథకం కోసం ఆంధ్రప్రదేశ్‌లో 43,946 మంది తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. అత్యధికంగా కర్ణాటకలో 1,08,922 మంది నమోదయ్యారు. తెలంగాణలో 1, తమిళనాడులో 1, పశ్చిమబెంగాల్‌లో 1, బిహార్‌లో 1, ఢిల్లీ, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, సిక్కిం రాష్ట్రాల్లో కనీసం ఒక్కరు కూడా తమ పేరును నమోదు చేసుకోలేదని కేంద్రమంత్రి పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా విశ్వకర్మ సర్టిఫికెట్ ఐడీ కార్డు, స్కిల్ అప్‌గ్రెడేషన్, టూల్‌కిట్ ఇన్సెంటివ్, క్రెడిట్ సపోర్ట్, డిజిటల్ లావాదేవీలకు ప్రోత్సాహకం, మార్కెటింగ్ సపోర్ట్ ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఈ పథకం కోసం 2030-31 వరకు ఎనిమిదేళ్ల కాలానికి రూ.13 వేల కోట్లు కేటాయించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు బీజేపీ ఎంపీ డా.కె.లక్ష్మణ్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

టీజీ అక్షరాలు సముచితం: తూళ్ల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాహనాల నంబర్ ప్లేట్లపై 'టీజీ'అనే అక్షరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం పట్ల మాజీ హోంమంత్రి టి.దేవేందర్‌గౌడ్ తనయుడు తూళ్ల విజయేందర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. 2008లోనే దేవేందర్‌గౌడ్ నేతృత్వంలో ఏర్పాటైన 'నవ తెలంగాణ పార్టీ'తెలంగాణలోని అన్ని వాహనాలకు 'టీజీ'అనే అక్షరాలు వాడాలన్న ప్రతిపాదనను తెచ్చిందని సోమవారం ఓ ప్రకటనలో గుర్తు చేశారు.

కాంగ్రెస్ వశమైన నల్లగొండ మున్సిపాలిటీ

- మున్సిపల్ చైర్మన్‌గా బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక



నల్లగొండ టూటౌన్: నల్లగొండ మున్సిపల్ చైర్మన్ సీటు కాంగ్రెస్ వశమైంది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన గత చైర్మన్‌పై జనవరి 8న అవిశ్వాసం పెట్టగా అది నెగ్గింది. దీంతో కొత్త చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. సోమవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రస్తుతం ఫ్లోర్ లీడర్‌గా ఉన్న బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పేరును 14వ వార్డు కౌన్సిలర్ శంకర్ ప్రతిపాదించారు. ఇతర పార్టీల నుంచి ఎవరూ చైర్మన్ అభ్యర్థిగా ముందుకు రాకపోవడంతో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అనంతరం బుర్రి శ్రీనివాస్‌రెడ్డితో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. కౌన్సిల్‌లో మొత్తం 48 మంది కౌన్సిలర్లు ఉండగా, ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఓట్లతో కలుపుకొని 50 ఓట్లు ఉండగా నలుగురు సభ్యులు సోమవారం నిర్వహించిన సమావేశానికి రాలేదు. ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చైర్మన్ ఎన్నిక సమావేశానికి హాజరు కాలేదు.

ఇల్లెందులో వీగిన అవిశ్వాసం

- మున్సిపాలిటీలో కోరం లేని ఫలితం
- ఓ కౌన్సిలర్‌ను హైదరాబాద్ తరలించిన కాంగ్రెస్ శ్రేణులు
- గోడ దూకి పారిపోయిన మరో కౌన్సిలర్



మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావును తీసుకెళ్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై కొందరు కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాసం వీగిపోయింది. సమావేశానికి తగిన కోరం లేనందున అవిశ్వాసం వీగిపోయినట్లుగా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కొత్తగూడెం ఆర్డీఓ శిరీష ప్రకటించారు. కౌన్సిలర్ల అవిశ్వాసం నేపథ్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఈవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లకు గాను కోరం సరిపోవాలంటే 17 మంది హాజరు కావాల్సి ఉంది. అయితే సమావేశ సమయానికి ఇద్దరు తక్కువగా 15 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో కొంత సమయం ఇస్తూ సమావేశం వాయిదా వేశారు. తర్వాత 12 గంటలకు మరోమారు సమావేశపర్చగా అప్పటికీ 15 మంది మాత్రమే ఉండడంతో కోరం లేదని ఈవో ప్రకటించారు.

17 మంది రాత్రికే చేరుకున్నా..: అవిశ్వాస పరీక్ష నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న పెన్షనర్ భవన్‌లోకి ఆదివారం రాత్రికే 17 మంది కౌన్సిలర్లు చేరుకున్నారు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో వారంతా మున్సిపల్ కార్యాలయంలోకి పరుగులు తీశారు. అయితే మున్సిపల్ కార్యాలయం ఎదుట వేచి ఉన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ వారిని గమనించారు. కొక్కు నాగేశ్వరరావు అనే కౌన్సిలర్‌ను కాంగ్రెస్ శ్రేణులు ఎత్తుకుని ఎదురుగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్లి, వెనుక నుంచి రోడ్డుపైకి తీసుకెళ్లి అప్పటికే సిద్ధంగా ఉంచిన ఓ కారులో హైదరాబాద్‌కు తరలించారు. ఇదే క్రమంలో పెన్షనర్ భవన్‌లో దాక్కుని ఉన్న సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్ బయటకు రాగానే కాంగ్రెస్, దాని మిత్రపక్ష సీపీఐ శ్రేణులు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. కానీ పోలీసులు అడ్డుకుని విడిపించారు. అయితే అప్పటికే మున్సిపాలిటీలో తమ సభ్యుడి కోసం కాచుకుని కూర్చున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా రవీందర్‌తో మాట్లాడటంతో ఆయన కార్యాలయం వెనుక గోడ దూకి పారిపోయారు. ఇలా ఇద్దరు సభ్యులు తక్కువ కావడంతో కోరం చాలక అవిశ్వాసం వీగిపోయింది. ఈ నేపథ్యంలో పోలీసులతో బీఆర్ఎస్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు వాగ్వాదానికి దిగారు. గంట పాటు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అక్కడి నుంచి ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అధికార పార్టీ నేతలు, ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ వెంకటేశ్వరావుపై ఫిర్యాదు చేశారు.

కోరం కనకయ్యపై కేసు నమోదు

తన భర్తను కిడ్నాప్ చేశారంటూ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు 17 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. ఎంపీపీ నాగరత్నమ్మ, ఆమె భర్త జానీ తదితరులపై కేసు నమోదైందని వివరించారు.

మేడారం జాతరకు ఆరు వేల బస్సులు

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతరకు ఆరు వేల ఆర్టీసీ బస్సులు నడుపుతామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ములుగు జిల్లా మేడారంలో మంత్రి సీతక్కతో కలిసి ఆయన సోమవారం జాతర జరిగే ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈసారి జాతరకు 51 ప్రదేశాల నుంచి ఆరు వేల బస్సులు నడుపుతామని, జాతరకు వచ్చిన భక్తులను సురక్షితంగా తిరిగి గమ్యానికి చేరవేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం జాతర పనులన్నీ ఈనెల 15 నాటికి పూర్తవుతాయని చెప్పారు. మేడారం జాతరను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలని కోరారు. అంతకుముందు గట్టమ్మ తల్లిని మంత్రులు దర్శించుకున్నారు.

కేంద్రంపై ఇక తిరుగుబాటే..!

- వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలూ బీసీలకు 50% సీట్లు ఇవ్వాలి
- బీసీలకు సీఎం జగన్ పెద్ద పీట వేశారు: ఆర్.కృష్ణయ్య
- జంతర్‌మంతర్ వద్ద బీసీ సంఘాల ధర్నా



జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో ఆర్. కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: సుదీర్ఘకాలంగా బీసీ సమస్యలపై తాము ఎన్ని పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోతే తిరుగుబాటుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, బీసీలపై క్రీమీలేయర్ విధానం ఎత్తివేయాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో సోమవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తక్కువ నిధులను కేటాయించడం సిగ్గుచేటని, 75 కోట్ల మంది బీసీలకు రూ.2వేల కోట్లు కేటాయించడం బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిదర్శనమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

బీసీలకు వైఎస్ జగన్ ప్రాధాన్యత..

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్ద పీట వేశారని, జగన్ చేసినట్లు దేశంలో ఏ ఒక్క రాష్ట్ర సీఎం చేయలేదని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. చట్టసభల్లో అత్యధిక సీట్లు బీసీలకు కేటాయించడమే కాకుండా, కులగణన సైతం చేపట్టారని తెలిపారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు సగం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు మొదలు అన్ని రంగాల్లో బీసీలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్న వ్యక్తి సీఎం జగన్ మాత్రమేనని కృష్ణయ్య కొనియాడారు.



డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్డీ)లో ఇండియన్ ఎకనమిక్ సర్వీస్ అధికారుల కోసం రెండు వారాలపాటు జరిగే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంసీఆర్ హెచ్ఆర్డీ డీజీ, ఐఏఎస్ అధికారి శంశాక్ గోయెల్ పాల్గొని అధికారులనుద్దేశించి మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో అధికారులు నేర్చుకునే సిలబస్ కోర్సుకు సంబంధించిన ప్రతులను శంశాక్ గోయెల్‌తోపాటు ప్రొఫెసర్ టీసీఏ అనంత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ కందుకూరి ఉషారాణి, ప్రొఫెసర్ అబ్బాస్ అలీ పాల్గొన్నారు.

'జ్ఞానవాపి' మిగతా బేస్‌మెంట్లలోనూ సర్వే

వారణాసి జిల్లా కోర్టులో పిటిషన్..నేడు విచారణ

వారణాసి: వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న జ్ఞానవాపి మసీదు సముదాయంలో మూసివేసి ఉన్న ఇతర అన్ని బేస్‌మెంట్లలోనూ భారత పురావస్తు శాఖ(ఏఎస్‌ఐ)తో సర్వే చేయించాలంటూ వారణాసి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలైంది. శ్రింగార్ గౌరీ కేసు కక్షిదారుల్లో ఒకరు, విశ్వ వేదిక్ సనాతన్ సంఘ్ వ్యవస్థాపకుడు రాఖీ సింగ్ సోమవారం ఈ పిటిషన్ వేశారు. శ్రింగార్ గౌరీ కేసుపై విచారణ జరిపిన వారణాసి జిల్లా కోర్టు ఆదేశాల మేరకు.. గతవారం మసీదు సముదాయంలోని 1993 నుంచి మూసివేసి ఉన్న దక్షిణ సెల్లార్‌ను అధికారులు తెరవడం, హిందువులు పూజలు ప్రారంభించడం తెలిసిందే.



పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో అక్రమాలపై కేంద్రం కొరడా

ఐదేళ్ల జైలు
రూ. కోటి జరిమానా

న్యూఢిల్లీ: ఉద్యోగాల భర్తీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీ ఉదంతాలతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో పరీక్షల అక్రమార్కులపై కేంద్రం కఠిన చర్యల కొరడా ఝులిపించింది. పేపర్ లీకేజీలు, నకిలీ వెబ్‌సైట్లుసహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపరీక్షల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు–2024'ను తీసుకొచ్చింది. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వం, దాని ఏజెన్సీలు నిర్వహించే పబ్లిక్ ఎగ్జామ్స్‌లో అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించేందుకు ఇన్నాళ్లూ ప్రత్యేకంగా ఎలాంటి చట్టం లేకపోవడంతో దీనిని తీసుకొచ్చారు.

బిల్లులో ఏముంది?

- ప్రశ్నపత్రం, ప్రశ్నపత్రం కీ లీకేజీకి పాల్పడి నా, కంప్యూటర్ నెట్‌వర్క్/ రీసోర్స్/ సిస్టమ్‌ను ట్యాంపర్ చేసిన వ్యక్తులు/సంస్థలను కఠినంగా శిక్షిస్తారు
- నకిలీ వెబ్‌సైట్లు నిర్వహించడం, నకిలీ ఉద్యోగ/ప్రవేశ పరీక్షలు చేపట్టడం, నకిలీ అడ్మిట్ కార్డులు, ఆఫర్ లెటర్లు ఇవ్వడం, ఒకరి బదులు ఇంకొకరితో ఎగ్జామ్ రాయించడం వంటి అవకతవకలు చేసి నగదు వసూళ్లకు పాల్పడితే గరిష్ఠంగా ఐదేళ్ల జైలు, రూ.10 లక్షల జరిమానా విధిస్తారు.
- వీటితో ప్రమేయమున్న వ్యక్తులు/సంస్థలు/ఏజెన్సీలు/వ్యాపారసంస్థలు/ సబ్‌కాంట్రాక్టర్‌కు రూ.1 కోటి జరిమానా విధిస్తారు. ఇంకోసారి ప్రభుత్వం నుంచి సంబంధిత పనులు చేపట్టకుండా నాలుగేళ్లపాటు నిషేధం విధిస్తారు.
- యూపీఎస్‌సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వంటి సంస్థలు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత ఎగ్జామ్స్‌లో కలగజేసుకున్న అక్రమార్కులను సంబంధిత నియమాల కింద శిక్షిస్తారు. నీట్, జేఈఈ, సీయూఈటీ పరీక్షలకూ ఈ బిల్లులోని నియమాలు వర్తిస్తాయి.
- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ బాధ్యతలు చూసే కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాల సిబ్బంది మొత్తం ఈ చట్టపరిధిలోకి వస్తారు.

రామ్ లల్లా ప్రాణప్రతిష్ట సాహసోపేత చర్య

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్య

పుణే: అయోధ్య రామాలయంలో జనవరి 22వ తేదీన బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట ఎంతో సాహసోపేతమైన చర్య అని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ చెప్పారు. ఆ శ్రీరాముని ఆశీస్సులు, మనోభీష్టం వల్ల, మనం చేసుకున్న పుణ్యం వల్లనే ఆ బృహత్తర కార్యక్రమం పూర్తయిందే తప్ప, కేవలం మనందరి కృషి కారణంగా మాత్రమే జరిగింది కాదని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని పుణే జిల్లా అలండిలో చేపట్టిన గీతా భక్తి అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో సోమవారం భాగవత్ మాట్లాడారు. అయోధ్య రామాలయంలో కొలువు దీరిన బాల రాముడిని చూడటం ఇప్పటి తరం అదృష్టమన్నారు.

మే 10లోగా భారత బలగాల ఉపసంహరణ

మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ప్రకటన

మాలె: మాల్దీవుల్లో భారత సైనిక బలగాల ఉపసంహరణ మే 10వ తేదీలోగా పూర్తవుతుందని ఆ దేశాధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు తెలిపారు. మొదటి బృందం మార్చి 10వ తేదీలోగా, మిగతా సైనికులు మే 10వ తేదీలోగా ఖాళీ చేస్తారని ఆయన సోమవారం దేశ పార్లమెంట్‌లో ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలపై ఇరు దేశాల మధ్య దౌత్య స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ గడువును పొడిగించేది లేదని కుండబద్దలు కొట్టారు.

పోలీస్‌స్టేషన్‌పై ఉగ్ర దాడి... 10 మంది మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని కల్లోలిత ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌పై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 10 మంది పోలీసులు మృతి చెందారు. డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లా చౌద్వాన్ పోలీస్‌స్టేషన్‌ను అత్యాధునిక ఆయుధాలు ధరించిన ఉగ్రవాదులు ఒక్కసారిగా చుట్టుముట్టి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో స్టేషన్‌లో విధుల్లో ఉన్న 10 మంది పోలీసులు చనిపోగా మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఉగ్రవాదులు తప్పించుకుని పారిపోయారు.

లంక అదుపులో 23 మంది భారత మత్స్యకారులు

కొలంబో: తమ ప్రాదేశిక జలాల్లో చేపలు పడుతున్నారంటూ శ్రీలంక నావికా దళం భారత్‌కు చెందిన 23 మంది మత్స్యకారులను, రెండు ట్రాలర్లను అదుపులోకి తీసుకుంది. జాఫ్నాకు సమీపంలో శనివారం ఘటన జరిగిందని శ్రీలంక నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. మత్స్యకారులను, ట్రాలర్లను కంకేశన్‌తురై హార్బర్‌కు తరలించామని పేర్కొంది. జనవరిలో కూడా శ్రీలంక నేవీ భారత్‌కు చెందిన 36 మంది మత్స్యకారులను అదుపులోకి తీసుకుంది.

ఆస్ట్రేలియా సెనేట్ సభ్యుడిగా వరుణ్ ఘోష్



కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా సెనేట్‌లో మొట్టమొదటి సారిగా భారత సంతతికి చెందిన న్యాయవాది వరుణ్ ఘోష్ (38) స్థానం సంపాదించారు. లేబర్ పార్టీ తరఫున ఆయన వెస్టర్న్ ఆస్ట్రేలియాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రస్తుత సెనేటర్ పాట్రిక్ డాడ్సన్ అనారోగ్య కారణాలతో రిటైర్ కానున్నారు. ఆయన స్థానంలో ఫెడరల్ పార్లమెంట్‌కు వరుణ్‌ను ఎన్నుకున్నట్లు వెస్టర్న్ ఆస్ట్రేలియా లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రకటించింది. 1985లో భారత్‌లో జన్మించిన వరుణ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులతోపాటు ఆస్ట్రేలియాకు వచ్చారు.

గగన లక్ష్యం 'అభ్యాస్' పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ: గగనతలంలో దూసుకొచ్చే శత్రు క్షిపణులు, బాంబులను కూల్చగలిగే నిర్దేశిత లక్ష్య వ్యవస్థను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణశాఖ సోమవారం ప్రకటించింది. రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) తయారు చేసిన హై–స్పీడ్ ఎక్స్‌పెండబుల్ ఏరియల్ టార్గెట్ (హెచ్ఈఏటీ)– అభ్యాస్‌ను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి రెండోతేదీ దాకా ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో పరీక్షించినట్లు రక్షణ శాఖ పేర్కొంది. అభ్యాస్ డిజైన్‌ను డీఆర్‌డీవో వారి ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(ఏడీఈ) డిజైన్ చేసింది. స్వదేశీయంగా తయారుచేసిన ఆటోపైలట్ విధానంలో తనంతట తానే ఎగరగలదు. రాడార్, విజువల్, ఇన్‌ఫ్రారెడ్ వ్యవస్థలు అభ్యాస్‌లో ఉంటాయి. తనను ఢీకొట్టే క్షిపణుల పరామితులను ఇది రికార్డ్ చేయగలదు. దీంతో మన అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది.

వెయ్యేళ్ల ప్రగతికి పునాది

▶ మొదటి పేజీ తరువాయి

ఉండేదంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సోమ వారం లోక్‌సభలో బదులిస్తూ ప్రధాని పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోయారు. ''మహా అయితే 100 నుంచి 125 రోజులు! మేం వరుసగా మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాం'' అని స్పష్టం చేశారు. 'అబ్ కీ బార్ (ఈసారి)' అంటూ మోదీ పదేపదే నినదించగా, '400 పార్ (400 స్థానాలు దాటేస్తాం)' అంటూ బీజేపీ సభ్యులంతా ప్రతిసారీ ముక్త కంఠంతో గొంతు కలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ మాటే అంటున్నారని రాజ్యసభలో ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ మోదీ చెప్పారు. తమ ప్రభుత్వ ఘనతలను వివరిస్తూ, విపక్షాలను, ముఖ్యంగా కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని ప్రధాని తూర్పారబట్టారు. వాటిపై విపక్షాల అభ్యంతరాలను, సభ్యుల నినాదాలను పట్టించుకోకుండా దాదాపు 100 నిమిషాల పాటు ఏకధాటిగా ప్రసంగించారు. శతాబ్దాల ఎదురుచూపులు ఫలించి అయోధ్యలో మళ్లీ కొలువుదీరిన రాముడు దేశ ప్రగతి పయనానికి నూతన జవసత్వాలు అందిస్తాడన్నారు.

కూటమి సారథిగానూ కాంగ్రెస్ విఫలం

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో నిర్మాణాత్మక సలహాలిచ్చే అవకాశాన్ని విపక్షాలు చేజార్చుకున్నాయని మోదీ అన్నారు. ''దాంతో వారిపై దేశ ప్రజలకు పూర్తిగా భ్రమలు తొలగాయి. విపక్షాలు తాము సుదీర్ఘకాలం పాటు విపక్షాలుగానే ఉంటామంటూ తీర్మానించుకున్నాయి. వారు మాట్లాడుతున్న ప్రతి మాటా అందుకు అద్దం పడుతోంది. వాటి నిర్ణయాన్ని అభినందిస్తున్నా'' అంటూ చెణుకులు విసిరారు. ఓటమి భయంతో చాలామంది విపక్ష నేతలు ఇప్పటికే స్థానాలు మారుతున్నారని, రాజ్యసభకు వెళ్లే ప్రయత్నాల్లోనూ పడ్డారని మోదీ ఎద్దేవా చేశారు. ''విపక్షాలన్నీ కిందా మీదా పడి ఏర్పాటు చేసిన ఇండియా కూటమి విచ్ఛిన్నమైంది. ఇప్పుడా పార్టీలన్నీ ఎక్లా చలో (ఒంటరిగా పోతాం) అంటున్నాయి'' అని తృణమూల్ కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉద్దేశించి బెంగాలీలో చమత్కరించారు. దేశంలో విపక్షాల ఈ దీన స్థితికి కాంగ్రెసే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. తద్వారా కాంగ్రెస్ ఒక పార్టీగానే గాక కూటమి సారథిగా కూడా విఫలమైందని చెప్పే ప్రయత్నం చేశారు. ''కుటుంబ పాలనతో కాంగ్రెస్ ముందే పూర్తిగా భ్రష్టు పట్టిపోయింది. నిర్మాణాత్మక విపక్ష పాత్ర పోషించడంలోనూ గత పదేళ్లుగా పదేపదే విఫలమైంది. తద్వారా ప్రజల నమ్మకం చూరగొనే సువర్ణావకాశాన్ని చేజేతులా పోగొట్టుకుంది. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పుడిక దశాబ్దాల పాటు విపక్షంలోనే ఉండాలని గట్టిగా నిర్ణయించుకుంది! ప్రజలు కూడా ఆ పార్టీని అక్కడే ఉంచడం ద్వారా ఆశీర్వదిస్తారు! అక్కడి నుంచి కాంగ్రెస్ మరిన్ని ఎత్తులకు చేరి త్వరలో లోక్‌సభ ప్రేక్షకుల గ్యాలరీల్లో దర్శనమిస్తుంది'' అంటూ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఒకే ప్రోడక్టును పదేపదే లాంచ్ చేస్తోందని రాహుల్‌ను, ఆయన చేపట్టిన భారత్ జోడో, న్యాయ్ యాత్రలను ఉద్దేశించి మోదీ అన్నారు. ''ఇది ఎన్నికల వేళ. కాస్త కష్టపడి ఏదన్నా కొత్తగా ప్రయత్నించాల్సింది. జనాలకు కొత్త సందేశమేదన్నా ఇవ్వాల్సింది. కానీ ఈ విషయంలోనూ కాంగ్రెస్ ఘోరంగా విఫలమైంది'' అంటూ తూర్పారబట్టారు. ఈ దెబ్బతో కాంగ్రెస్ దుకాణం బహుశా అతి త్వరలో మూతబడవచ్చని జోస్యం చెప్పారు. ''దాంతో ఏం చేయాలో తెలియని అయోమయ స్థితికి కాంగ్రెస్ దిగజారింది. రద్దు సంస్కృతిని అలవర్చుకుంది. కేవలం నాపై అక్కసుతో దేశం సాధించిన, సాధిస్తున్న ప్రతి ఘనతనూ రద్దు చేసి చూపించే ప్రయత్నం చేస్తోంది'' అంటూ మండిపడ్డారు.



''దేశానికి కావాల్సింది ఆరోగ్యకరమైన విపక్షం. కానీ రాహుల్‌కు ఎక్కడ పోటీ వస్తారోనని కాంగ్రెస్‌లోని యువ నేతల గళాలను నాయకత్వమే అణచేస్తోంది. దానిది రాచకుటుంబాన్ని దాటి చూడలేనితనం'' అంటూ దుయ్యబట్టారు.

అవినీతికి విపక్షాల అండ!

బీజేపీ సర్కారుపై విపక్షాలు చేస్తున్న అవినీతి ఆరోపణలపై మోదీ తీవ్రంగా మండిపడ్డారు. అవినీతికి, అందుకు పాల్పడుతున్న నేతలకు విపక్షాలే అడుగడుగునా కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. అవినీతి నేతలను కీర్తిస్తూ దేశానికి అవి ఏం సందేశమిస్తున్నాయని ప్రశ్నించారు. పైగా అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్నందుకు తనపై, తన ప్రభుత్వంపై నిత్యం దుమ్మెత్తిపోస్తున్నాయని ఆక్షేపించారు. ''నన్నెంత విమర్శించినా అవినీతిపై, అవినీతి నేతలపై కఠిన చర్యలు ఆగబోవు. దోచిందంతా కక్కాల్సిందే. దేశాన్ని దోచుకుంటున్న వారు మూల్యం చెల్లించాల్సిందే. పవిత్ర సభ సాక్షిగా దేశానికి నా వాగ్దానమిది'' అన్నారు. దర్యాప్తు సంస్థలు విపక్ష నేతలను లక్ష్యం చేసుకుంటున్నాయన్న ఆరోపణలను తోసిపుచ్చారు. ''కాంగ్రెస్ హయాంలో అలాగే జరిగింది. అప్పట్లో దేశంలో ఎటు చూసినా అవినీతి తాండవమాడేది. పార్లమెంటులో చర్చంతా అవినీతి చుట్టే సాగేది. మా పాలనలో మాత్రం దర్యాప్తు రాజ్యాంగ నిర్దేశం మేరకు స్వతంత్రంగా పని చేస్తున్నాయి. వాటి పనితీరుపై తీర్పు చెప్పాల్సింది కోర్టులు మాత్రమే'' అని చెప్పారు. కాంగ్రెష్ పాలనలో ఈడీ కేవలం రూ.5,000 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేయగా తమ హయాంలో అది ఏకంగా రూ.లక్ష కోట్లు దాటిందని చెప్పారు.

దేశ సామర్థ్యంపై నెహ్రూకు నమ్మకం లేదు: మోదీ

భారతీయులు దద్దమ్మలు, బద్ధకస్తులని భావించేవారు ● ఇందిరదీ అదే ధోరణి

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై మోదీ తన ప్రసంగంలో సునిశిత విమర్శలు చేశారు. దేశం చిరకాలం పాటు ఎదుర్కొన్న ఇక్కట్లకు, కశ్మీరీల సమస్యలకు ఆయన ఘోర తప్పిదాలే మూల కారణమని ఆరోపించారు. ''భారతీయుల శక్తి సామర్థ్యాలపై నెహ్రూకు ఎన్నడూ నమ్మకమే లేదు. వాళ్లు బద్ధకస్తులని, తెలివితక్కువ వాళ్లని భావించేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ఇదే విషయాన్ని నెహ్రూ స్పష్టంగా పేర్కొన్నారు. యూరోపియన్లు, జపానీయులు, చైనీయులు, రష్యన్లు, అమెరికన్ల మాదిరిగా భారతీయులకు కష్టపడే స్వభావం లేదన్నారు. మనలను న్యూనతపరిచేందుకు వాళ్లను పొగిడారు. నెహ్రూ కుమార్తె, మాజీ ప్రధాని ఇందిరాగాంధీది కూడా అదే ధోరణి. ఏదన్నా మంచి పని పూర్తయ్యే దశలో బద్ధకించడం భారతీయులకు అలవాటని, అడ్డంకి ఎదురవుతూనే ఆశలొదిలేసుకుంటామని, కొన్నిసార్లు మొత్తం దేశమే ఓటమిని ఒప్పుకున్నట్టుగా కనిపిస్తుందని తక్కువ చేసి మాట్లాడారామె. భారతీయుల పట్ల ఆ రాచకుటుంబం భావన ఇదీ! తమను పాలకులుగా భావించుకుంటూ నిత్యం ప్రజలను కించపరిచిన చరిత్ర గాంధీ కుటుంబానిది. నెహ్రూ, ఇందిరల ఈ భావజాలమే కాంగ్రెస్‌కూ పాకింది. గాంధీ కుటుంబం చేతిలో బందీగా మారిన ఆ పార్టీ ప్రజల ఆకాంక్షలను, విజయాలను ఎప్పుడూ గుర్తించలేదు. గుర్తించజాలదు కూడా. భారతీయుల శక్తిసామర్థ్యాలను గుర్తించడంలో ఇందిర ఘోరంగా విఫలమయ్యారు గానీ నేటి కాంగ్రెస్ నేతలను మాత్రం అప్పట్లోనే ఆమె సరిగ్గా అంచనా వేశారనిపిస్తుంది! ఎందుకంటే ఆమె వ్యాఖ్యలు వారికి అతికినట్టుగా సరిపోతాయి'' అని మోదీ అన్నారు. భారత్, భారతీయుల శక్తి సామర్థ్యాలపై తనకు అపారమైన విశ్వాసముందని చెప్పారు. ప్రధానిగా తన మూడో టర్ములో భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, ఇది తన హామీ అని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలో ఉండగా పెద్ద ఆలోచనలు చేసేందుకు కూడా జంకిందని ఎద్దేవా చేశారు. ''కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ సర్కారు తప్పులన్నింటినీ మా తొలి టర్ములో సరిదిద్దాం. రెండో టర్ములో నూతన భారతానికి పటిష్టమైన పునాదులు వేశాం. మూడో టర్ములో వికసిత భారత్ లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా సాగుతాం'' అంటూ భవిష్యద్దర్శనం చేశారు.

కాంగ్రెస్ పాలనలో ఓబీసీలకు అన్యాయం

కాంగ్రెస్, యూపీఏ సర్కారు ఓబీసీలకు తీరని అన్యాయం చేశాయని, ఓబీసీ నేతలను ఘోరంగా అవమానించాయని మోదీ దుయ్యబట్టారు. ఎన్డీఏ సర్కారులో ఓబీసీల లెక్కలు తీసిన కాంగ్రెస్ నేతలు అతి పెద్ద ఓబీసీనైన తనను మాత్రం మర్చిపోయారన్నారు. వెనకబడ్డ వర్గాలకు చెందిన దివంగత బిహార్ సీఎం కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి తాము గౌరవించుకున్నామన్నారు. ''1970లో ఆయన్ను గద్దె దింపేందుకు ప్రయత్నించిన చరిత్ర కాంగ్రెస్‌ది. ఆయనను కనీసం విపక్షనేతగా కూడా ఓర్వలేకపోయింది'' అంటూ మండిపడ్డారు.





గ్రామీ దక్కిన ఆనందంలో (వరుసగా ఎడమ నుంచి కుడికి)..
శంకర్ మహాదేవన్, గణేశ్ రాజగోపాలన్, జాకీర్ హుస్సేన్, వి.సెల్వగణేశ్, రాకేశ్ చౌరాసియా

భారత్‌కు 'గ్రామీ' సంబరం

న్యూఢిల్లీ: ప్రపంచ సంగీత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మక గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాది భారతీయ సంగీతానికి పట్టం కట్టారు. ఏకంగా ఐదుగురు భారత కళాకారులు, గాయకులు గ్రామీ అవార్డులు గెలుచుకున్నారు. అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో ఆదివారం పురస్కారాల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. ప్రఖ్యాత తబలా కళాకారుడు జాకీర్ హుస్సేన్, వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియా, గాయకుడు శంకర్ మహాదేవన్, వయోలిన్ కళాకారుడు గణేశ్ రాజగోపాలన్, డ్రమ్స్ కళాకారుడు సెల్వగణేశ్ వినాయక్‌రామ్‌ను గ్రామీలు వరించాయి. జాకీర్ హుస్సేన్‌కుమొత్తం మూడు, రాకేశ్ చౌరాసియాకు రెండు గ్రామీలు లభించడం విశేషం. 'శక్తి' అనే సంగీత బృందం 2023 జూన్‌లో విడుదల చేసిన 'దిస్ మూమెంట్' అనే ఆల్బమ్‌కు గాను శంకర్ మహాదేవన్, గణేశ్ రాజగోపాలన్, సెల్వగణేశ్ వినాయక్‌రామ్, జాకీర్ హుస్సేన్‌కు ఒక్కొక్కటి చొప్పున గ్రామీలు లభించాయి. 'దిస్ మూమెంట్' ఆల్బమ్‌కు గాను శక్తి బృందం 'బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ ఆల్బమ్' కేటగిరీలో గ్రామీని గెలుచుకుంది. జాకీర్ హుస్సేన్‌కు దీంతో పాటు మరో రెండు గ్రామీలు దక్కాయి. బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్(పాష్తో), బెస్ట్ కాంటెంపరరీ ఇన్‌స్ట్రుమెంటల్ ఆల్బమ్(యాజ్ వీ స్పీక్) కేటగిరీ కింద రెండు గ్రామీలు ఆయన వశమయ్యాయి. పాష్తో, యాజ్ వీ స్పీక్ ఆల్బమ్‌లకు గాను చౌరాసియాకు రెండు గ్రామీలు లభించాయి. గ్రామీ విజేతలను ప్రధాని మోదీ ప్రశంసించారు.

టేలర్ స్విఫ్ట్‌కు 'ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్' అవార్డు

ఈ ఏడాది 80కి పైగా కేటగిరీల్లో గ్రామీ పురస్కారాలు ప్రదానం చేశారు. 'మిడ్‌నైట్స్' ఆల్బమ్‌కు అమెరికన్ గాయని టేలర్ స్విఫ్ట్‌కు 'ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్' లభించింది. ఈ కేటగిరీ కింద గ్రామీ అవార్డు అందుకోవడం ఆమెకిది నాలుగోసారి! మిలీ సైరస్‌కు రికార్డు ఆఫ్ ద ఇయర్ (ఫ్లవర్స్), బిల్లీ ఐలిష్‌కు సాంగ్ ఆఫ్ ద ఇయర్ (వాట్ వాజ్ ఐ మేడ్ ఫర్?) గ్రామీలు దక్కాయి. 'బెస్ట్ న్యూ ఆర్టిస్టు' విభాగంలో విక్టోరియా మాంట్ గ్రామీని సొంతం చేసుకున్నారు.

బలపరీక్షలో చంపయ్ సర్కారు విజయం

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో చంపయ్ సోరెన్ ప్రభుత్వం సునాయాసంగా విజయం సాధించింది. మొత్తం 81 స్థానాలున్న రాష్ట్ర శాసనసభలో సోమవారం విశ్వాస తీర్మానానికి మద్దతుగా 47 మంది, వ్యతిరేకంగా 29 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. మిగిలిన ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. మనీ లాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టు కావడంతో జేఎంఎం సీనియర్ నేత చంపయ్ సోరెన్ ఈ నెల 2న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం సోమవారం అసెంబ్లీలో బలపరీక్ష ఎదుర్కొన్నారు. జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ కూటమి ఎమ్మెల్యేలంతా ఆయనకు అండగా నిలిచారు. సీపీఐ(ఎంఎల్)ఎల్ ఎమ్మెల్యే సైతం మద్దతు పలికారు. ఓటింగ్‌లో హేమంత్ సోరెన్ కూడా పాల్గొన్నారు. ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు అనుమతితో ఆయన అసెంబ్లీకి వచ్చారు. 26 మంది బీజేపీ, ముగ్గురు ఏజేఎస్‌యూ ఎమ్మెల్యేలు విశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటువేశారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలకు గుడ్‌బై

దమ్ముంటే తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపించాలని కేంద్రంలోని అధికార బీజేపీకి జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ సవాలు విసిరారు. ఆయన సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణలు నిజమేనని బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటానని తేల్చిచెప్పారు. తనను అరెస్టు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని, ఇందుకోసం రాజ్‌భవన్‌ను ఒక సాధనంగా వాడుకుందని విమర్శించారు. భారతదేశ చరిత్రలో జనవరి 31 ఒక చీకటి దినమని పేర్కొన్నారు. ఒక గిరిజన ముఖ్యమంత్రి ఐదేళ్లపాటు పదవిలో కొనసాగడం బీజేపీకి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా గిరిజన ముఖ్యమంత్రులను పూర్తి కాలం కొనసాగించలేదన్నారు. ''కన్నీళ్లు పెట్టను. బీజేపీకి గుణపాఠం చెబుతా'' అన్నారు.

మోదీ కలలు కంటున్నారు: విపక్షాలు

న్యూఢిల్లీ: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 400కుపైగా స్థానాల్లో ఘన విజయం సాధిస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తంచేయడంపై విపక్ష పార్టీలు విమర్శలు పెంచాయి. '' మోదీ కలలు కంటున్నారు. ఏకంగా 400కుపైగా సీట్లు గెల్చుకుంటామని మోదీ చెప్పడం చూస్తుంటే మళ్లీ అధికారంలోకి వస్తామనే విశ్వాసం ఆయనకు లేదని అర్థమవుతోంది. బీజేపీ ప్రభుత్వం దేశ లౌకిక భావనను గాయపరిచింది. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలేసి ద్రోహం చేసింది. మహిళలు, ఎస్సీ, ఎస్టీల కోసం ఏం చేసింది? రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఎందుకు ఇంతవరకు నెరవేర్చలేదు?. గత మే నుంచి రావణకాష్టంగా రగిలిపోతున్న మణిపూర్‌లో మోదీ ఎందుకు ఇంతవరకు ఒక్కసారైనా పర్యటించలేదు?'' అని సీపీఐ నేత బినోయ్ విశ్వం నిలదీశారు. '' 400 లేదా 500 సీట్లు గెలుస్తామని కల కనే హక్కు మోదీకి ఉంది. కానీ వాస్తవం వేరు. వేరే వాళ్ల కలలకు తగ్గట్లు నడుచుకోవాలో, సొంత నిర్ణయాలు తీసుకోవాలో ప్రజలే నిర్ణయించుకుంటారు' అని సీపీఐ(ఎం) నేత జాన్ బ్రిటస్ చెప్పారు. ' ఇందిరా గాంధీ, నెహ్రూల పేర్లు ప్రస్తావించకుండా ప్రధాని ప్రసంగం అస్సలు ముగియదు. ఇందిరా గాంధీ, నెహ్రూల పేర్లు స్మరించుకుంటేగానీ మోదీకి ఎన్నికల్లో గిట్టుబాటు అవుతుంది'' అని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ ఎద్దేవాచేశారు. '' బాధ్యతాయుతమైన ప్రధాని పదవిలో కూర్చున్నందుకైనా కాస్తంత గౌరవప్రదంగా మాట్లాడాలి. 400కుపైగా గెలుస్తామనడం చూస్తుంటే ఈవీఎంల విశ్వసనీయతపై అనుమానాలొస్తున్నాయి'' అని మరో కాంగ్రెస్ ఎంపీ డ్యానిష్ అలీ అనుమానం వ్యక్తంచేశారు. '' నెహ్రూ గతించి దాదాపు 60 ఏళ్లు గడుస్తున్నా మోదీ ఇంకా ఆయననే లక్ష్యంగా చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ గురించి మోదీ ఇంతగా పట్టించుకుంటుంటే మాకే చాలా ఆశ్చర్యంగా ఉంది. మోదీ ఆయన ప్రసంగమంతా కాంగ్రెస్‌కే అంకితమిచ్చారు. ఇప్పుడు పెరిగిన ధరల గురించి మోదీ ఇంకా నెహ్రూ, ఇందిర గాంధీలనే తిడుతున్నారు. ధరలు పెరిగిన తర్వాత వచ్చే ఎన్నికల్లో ప్రతిసారీ కాంగ్రెస్ గెలిచినట్లు చరిత్ర చెబుతోంది. ఇప్పుడు కూడా ధరలు పెరిగాయి!'' అని కాంగ్రెస్ నేత శశిథరూర్ వ్యాఖ్యానించారు.

ప్రచార కార్యక్రమాల్లో పిల్లలు వద్దు

- ఎన్నికల క్రతువులో కనపడొద్దు
- రాజకీయ పార్టీలకు ఈసీ అడ్వైజరీ

న్యూఢిల్లీ: ఎన్నికల ప్రచార పర్వంలో పిల్లజెల్లా ముసలిముతక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి భాగస్వాములను చేసే రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరికలు పంపింది. పోస్టర్లు అతికించడం, కరపత్రాలు పంచడం, ర్యాలీల్లో నినాదాలు ఇవ్వాలంటూ పిల్లలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దని పార్టీలకు ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల సంబంధ పనులు, కార్యక్రమాల్లో పార్టీలు పిల్లలను వాడుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపైనా ఉందంటూ రాష్ట్రాల ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బందికి మరోసారి గుర్తుచేసింది. ఎన్నికల పర్వంలో పిల్లలు ఎక్కడా కనిపించొద్దని, వారిని ఏ పనులకూ వాడుకోవద్దని రాజకీయ పార్టీలకు ఈసీ తాజాగా ఒక అడ్వైజరీని పంపింది. ''బాల కార్మిక చట్టాలు ఖచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత జిల్లా ఎలక్షన్ ఆఫీసర్, రిటర్నింగ్ ఆఫీసర్లదే. క్షేత్రస్థాయిలో ప్రత్యేకంగా ఈ బాధ్యతలు నెరవేర్చండి'' అని ఈసీ పేర్కొంది. ''ప్రచారంలో నేతలు చిన్నారులను ఎత్తుకుని ముద్దాడటం, పైకెత్తి అభివాదంచేయడం, వాహనాలు, ర్యాలీల్లో వారిని తమ వెంట బెట్టుకుని తిరగడం వంటివి చేయకూడదు. పిల్లలతో నినాదాలు ఇప్పించడం, పాటలు పాడించడం, వారితో చిన్నపాటి ప్రసంగాలు ఇప్పించడం సహా పార్టీ ప్రచారాల్లో ఎక్కడా చిన్నారులు ఉపయోగించుకోకూడదు. వారు ప్రచార కార్యక్రమాల్లో కనిపించకూడదు'' అని తన అడ్వైజరీలో స్పష్టంచేసింది. మరి కొద్ది వారాల్లో సార్వత్రిక ఎన్నికల మొదలుకానున్న నేపథ్యంలో ప్రచారపర్వంలో పార్టీలు ప్రజాస్వామ్య విలువలకు పట్టంకట్టాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంబంధ కార్యకలాపాల్లో మైనర్లను వినియోగించకూడదని, వినియోగిస్తే కార్మిక చట్టాలను ఉల్లంఘించినట్లేనని బాంబే హైకోర్టు 2014లో ఇచ్చిన ఇక ఉత్తర్వును రాజీవ్ కుమార్ పునరుద్ఘాటించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: చండీగఢ్ మేయర్ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారి వ్యవహరించిన తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా మండిపడింది. ఆయన ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం, ఖూనీ చేశారని వ్యాఖ్యానించింది. పిచ్చి రాతలు తదితరాలతో బ్యాలెట్ పత్రాల రూపురేఖలను మార్చడంపై విస్మయం వ్యక్తం చేసింది. అతడు రిటర్నింగ్ అధికారా లేక పరారీలో ఉన్న నేరగాడా అని నిలదీసింది. ఈ నెల 19వ తేదీన చేపట్టే తదుపరి విచారణకు రిటర్నింగ్ అధికారిని తమ ఎదుట ప్రత్యక్షంగా హాజరు పరిచాలని ఆదేశాలిచ్చింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ కౌన్సిలర్లు వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణ సాగిన తీరుకు సంబంధించిన వీడియోను ధర్మాసనం తిలకించి పైవిధంగా వ్యాఖ్యలు చేసింది. 'రిటర్నింగ్ అధికారి బ్యాలెట్ పత్రాలను తారుమారు చేశాడని స్పష్టమవుతోంది. అతడిని ప్రాసిక్యూట్ చేయాల్సిందే. చూడండి. అతను కెమెరావైపు ఎందుకు చూస్తున్నాడు? సుప్రీంకోర్టు చూస్తోందని అతనికి చెప్పండి. మిస్టర్ సొలిసిటర్ జనరల్. ఇదేనా రిటర్నింగ్ అధికారి వ్యవహరించాల్సి తీరు?. ఇలాంటివి మేం సహించం'అని తుషార్ మెహతానుద్దేశించి పేర్కొంది. ఎన్నికలు జరిగిన తీరు సంతృప్తికరంగా లేనట్లయితే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తామని పేర్కొంది. బ్యాలెట్ పేపర్లను, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి రికార్డులను పంజాబ్ హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ కస్టడీకి సోమవారం సాయంత్రంలోగా అందజేయాలని ఉత్తర్వులిచ్చింది. ఎన్నికల తీరుపై సమాధానం ఇవ్వాలంటూ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసింది.

రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తేస్తాం

భారత్ జోడో న్యాయ్‌యాత్రలో రాహుల్

రాంచీ: కేంద్రంలో 'ఇండియా' కూటమి కొలువుతీరితే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. భారత్‌జోడో న్యాయ్‌యాత్రలో సోమవారం జార్ఖండ్‌లోని రాంచీలోని షాహీద్ మైదాన్‌లో బహిరంగసభలో రాహుల్ మాట్లాడారు. ''ఓబీసీ, దళితులు, గిరిజనుల హక్కుల విషయం మేం ప్రస్తావిస్తే అసలు దేశంలో కులాలే లేవని, సంపన్నులు, పేదలే ఉన్నారని మోదీ మాట్లాడతారు. తీరా ఓట్లు అడిగేటప్పుడు తాను ఓబీసీనని చెప్పుకుని తిరుగుతారు'' అని విమర్శించారు. ఈడీ అరెస్ట్ చేసిన జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పనను రాహుల్ కలిసి మాట్లాడారు. కొత్తగా ఏర్పాటైన చంపాయ్ సర్కార్‌నూ కూలదోయాలని ప్రయత్నించి బీజేపీ చతికిలపడిందన్నారు. బలపరీక్షలో మద్దతు పలికిన సంకీర్ణ పార్టీల సభ్యులకు రాహుల్ తెలిపారు.



బొగ్గు బస్తాలతో కూడిన సైకిల్‌తో రాహుల్

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024

పార్కింగ్.. పరేషాన్!

నగరంలో నానాటికీ పెరుగుతున్న తిప్పలు

ట్రాఫిక్ HOT టాపిక్–1

ఈ మహానగరంలో బయటకు వెళదామని బండి బయటకు తీద్దామంటే భయం.. కారులో హుషారుగా వెళదామనుంటే కంగారు.. నడుచుకుంటూ వెళదామంటే టెన్షన్..ఎటు వెళ్లాలన్నా.. ఏ సమయంలో అయినా నరకమే.. కారణం ట్రాఫిక్.. నగరంలో కోటికి దగ్గరవుతున్న వాహనాలతో పాటు ఇతర ప్రాంతాలనుంచి వచ్చిపోయే వాటికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించకపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మినిమం స్పీడ్‌తో రోడ్డుపై వెళదామంటే ట్రాఫిక్ జామ్.. బండిని ఎక్కడైనా పార్కింగ్ చేయాలంటే స్థలం ఉండదు.. ఉంటే అడ్డగోలు పార్కింగ్ ఫీజులు.. కనీసం నడిచేందుకు కూడా ఫుట్‌పాత్‌లు కనిపించవు. ఇక ట్రాఫిక్ సిగ్నళ్లు కొన్ని ప్రాంతంలో అస్తవ్యస్తం..అధ్వానం.. అసలు అక్కడ ట్రాఫిక్‌పోలీసులు ఉన్నారో.. లేదో కూడా అర్థం కాని పరిస్థితి. ఇలా సమస్యలు ఎన్నో.. ఎన్నెన్నో...ఈ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఇటీవల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనాలు ఈ రోజునుంచి మీ కోసం...

– సాక్షి, సిటీబ్యూరో



బషీర్‌బాగ్: బషీర్‌బాగ్ ఫ్లై ఓవర్ కింద సుందరీకరణ పేరుతో మొక్కలు నాటి ఇనుప ఫెన్సింగ్ వేశారు. దీంతో ఫ్లైఓవర్ కింద పార్కింగ్ సాధ్యంకాక..వాహనదారులు ఇలా..ఫ్లైవర్ కింద ఎడ్జ్‌లో నిలువుగా వాహనాలను పార్క్ చేసి వెళ్తున్నారు. ఇక కార్ల పార్కింగ్‌కు ఇక్కడ అవకాశమే లేదు. దాదాపు నగరంలోని చాలా ఫ్లైఓవర్ల వద్దా ఇదే పరిస్థితి ఉంది.



ఇందిరాపార్కు: ఇందిరాపార్కు టు ఆర్టీసీ క్రాస్‌రోడ్డు ఫ్లైఓవర్ కింద ఖాళీ స్థలం చాలా ఉంది. దీంతో చాలా మంది కార్లను ఇలా పార్కు చేస్తున్నారు. దీని వల్ల ఈ ఏరియాకు వచ్చే వారికి కార్ పార్కింగ్ సమస్య తీరుతోంది.


పద్దెనిమిదేళ్ల క్రితమే జీవో...

నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడానికి నో–పార్కింగ్స్‌లో వాహనాలు నిలుపడం కూడా ప్రధాన కారణమన్నది దాదాపు రెండు దశాబ్దాలుగా అధికారులు చెప్తున్న అంశమే. అనేక వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సరైన పార్కింగ్ వసతులు లేవు. ఉన్నవి సైతం కమర్షియల్ స్పేస్‌లుగా మారిపోతున్నాయి. దీంతో వాటికి వచ్చిన వినియోగదారులంతా రోడ్లపైనే తమ వాహనాలను ఆపుతున్నారు. ఫలితంగా ఆయా రోడ్లలో భారీ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా 2006లో జీవో నెం.86 జారీ చేసింది. నగరంలోని వాణిజ్య సముదాయాలు, వ్యాపార సంస్థలకు పార్కింగ్ స్థలాలు ఎంత శాతం ఉండాలన్నది ఇందులో స్పష్టంగా పేర్కొన్నారు. సినిమా హాళ్లకు, మల్టీప్లెక్స్‌లకు మొత్తం విస్తీర్ణంలో 60 శాతం, వ్యాపార సముదాయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సినిమా హాళ్ల తదితరాలకు 40 శాతం పార్కింగ్ స్థలం తప్పనిసరిగా ఉండాలి. లేకుంటే చర్యలు తీసుకోవాలి.

ఆ ప్రతిపాదన నేటిది కాదు...

ఈ పార్కింగ్ సమస్య పరిష్కారానికి మల్టీ లెవల్ పార్కింగ్ లాట్స్ నిర్మాణం అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో అధికారులు దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నారు. అయితే ఇలాంటి ప్రతిపాదనలు నగరానికి కొత్త కాదు. ఇప్పటికే ఒకటి అందుబాటులో ఉండగా.. మరోటి నిర్మాణ దశలో ఉంది. జీహెచ్ఎంసీ అధికారులు 2010లోనే రోబో టిక్ పార్కింగ్ టవర్స్ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్టు కార్యాలయం, పాతబస్తీలోని ఖిల్వత్, కూకట్‌పల్లి, ప్యారడైజ్, ఎంజీ రోడ్, కోఠి, ఘాన్సీ బజార్‌ల్లో ఏడు నిర్మించాలని అధ్యయనం కూడా చేశారు. 30–40 గజాల స్థలంలోనే వివిధ అంతస్తుల్లో 40 కార్లు పార్కింగ్ చేసేలా ప్ర ణాళికలు సిద్ధం చేశారు. ఓ విదేశీ సంస్థతో సంప్రదింపులు జరిపి, పీపీపీ పద్ధతిలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో రోబోటిక్ వ్యవస్థను అనుసంధానించాలని యోచించారు. అక్కడి తో ఆ ఫైలు అటకెక్కేసింది.

నగరంలో నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టారు. అత్యున్నత స్థాయి అధికారులతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు సైతం స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో అధ్యయనాలు చేస్తున్నారు. రాజధానిలోని అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులకు పార్కింగ్ సమస్య ప్రధాన కారణంగా నిలుస్తోంది. దీన్ని పరిష్కరించడానికి మల్టీ లెవల్ పార్కింగ్ లాట్స్ సహా అనేక అంశాలను పరిశీలిస్తున్నాయి. ఆర్థిక భారం, సమయాభావంతో కూడిన వీటికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే ఊరట లభించనుంది. అలాంటి వాటిలో కీలకమైనవి ఫ్లైఓవర్ల కింది భాగంలో ఉన్న స్థలం మార్పిడి కీలకమైంది.



ఫ్లైఓవర్ కింది ప్రదేశాలను వినియోగిస్తే..

పార్కింగ్ సమస్యకు తక్షణ పరిష్కారంగా కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ఫ్లైఓవర్ల కింద ఉన్న ప్రాంతాలను పార్కింగ్ ప్రాంతాలుగా మార్చాలన్నది ఇందులో కీలకమైంది. నగరంలో భారీగా అందుబాటులోకి వచ్చిన ఫ్లైఓవర్లలో అత్యధికం వాణిజ్య ప్రాంతాల్లోనే ఉన్నాయి. ప్రస్తుతం వీటి కింద ఉన్న ప్రాంతాన్ని పార్కులుగా, గార్డెన్లుగా సుందరీకరించారు. అయితే సుందరీకరణ కంటే మౌళిక వసతులు కీలకమని నిపుణులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఫ్లైఓవర్ల కింద ఉన్న స్థలాలలు ద్విచక్ర, తేలికపాటి వాహనాల పార్కింగ్స్‌గా మారిస్తే ఉత్తమం అని సూచిస్తున్నారు. కొన్ని మార్పుచేర్పులతో, తక్కువ ఖర్చుతో వీటిని అందుబాటులోకి తీసుకురావచ్చని సూచిస్తున్నారు. ఇప్పటికే నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జ్ కింది భాగం ఇలా ఉపయోగపడుతోంది. ఈ పార్కింగ్ ప్రాంతాలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం లేదు. నిర్ణీత మొత్తం రుసుము వసూలు చేసినా జీహెచ్ఎంసీకి ఆదాయం, కొందరికి జీవనాధారం అవుతుంది. పోలీసులకు జరిమానాలు చెల్లించడం, భద్రత లేని ప్రాంతంలో వాహనం పెట్టడం కంటే ఇలా పార్కింగ్ రుసుము చెల్లించడానికే వాహనచోదకుడు మొగ్గు చూపుతాడని నిపుణుడు స్పష్టం చేస్తున్నారు. యథేచ్ఛగా సాగుతున్న రెన్యువల్... వాణిజ్య సముదాయాలు, సినిమా హాళ్లు, కేఫ్‌ల యజమానులకు ప్రతి ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు పోలీసులు లైసెన్స్ జారీ చేసే విధానం గతంలో ఉండేది. సుదీర్ఘకాలం గ్యాప్ తర్వాత మళ్ళీ ఈ విధానాన్ని పునరుద్ధరిస్తున్నారు. అయితే జీహెచ్ఎంసీ అధికారులు ఇచ్చే ట్రేడ్ లైసెన్సు జారీ, రెన్యువల్ ప్రక్రియలు నిరంతరాయంగా సాగుతూనే ఉన్నాయి. రెన్యువల్ చేసే సమయంలో ఈ అధికారులు వాటివల్ల ఏవైనా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయా? అనే కోణంలోనూ పరిశీలించాల్సి ఉంది.

ఆగమేఘాల పై..

- అతి త్వరలో కౌన్సిల్ సమావేశం
- హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో..
- నేడు మేయర్ అఖిలపక్ష సమావేశం



కమిషనర్ రోనాల్డ్ రాస్





మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం అతిత్వరలో జరగనుంది. ఇందుకుగాను చర్చించాల్సిన అంశాలు..తదితరమైన వాటి గురించి చర్చించేందుకు మేయర్ విజయలక్ష్మి మంగళవారం అన్ని పార్టీల కార్పొరేటర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. హైకోర్టుకు సమాధానం ఇవ్వాల్సి ఉన్న నేపథ్యంలో ఇందుకు సిద్ధమయ్యారు.

కౌన్సిల్‌ను రద్దు చేస్తే పోలా?

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాలు దీర్ఘకాలంగా జరగనందున నగరంలోని పలు పనులు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమావేశం నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మల్కాజిగిరి కార్పొరేటర్ (బీజేపీ) శ్రవణ్ ఇటీవల హైకోర్టునాశ్రయించడం తెలిసిందే. సోమవారం పిటిషన్‌పై విచారణ ప్రారంభమైంది. మునిసిపల్ పరిపాలనశాఖ స్టాండింగ్ కౌన్సిల్ కృష్ణారెడ్డి, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ రవీందర్ రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. కౌన్సిల్ సమావేశాలు నిర్ణీత వ్యవధుల్లో జరగక పోవడంపై న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు మూడు నెలలకోమారు సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, వాటిని జరపక పోవడంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఒక దశలో అంతమాత్రం దానికి కౌన్సిల్‌నే రద్దుచేస్తే పోద్దిగా అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కనీసం పిటిషన్‌దారుకు సమాధానమైనా చెప్పండి అంటూ విచారణను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు.

అత్యవసరంగా..

హైకోర్టుకు సమాధానం చెప్పాల్సి ఉండటంతో కౌన్సిల్ సమావేశం నిర్వహణకు మేయర్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అత్యవసరంగా మంగళవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని పార్టీల కార్పొరేటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సమావేశ తేదీని, అజెండాను ఖరారు చేయనున్నట్లు తెలిసింది. తేదీ ఖరారు చేశాక కోర్టుకు వివరణ నివ్వవచ్చునని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు, ఎన్నికల కోడ్ వంటి వాటివల్లే కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదని, అతి త్వరలో నిర్వహిస్తున్నామని కూడా తేదీతో సహ తెలుపుతూ వివరణ నిచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అందుకే మేయర్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

మేయర్ వర్సెస్ కమిషనర్!

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్డ్ రాస్‌ల నడుమ నివురుగప్పిన నిప్పులా ఉన్న అభిప్రాయభేదాలు ఇటీవల వెలుగు చూశాయి. జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా తాను ఎన్ని పర్యాయాలు ఆదేశించినా కమిషనర్ పట్టించుకోలేదని మేయర్ స్వయానా సీఎంను కలిసిన సందర్భంగా ఫిర్యాదు చేశారు. దాంతో వెంటనే సీఎం కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడటం తెలిసిందే. ఇకనైనా మేయర్–కమిషనర్‌ల మధ్య విభేదాలు సర్దుకొని కలిసి పనిచేస్తారా లేక కలహాలతోనే కాలం వెళ్లదీస్తారా అన్న చర్చ మొదలైంది. జీహెచ్ఎంసీకి సంబంధించి కమిషనర్‌తో నిర్వహించే సమావేశానికి తనను కూడా పిలవాలని మేయర్ విజయలక్ష్మి కోరడాన్ని మేయర్, కమిషనర్‌ల మధ్య అభిప్రాయభేదాలు న్నాయనే అంశాన్ని మరింత బట్టబయలు చేసింది. కమిషనర్‌తో భేదాభిప్రాయాలే లేకుంటే ఆమె అలా కోరేవారు కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, సమావేశాలే జరపనప్పుడు కౌన్సిల్‌నే రద్దుచేయొచ్చుగా అని హైకోర్టు అభిప్రాయపడిన నేపథ్యంలో వీరిద్దరి ప్రయాణం ఇకపై ఎలా సాగనుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. అంతేకాదు..సమావేశాలు జరిగినా సభను నిర్వహించడంలోనూ మేయర్‌కు ఇదివరకున్న సౌలభ్యం ఇప్పుడు లేకుండా పోయింది. అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్నది తమ పార్టీయే కాగా, ప్రస్తుతం ప్రతిపక్షంగా మారింది. అప్పట్లో ప్రభుత్వానికి అనుకూలంగానే వ్యవహరించేవారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నందున.. చైర్‌లో ఉండి ప్రభుత్వాన్ని విమర్శించేలా ఉంటారో, లేక అనుకూలంగా ఉంటారో సమావేశం జరిగితే కానీ తెలుస్తుంది. జీహెచ్ఎంసీ మనుగడ సాగించాలంటే తగినన్ని నిధులు కావాలి. అందుకు ప్రభుత్వ సహకారం అవసరం కావడం తెలిసిందే. పార్టీనుంచి ఎలాంటి ఆదేశాలుంటాయో తెలియదు. దాంతో పాటు ప్రభుత్వం మారినందున సభ్యుల వ్యవహారం ఎలా ఉంటుందో కూడా తెలియదు. మొత్తానికి రాబోయే రోజుల్లో జీహెచ్ఎంసీలో విచిత్ర పరిస్థితులు, దృశ్యాలు కనపడనున్నాయి.

సీఎం సైతం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం జీహెచ్ఎంసీ చేయాల్సిన పనులు చేయకుండా ఎందుకు పెండింగ్‌లో పెడుతున్నారని, కౌన్సిల్ సమావేశం ఎందుకు నిర్వహించలేదని తనను కలిసిన మేయర్‌తో అనడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించడం అనివార్యంగా మారింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి (2024–25) సంబంధించి బడ్జెట్‌ను కూడా ఆమోదించక పోవడంతో బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహణకు కూడా అవకాశాలున్నాయి. స్టాండింగ్ కమిటీ లేనందున.. త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశమున్నందున నేరుగా పాలకమండలిలో బడ్జెట్‌కు ఆమోదం తెలిపేందుకు అనుమతించాల్సిందిగా మేయర్ విజయలక్ష్మి సీఎంను కోర గా, ఆమేరకు చర్యలు చేపట్టాల్సిందిగా ఆయన కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను ఆదేశించడం కూడా తెలిసిందే.

నిత్యావసరాలనూ వదలట్లేదు!

- గ్యాస్, ఇంధనం తరలింపు వాహనాలపై 'ట్రాఫిక్' ఆంక్షలు
- పగటిపూట సంచరించేందుకు అనుమతి నిరాకరణ
- రాత్రి పూట జరుగుతున్న సరఫరా అంతంతే..
- నగరంలో గ్యాస్, ఇంధనం పంపిణీపై తీవ్ర ప్రభావం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంలో 'పగటి పూట' నిత్యావసరాల రవాణాపై సైతం ఆంక్షలు తప్పడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు పగటి పూట నిత్యావసరాలైన వంట గ్యాస్, ఇంధనం సరఫరా చేసే భారీ వాహనాలను సైతం అడ్డుకోవడం విస్మయానికి గురిచేస్తోంది. గత నెలలో ట్రాన్స్‌పోర్టు సమ్మె కొంత ప్రభావం చూపగా, తాజాగా పగటి పూట సిటీలో భారీ వాహనాలకు నో ఎంట్రీ అమలు చేస్తుండడంతో..ఇంధన ఉత్పత్తుల రవాణాపై తీవ్ర ప్రభావం పడుతోంది. రాత్రిపూట అనుమతి ఉన్నా..రవాణా మాత్రం అంతంతమాత్రంగా తయారైంది. ఏకంగా ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పోలీసు ఉన్నతాధికారులను కలిసి లోడ్ వాహనాల అడ్డగింపును దృష్టికి తీసుకొని వెళ్లినా..ఫలితం లేకుండా పోయింది. ఆయిల్ కంపెనీల టెర్మినల్స్‌లో గ్యాస్, ఇంధనం నిల్వలు పుష్కలంగా ఉన్నా...రవాణా ఆంక్షలతో వచ్చిన సరుకు వచ్చినట్లే పంపిణీ జరుగుతుండటంతో గోదాములు వెలవెలబోతున్నాయి. రాత్రి పూట సరఫరాతో పెట్రోల్, డీజిల్ బంకుల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా... వంట గ్యాస్ పంపిణీ మాత్రం చుక్కలు చూపిస్తోంది.

రీఫిల్ డిమాండ్ లక్షన్నరపైనే..

మహానగరంలో దినసరి వంట గ్యాస్ డిమాండ్ సుమారు లక్షన్నర ఎల్పీజీ సిలిండర్లపైనే ఉంటుంది. తాజా పరిస్థితులతో పంపిణీ మాత్రం అంతంతమాత్రంగా తయారైంది. మూడు ప్రధాన చమురు సంస్థలకు చెందిన 125 ఏజెన్సీల పరిధిలో గృహోపయోగ వంట గ్యాస్ కనెక్షన్లు సుమారు 30 లక్షలపైనే ఉన్నాయి. మరో వైపు వాణిజ్య అవసరాలకు సైతం లక్షల వరకు సిలిండర్ల డిమాండ్ ఉంటుంది. పగటి పూట రవాణాపై ఆంక్షలు వంటగ్యాస్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఎల్పీజీ లోడ్ వాహనాలను అనుమతించాలి



సిటీలో పగటి పూట కూడా ఎల్పీజీ లోడ్ వాహనాలను అనుమతించాలి. భారీ వాహనాలకు నో ఎంట్రీ పేరుతో ఎల్పీజీ సిలిండర్ల లోడ్‌లను అడ్డుకోవడం తగదు. ఇప్పటి వరకు ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. శివార్లలోని టెర్మినల్స్ నుంచి నగరంలోకి వస్తున్న సిలిండర్ల లోడ్ వాహనాలను పోలీసులు అడుగడుగునా అడ్డుకుని నిలిపివేస్తున్నారు. రాత్రి పూట మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో వంట గ్యాస్ పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తక్షణమే ఎల్పీజీ వాహనాలను మినహాయించాలి.

– అశోక్ కుమార్, అధ్యక్షుడు, వంట గ్యాస్ డీలర్ల సంఘం, హైదరాబాద్





నృత్య విలాసం

అద్భుతమైన నృత్య భంగిమలు..రీతులతో నాట్యకారిణులు అలరించారు. హిరణ్మయి నృత్యాలయం 10వ వార్షికోత్సవం సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 242 పరీక్ష కేంద్రాలు
- 1.74 లక్షల మంది విద్యార్థులు
- అదనపు కలెక్టర్ మధుసూదన్



ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై జరిగిన సమావేశంలో విద్య, వైద్య, పోలీస్, జలమండలి, విద్యుత్, ఆర్టీసి, పోస్టల్ శాఖ అధికారులతో ఆయ న సమీక్షించారు. ఈ నెల 28 నుండి మార్చి 19 వరకు పరీక్షలను 242 కేంద్రాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సుమారు లక్షా 74 వేల 368 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని, పరీక్ష కేంద్రాలలోకి ఉదయం 8.30 వరకు అనుమతించడం జరుగుతుందన్నారు. విద్యార్థులందరూ నిర్దేశిత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించా రు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాలకు క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్సు షాపులను మూసివేసి 144 సెక్షన్ విధించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ బాబురావు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశా ఖాధికారి వడ్డెన్న, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, మెడికల్ ఆఫీసర్ వెంకటి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఇంజెక్షన్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

శంషాబాద్ రూరల్ : రోగులకు సర్జరీ కోసం అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజెక్షన్లను ఎలాంటి అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఇద్దరిని ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 30 ఇంజెక్షన్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మెఫెంటెర్‌మినే సల్ఫేట్ ఇంజెక్షన్లను కార్డియాక్ సర్జరీ సమయంలో రోగులకు వాడుతుంటారు. వీటిని కొంతమంది బాడీ బిల్డర్లు తమ కండలు కనిపించడానికి వినియోగిస్తుంటారు. దీని కారణంగా ఆరోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే పహాడీషరీఫ్ ప్రాంతానికి చెందిన ఎండీ అజాజ్ మోహియుద్దీన్ ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ ఇంజెక్షన్ల వాడకంపై అవగాహన ఉన్న ఇతను మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్‌ను గమనించి విక్రయించేందుకు నిర్ణయించుకున్నాడు. పహాడీషరీఫ్‌కు చెందిన ఎండీ అక్రమ్‌తో కలిసి దందాకు పూనుకున్నారు. సోమవారం వీరిద్దరు మండలంలోని సంఘీగూడ చౌరస్తా వద్ద ఇంజెక్షన్ల విక్రయించేందుకు నిలబడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ, శంషాబాద్ పోలీసులు వారిని పట్టుకుని విచారించారు. వారి వద్ద 30 ఇంజక్షను బాటిళ్లు, 4 సిరంజీ నీడిల్స్, మూడు ఫోన్లు, రూ.3,950 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.27,000ను సీజ్ చేశారు. ఇంజెక్షన్లను రూ.200కు కొనుగోలు చేసి రూ.1,500 నుంచి రూ.2,000 వరకు విక్రయిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘టౌన్ ప్లానింగ్’పైనే కంప్లైంట్

- ప్రజావాణిలో 188 ఫిర్యాదులు
- ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి: కమిషనర్ రొనాల్డ్ రాస్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, ఉన్నతాధికారులు

హిమాయత్‌నగర్: తమ సమస్యలు పరిష్కారం కోసం ప్రజలు ప్రజావాణికి తరలివచ్చారు. జీహెచ్ఎంసీ పరిధిలో సోమవారం 188 ఫిర్యాదులు అందాయి.అలాగే ఫోన్ ఇన్ కార్యక్రమంలో 18 మంది ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో 56 ఫిర్యాదులు రాగా, జోనల్ సర్కిల్ కార్యాలయాల్లో 132 ఫిర్యాదులు వచ్చాయి. తమ సమస్యలను స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదంటూ.. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చి కొంతమంది బాధితులు ఫిర్యాదు చేశారు. ఉదయం 10–30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి జరిగింది. మొదటి గంట సమయం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో బాగంగా కమిషనర్ రొనాల్డ్ రాస్ ఫోన్ కాల్‌లో నగర వాసుల సమస్యలను తెలుసుకొని సంబంధింత అధికారులను వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజావాణిలో స్వయంగా పాల్గొని వారి నుంచి ఫిర్యాదులను కమీషనర్, మేయర్లు స్వయంగా తీసుకొని వాటిని సంబంధింత అధికారులను తెలియజేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వ్యక్తిగత, సామాజిక విన్నపాలను కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రధానంగా అక్రమ నిర్మాణాలు, స్థానిక అధికారుల అలసత్వంపై, టైన్ ప్లానింగ్ విభాగంపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. దీంతో పాటు రోడ్లు, నీటి తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కమిషనర్ రొనాల్డ్ రాస్ మాట్లాడుతూ ప్రజల నుండి ఆయా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారో ఫిర్యాదుదారునికి లిఖిత పూర్వకంగా తెలియజేయాలని, అదే సమస్యపై తిరిగి ఫిర్యాదు వస్తే సంబంధిత అధికారులను ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. సర్కిల్,జోనల్ స్థాయిలో సమస్య పరిష్కారం జరగని వారు మాత్రమే ఇక్కడికి రావాలని కమిషనర్ కోరారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును ఆన్లైన్‌లో అప్ లోడ్ చేసి వాటిని ఫిర్యాదు చేసిన వారికి సందేశాలను పంపడంతో పాటు, సంబంధిత శాఖ హెచ్.ఓ.డికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన టిప్పర్

మేడ్చల్ రూరల్: ఓ టిప్పర్ అదుపు తప్పి ఇంట్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన మేరకు.. రావల్‌కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ క్రషర్ మిషన్ నుండి రోబో సాండ్ లోడుతో సోమవారం సాయంత్రం నగరానికి వెళ్తున్న టిప్పర్ మార్గమధ్యంలోని ఖాసింబాయి తండా వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టి తండా కు చెందిన లక్ష్మణ్ ఇంట్లోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న మరో ఇంటి గోడను ఢీ కొట్టి ఆగింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఘటనలో లక్ష్మణ్‌కు చెందిన స్లాబ్‌లు ఉన్న రెండు గదుల ఇళ్లు, ఇంట్లోని సామాగ్రి ధ్వంసమైంది. బాధితుడు మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎలక్ట్రికల్ కాంట్రాక్టుల పేరుతో ‘షాక్’!

- బ్యాంకులు సహా పలువురి నుంచి రుణాలు
- ఆపై చెల్లించకుండా తప్పించుకుని సంచారం
- చదలవాడ రవీంద్ర బాబు వ్యవహారం ఇలా
- సిటీ సహా వివిధ రాష్ట్రాల్లో ఇతడిపై కేసులు
- చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: పెట్టుబడుల పేరుతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి, గుడ్‌విల్ అంటూ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని నిండా ముంచుతున్న ఘరానా మోసగాడు చదలవాడ రవీంద్ర బాబును హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పంజగుట్ట ఠాణాలో నమోదైన కేసుకు సంబంధించి నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ) జారీ కావడంతో నెల రోజులు నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నట్లు సీసీఎస్ ఏసీపీ ఎన్.అశోక్ కుమార్ తెలిపారు. నెల్లూరుకు చెందిన రవీంద్ర బాబు బీఎస్సీ పూర్తి చేశాడు. కొన్నేళ్ల క్రితం బతుకుతెరువు కోసం నగరానికి వలస వచ్చిన ఇతగాడు ఉప్పల్‌లో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేశాడు. ఆపై ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్స్ కాంట్రాక్టర్‌గా మారి నిజామాబాద్ నుంచి పనులు ప్రారంభించాడు. ఆపై వివిధ రాష్ట్రాల్లోనూ ఈ కాంట్రాక్టులు దక్కించుకుని విస్తరించాడు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా... ఆపై మోసాల కథ మొదలెట్టాడు. ఫలానా కాంట్రాక్టు పూర్తి కావస్తోందని, అవసరమైన మొత్తం పెట్టుబడిగా ఇవ్వాలని పరిచయస్తులతో పాటు ప్రైవేట్ సంస్థల్నీ ఆశ్రయించేవాడు. వీరితో పాటు బ్యాంకుల నుంచీ రుణాలు తీసుకుని సొంత అవసరాలకు మళ్లించేవాడు. నాచారంలోని ఎస్బీఐ నుంచి దాదాపు రూ.179 కోట్ల రుణం పొంది మోసం చేశాడు. కోల్‌కతాలో సబ్–స్టేషన్ నిర్మాణానికి కాంట్రాక్ట్ దక్కించుకుని, దానికి సంబంధించిన పత్రాలు సమర్పించి ఈ రుణం తీసుకున్నాడు. అప్పటికే రవీంద్ర బాబు పశ్చిమ బెంగాల్, బీహార్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, రాజస్థాన్‌లో కాంట్రాక్టులు చేసి ఉండటంతో తేలిగ్గా రుణం, అప్పులు, పెట్టుబడులు లభించాయి. ఇలా రూ.3.5 కోట్లు మోసం చేయడంపై సీసీఎస్‌లో, రూ.40 కోట్ల వ్యవహారంపై పంజగుట్ట ఠాణాలో కేసులు నమోదయ్యాయి. పంజగుట్ట కేసులో రవీంద్ర బాబుపై ఎన్‌బీడబ్ల్యూ జారీ అయింది. ఈ విషయం తెలియడంతో సీసీఎస్ ఏసీపీ అశోక్ కుమార్ రంగంలోకి దిగారు. రవీంద్రబాబు ఎక్కడ ఉన్నాడనే అంశాన్ని సాంకేతికంగా ఆరా తీయగా... ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు తేలింది. దీంతో దాదాపు నెల రోజుల నుంచి అతడి కదలికలను గమనిస్తూ వచ్చారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబైల్లో సంచరించిన అతగాడు సోమవారం ఈడీ కేసు నిమిత్తం ఆ కార్యాలయంలో హాజరుకావడానికి వచ్చారు. ఈ విషయం గుర్తించిన సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని పంజగుట్ట అధికారులకు అప్పగించారు. రవీంద్రబాబుపై ఏపీలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, సీబీఐ, ఈడీల్లోనూ కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రాథమిక విచారణ నేపథ్యంలో తనకు రూ.200 కోట్ల వరకు అప్పులు ఉన్నట్లు రవీంద్రబాబు అంగీకరించాడు.

ఆయాల నిర్లక్ష్యం.. పసి పిల్లలకు శాపం

- అనారోగ్యంతో ఆస్పత్రిపాలవుతున్న చిన్నారులు
- మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన ఇన్‌చార్జి

వెంగళరావునగర్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇద్దరు పసి పిల్లలు గాయాలు చేసుకోవడానికి కారణమైన ఆయాలపై చర్యలు తీసుకోవాలని శిశువిహార్ ఇన్‌చార్జి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంగణంలో శిశువిహార్ ఉంది. అనాథ చిన్నారులకు ప్రభుత్వం ఇక్కడ ఆశ్రయం కల్పిస్తుంది. కొందరు ఆయాలను ఏర్పాటు చేసి చిన్నారుల ఆలనా పాలనా బాధ్యతలు చూస్తుంటారు. అయితే గత నెల 7వ తేదీన సెబాస్టియన్ అనే ఆరేళ్ల బాలుడు ముక్కు, ముఖం వాచి ఉండటాన్ని అధికారులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లగా ముక్కులో పుండు అయిందని వైద్యులు తెలిపి ఈఎన్‌టీ ఆస్పత్రికి తరలించారు. సీసీ టీవీ పరిశీలించగా 4వ తేదీన సెబాస్టియన్ గదిలోకి వస్తుండగా మరో బాలుడు అతనిని నెట్టాడని, అక్కడే ఉన్న ఆయా పుష్పలత ఈ విషయాన్ని పట్టించుకోకుండా వెళ్లిపోయింది. అలాగే 18వ తేదీన జానీ అనే నాలుగేళ్ల బాలుడి ప్రైవేటు భాగానికి గాయమైంది. ఇది గమనించిన అధికారులు నిలోఫర్ ఆస్పత్రికి తరలించి విచారించగా మరో బాలుడు అతనిని 17వ తేదీనాడు కొరికినందున గాయమైందని తెలిసింది. దీన్ని అక్కడే విధులు నిర్వహిస్తున్న కిష్టమ్మ అనే ఆయా పట్టించుకోలేదు. ఈ రెండు సంఘటనల్లో ఆయాలు సకాలంలో స్పందించకుండా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల చిన్నారులకు గాయాలయ్యాయి. సీసీ కెమెరాల ఫుటేజ్‌ల ద్వారా దీనిని గమనించిన అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆయాలను తొలగించడమే కాకుండా వారిపై శిశువిహార్ ఇన్‌చార్జి సంతోషి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎలాంటి విచారణకైనా సిద్ధం

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.సత్యనారాయణ గౌడ్

కాచిగూడ: తనపై వచ్చిన ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఐపీఎంలోని కొంత మంది ఉద్యోగ సంఘం నేతలు తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఆరోపణలను రుజువు చేయకపోతే ఆరోపణలు చేసిన వారిపై చట్టపరంగా, శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నారాయణ గూడలోని ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలను టీఎన్జీవోస్ నేతలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ తన వ్యక్తిగత పరువుకు నష్టం కల్గించిన ఉద్యోగ సంఘం నేతలపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఐపీఎంపై, తనపై తప్పుడు ప్రకటనలు చేసిన ఉద్యోగ సంఘం నేతలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు ఆరోపణలు చేసిన ఉద్యోగ సంఘం నేతలపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. టీఎన్జీవోస్ నగర అధ్యక్షుడు కె.శ్రీకాంత్ మాట్లాడుతూ టీఎన్జీవోస్ నేతలపట్ల వ్యక్తిగతంగా, యూనియన్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని, అలాంటి వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మధుసూదన్ రావు

కంటోన్మెంట్: గత నెలలో మద్యం మత్తులో ఓ వ్యక్తిని హత్య చేసి, మరో వ్యక్తిపై దాడికి పాల్పడిన కేసును ఎట్టకేలకు మార్కెట్ పోలీసులు ఛేదించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మధుసూదన్ రావు, మహంకాళీ ఏసీపీ రవీందర్, మార్కెట్ సీఐ రామకృష్ణలు కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ సారంగాపూర్‌కు చెందిన మహ్మద్ మోసిన్ ఖాన్ (25) కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నాడు. గత నెల 29న మద్యం మత్తులో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తితో గొడవపడి అతని జేబులో ఉన్న రూ.800 లాక్కున్నాడు. సదరు బాధితుడు ప్రతిఘటించడంతో మోసిన్ ఖాన్ తన జేబులో ఉన్న డెకరేషన్ కత్తితో దాడి చేసి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని బాధితుడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించిన కొద్దిసేపట్లోనే బాధితుడు మరణించాడు. అదే సమయంలో మోసిన్ ఖాన్, సికింద్రాబాద్‌లో మితేష్ కుమార్ యాదవ్ అనే వ్యక్తితో గొడవపడి అతనిపై కూడా కత్తితో దాడి చేసి పారిపోయాడు. స్వల్ప గాయాల పాలైన మితేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నాలుగు బృందాలతో గాలించి...

పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రెండు ఘటనలకు జరిగిన ప్రాంతాలకు సమీపంలోని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించి అనుమానితుడిని గుర్తించారు. దాడులకు పాల్పడిన వ్యక్తి మరుసటి రోజు జూబ్లీబస్టాండ్‌కు వెళ్లి అటు నుంచి నిజామాబాద్‌కు వెళ్లాడు. వివిధ కోణాల్లో ఆరాతీసిన పోలీసులు నిందితుడు నిజామాబాద్ జిల్లా సారంగపూర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. చాకచక్యంగా నిందితుడు మోసిన్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వినియోగించిన కత్తితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ కోసం పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

సందడిగా మిస్, మిసెస్ సౌత్ ఇండియా గ్రాండ్ ఫినాలే



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, అతిథులు

శ్రీనగర్‌కాలనీ: యువతులు, మహిళలు హొయలుపోతూ ర్యాంప్‌వాక్ చేస్తూ సందడి చేశారు. వీనస్–స్టార్‌లైట్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మిస్, మిసెస్ సౌత్ ఇండియా గ్రాండ్ ఫినాలే వేడుకలు సోమాజిగూడలోని కత్రియాహోటల్‌లో ఆదివారం రాత్రి ఆద్యంతం రసవత్తరంగా జరిగాయి. యువతులతో పోటీగా మహిళలు విభిన్న డ్రస్సులతో వాక్ చేస్తూ కనువిందు చేశారు. ఈ వేడుకలకు నటుడు, మాజీ ఎంపీ మురళీమోహన్, వైఎస్ భారతి జార్జిరెడ్డిలు హాజరై వేడుకలను ప్రారంభించి పోటీల్లో పాల్గొన్న యువతులు, మహిళలను సత్కరించారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో చిత్తవుతున్న యువత భవిత



మాట్లాడుతున్న అడిషనల్ సీపీ విశ్వప్రసాద్

హిమాయత్‌నగర్: యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారని నగర ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ పి.విశ్వప్రసాద్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తాధ్వర్యంలో నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో సోమవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్వప్రసాద్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్‌పై ఎదురు వచ్చే వాహనాన్ని గమనించి నడవాలని, చాలా మంది ఇది తెలియక తప్పు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నారాయణగూడలోని శాంతి థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ వి.శాంతి, ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, అడిషనల్ డీసీపీ మహమ్మద్ షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

పంజగుట్ట: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పురుషోత్తం(18) ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చాడు. అమీర్‌పేట కూడలిలో ఉన్న ఎలిఫెంట్ హౌస్ భవనంలో ఓ షాపు లీజుకు తీసుకుని చాట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి షాపు మూసేసిన తర్వాత పాత్రలు శుభ్రం చేస్తుండగా విద్యుత్ ఎక్స్‌టెన్షన్ బాక్సు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి సోమవారం బంధువులకు అప్పగించారు. పురుషోత్తం బంధువు చింటు యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పురుషోత్తమ్‌ను కాపాడే క్రమంలో మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. నిర్లక్ష్యంగా విద్యుత్ ఎక్స్‌టెన్షన్ బాక్సు ఏర్పాటు చేసిన షాపు ఓనర్‌లు చరణ్‌జిత్ సింగ్, సందీప్ యాదవ్‌లపై 304 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై నెలరోజుల పసికందు లభ్యం

జియాగూడ: పుట్టింది కూతురు అని భావించారేమో నెల రోజుల పసికందును రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. ప్రయాణికుల సమాచారంతో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆ పసికందును స్వాధీనపరచుకున్నారు. కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో సంఘటన వెలుగు చూసింది. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన మేరకు.. జియాగూడ 100 ఫీట్ల జాతీయ రహదారిలో గల పీలి మండప్ ప్రాంతంలో ఓ పసికందును బట్టలలో చుట్టి అక్కడ ఉంచి ఎవరో వెళ్లిపోయినట్లు సమాచారం అభించిందన్నారు. దీంతో ఆ పసికందు వద్దకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రామ్‌నాయక్ చేరుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ప్రథమ చికిత్సను అందించేందుకు నిలోఫర్ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. అనంతరం అమీర్‌పేట్‌లోని శిశు విహార్‌కు తీసుకువెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



లక్ష్మి(ఫైల్)

మీర్‌పేట: టిప్పర్ వెనుక చక్రాల కింద నలిగి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దుర్ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ మండల మద్దిగట్ల గ్రామానికి చెందిన దుపల్లి లక్ష్మి(52) చంపాపేట సిద్ధార్థ స్కూల్ సమీపంలో తన కూతురు, కుమారుడితో కలిసి అద్దె ఇంట్లో నివాసముంటోంది. కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తోంది. హస్తినాపురం డీఆర్‌డీఎల్ కాలనీలో నివాసముండే బంధువుల వద్దకు వెళ్లేందుకు మధ్యాహ్నం తెలిసిన వారి స్కూటీపై వెళుతోంది. ఈ క్రమంలో హస్తినాపురం జెడ్పీ రోడ్డులోని అగ్రికల్చర్ కాలనీ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న ముగ్గురు కిందపడగా, లక్ష్మి టిప్పర్ వెనక చక్రాల కిందపడి మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

షాపింగ్ మాల్‌పై నుంచి దూకి మహిళ ఆత్మహత్య



రమణమ్మ (ఫైల్)

మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ఓ షాపింగ్ మాల్‌పై నుంచి ఓ మహిళ దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. ఓ షాపింగ్ మాల్ హౌస్ కీపింగ్ విభాగంలో గత 5 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న రమణమ్మ (50) అనే ఉద్యోగి సోమవారం మూడవ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఏపీలోని విజయనగరం జిల్లా గద్దపేటకు చెందిన రమణమ్మ మూసాపేటలోని హనుమాన్ చౌక్ వద్ద ఉంటూ వస్త్ర దుకాణంలో పనిచేస్తుంది. కూతురికి పెళ్లి చేయడంతో ఆమె గాజుల రామారంలో ఉంటుంది. కొడుకు రాజేష్‌కు 8 నెలల క్రితం పెళ్లి జరిగింది. కాగా హౌస్ కీపింగ్‌లో పనిచేసే వారిపై వేధింపులు జరుగుతున్నాయని రమణమ్మ కూతురు జాహ్నవి ఆరోపించింది. గత రాత్రి కూడా షాపింగ్ మాల్‌లో ఇదే విధంగా గొడవ జరిగిందని చెప్పారు. కాగా రమణమ్మ ఆత్మహత్యకు ముందు ఆమె కుమారుడికి వాయిస్ రికార్డు పంపింది. ‘సెక్యూరిటీ లోపలికి రానివ్వడం లేదు, నేను ఏమి తప్పు చేయలేదు నాన్న... నన్ను నమ్ము...’అంటూ కొడుకుకు వాయిస్ రికార్డు పంపి రమణమ్మ ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న కూకట్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పరిహారం అందజేత

రమణమ్మ కుటుంబసభ్యులకు రూ. 3 లక్షల పరిహారాన్ని మాల్ యాజమాన్యం అందజేసింది. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు తూము జగదీష్, మోయిజ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.




మొక్కల వివరాలు తెలిపే ట్రీ స్పెసిస్ బులిటెన్ బోర్డు


బటర్ ఫ్లై గార్డెన్


వాకర్లు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

నయనానందకరంగా కేబీఆర్ పార్కు!

అడుగడుగునా సుందర వనాలు

- కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో విభిన్న రకాల థీమ్ గార్డెన్స్
- ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీర్చిదిద్దుతున్న అధికారులు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రత్యేక చొరవతో పలు అభివృద్ధి కార్యక్రమాలు


వాక్‌వేలో ఏర్పాటు చేసిన నూతన డస్ట్‌బిన్లు

కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వే రూపురేఖలు సమూలంగా మారుతున్నాయి. జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్ చొరవతో అధికారగణం వారంలో మూడు సార్లు ఇక్కడ పర్యటిస్తూ వాక్‌వేను మరింత అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. సమస్యలకు నిలయంగా ఉన్న కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వే ఇప్పుడు వాకర్లకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే కాకుండా విద్యార్థులకు ఒక బొటానికల్ గార్డెన్‌లాగా తీర్చిదిద్దుతున్నారు.


రాక్ గార్డెన్


వాక్‌వే దెబ్బతిన్న చోట మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కు చుట్టూ సుమారు అయిదు కిలోమీటర్ల మేర ఉండే ఈ వాక్‌వేలో ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ నాలుగుసార్లు అర్బన్ డైవర్సిటీ, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి పలుసార్లు పర్యటించారు. రంగురంగుల పూల మొక్కలతో పాటు పలు ఔషధ మొక్కలు, థీమ్ పార్కులు ఏర్పాటు చేయాలని సూచించి ఆ దిశగా అధికారులతో పనులు చేయించారు.

- ఇప్పటికే వాక్‌వే ఎక్కడైతే దెబ్బతిన్నదో ఇంజినీరింగ్ శాఖ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. శానిటేషన్ అధికారులు గుర్తించిన చోట్ల 20కిపైగా ప్రాంతాల్లో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారు.


హెర్బల్ గార్డెన్

11కుపైగా థీమ్ గార్డెన్‌లు...

జీహెచ్ఎంసీ వాక్‌వే చుట్టూ ఇప్పటికే నిర్దేశించిన ప్రాంతాల్లో పలు థీమ్ గార్డెన్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా సీతాకోక చిలుకలను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా బటర్ ఫ్లై గార్డెన్‌ను ఏర్పాటు చేశారు.

- రాతి గుట్టల్లో పెంచేలా రాక్ గార్డెన్, బాంబూ గార్డెన్, ఫైకస్ గార్డెన్, తీగల మొక్కలు పెంచేందుకు క్రిపర్ గార్డెన్, ఆర్నమెంటల్ హెర్బల్ గార్డెన్, బోగన్‌విల్లా గార్డెన్, ఎక్సోరా గార్డెన్, ప్లుమేరియా గార్డెన్, పామెటమ్ గార్డెన్‌లను యుబీడీ అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ గార్డెన్లు అన్నింటికీ నీరు అందించేలా డ్రిప్ వ్యవస్థను సైతం ఏర్పాటు చేయనున్నారు.

మినీ బొటానికల్ గార్డెన్‌లా...

- కేబీఆర్ పార్కు వాక్‌వే చుట్టూ ఉన్న 3453 మొక్కలు వాటి విశిష్టతలను తెలిపేలా భారీ బోర్డును ఏర్పాటు చేసి వాటి పేర్లు అక్కడ రాశారు.
- ప్రతి మొక్క పేరుతో పాటు దాని సైంటిఫిక్ నేమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు సైతం ఇదొక విజ్ఞానాన్ని అందించేలా రూపొందించినట్లు అధికారులు తెలిపారు.


వెదురు చెట్లతో ఏర్పాటు చేసిన బాంబూ గార్డెన్

అడుగడుగునా సీసీ కెమెరాలు...

వాకర్ల భద్రతకు సైతం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే ఇక్కడ అధికారులు అన్ని వైపులను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో సైతం ఎటువంటి ఘటనలు చోటు చేసుకుండా చీకటి లేకుండా ఉండేలా వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.


పామ్‌టెమ్ గార్డెన్

ఎమ్మెల్యే దానంకు సన్మానం



బంజారాహిల్స్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-47లో రెసిడెంట్స్ సోమవారం ఆయనను కలిసి సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి, సి.హెచ్.కృష్ణమూర్తి, మాజీ కార్పొరేటర్ కాజా సూర్య నారాయణ, నాగేశ్వరరావు, మంజుల, దుర్గాప్రసాద్‌రాజు, శ్రీనివాసరావు, అనిత, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన


కెరీర్ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ 10–12 తరగతి విద్యార్థుల కోసం సోమవారం కెరీర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్లానెట్ ఫైనాన్స్ బిజినెస్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు కెరీర్‌కు సంబంధించిన అంశాలు, బీకాం, బీబీఏల అభ్యాసం తరువాత ఉన్న అవకాశాలను వివరించారు. ముఖ్యంగా భవిష్యత్తు ప్రణాళికలను ఒక పద్ధతి ప్రకారం రూపొందించుకోవడం, సమయానుకూలత, అంకితభావం అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

తైక్వాండో టోర్నీలో సత్తా చాటిన విద్యార్థులు


విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని తైక్వాండో క్లబ్ విద్యార్థులు తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. సరూర్‌నగర్ ఇండోర్ గ్రౌండ్‌లో జరిగిన ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బంజారాహిల్స్ గౌరీ శంకర్ కాలనీకి చెందినన తైక్వాండో క్లబ్ విద్యార్థులు పాల్గొని 12 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాస్టర్ వెంకటేశం, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె. నరేందర్, బస్తీ అధ్యక్షుడు వీకే. ముత్తు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి హంతకులను శిక్షించాలి

తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదు

- చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్న అత్తింటివారు
- న్యాయం చేయాలని మృతురాలి తల్లిదండ్రుల డిమాండ్


విలేకరులతో మాట్లాడుతున్న వెంకటస్వామి, లలిత

రహమత్‌నగర్: తన కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని ఆమెను అత్తింటివారే మానసికంగా వేధింపులకు గురిచేసి చంపేశారని మృతురాలి తల్లిదండ్రులు వెంకటస్వామి, లలిత ఆరోపించారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వారు మాట్లాడారు. తన కూతురు జ్యోతి(32)కి తన అన్న బాలరాజు కుమారుడు విజయ్‌కి ఇచ్చి వివాహం చేశామని వారిని ఇద్దరు మగ పిల్లలు ఉండేవారని తెలిపారు. తన కూతురు కష్ట పడి చదివి టీచర్ ఉద్యోగం సాధించిందని వివరించారు. తాను ఎస్ఎస్‌బీనగర్‌లో టీచర్‌గా పనిచేసేదన్నారు. అయితే భర్త అత్తమామలు ఉద్యోగం పేరుతో కోటి రూపాయలు లోను తేవాలని తన కూతురును వేధించారని వారు వాపోయారు. ఈ క్రమంలో గత ఏడాది ఆగస్టు 13 రాత్రి జ్యోతి తన పిల్లలను విషం ఇచ్చి తాను ఆత్మహత్య చేసుకుందని తమకు సమాచారం అందించారని తెలిపారు. తాము దిగ్భ్రాంతిలో ఉండగా పోస్టుమార్టం కోసమని తమతో సంతకాలు తీసుకుని అవే ఫిర్యాదు కాగితాలుగా మార్చి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి జ్యోతిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని తాము డీజీపీ, ఏసీపీలతో పాటు ఇతర అధికారులు కోరుతూనే ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

క్రైం కార్నర్..

మహిళ అదృశ్యం


నాగమణి

బంజారాహిల్స్: మహిళ అదృశ్యమైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మహబూబ్‌నగర్ బోకలోనిపల్లికి చెందిన రాజన్న(60) కేన్సర్‌తో బాధపడుతున్నాడు. గత 29న ఆమె భార్య నాగమణితో కలిసి వైద్యం కోసం ఇక్కడి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి వచ్చాడు. అయితే శనివారం ఉదయం 6.10 గంటల సమయంలో ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిన నాగమణి తిరిగి రాలేదు. దీంతో ఎల్బీనగర్‌లో ఉండే ఆమె కుమారుడు నక్క రవి ఆస్పత్రి చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో ఆదివారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా కొడిదల ఆదిరెడ్డి



రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ కొత్త ఎస్‌హెచ్‌ఓగా కొడిదల ఆదిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన విజయ్ తిరుమలగిరికి బదిలీపై వెళ్లారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఆదిరెడ్డి గతంలో హుమయూన్ నగర్, సీసీఎస్‌లలో ఎస్ఐగా, రైల్వేలో ఎస్ఐ, సీఐగా పని చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డికు డీఐ భూపాల్‌రెడ్డి, అడ్మిన్ ఎస్ఐ సప్నారెడ్డి, సెక్టార్ ఎస్ఐలు సర్దార్ జమాల్, మనోజ్, తూల్జారాం సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి మాట్లాడుతూ... చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేంది లేదని స్పష్టం చేశారు.

శ్రీనివాస్‌నగర్‌లో కూలిన భారీ వృక్షం

ఖైరతాబాద్: ఖైరతాబాద్ శ్రీనివాస్‌నగర్‌లో ఏళ్లనాటి భారీ వృక్షం నేలకూలింది. సోమవారం ఉదయం ఆ చెట్టు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. చెట్టు కింద పార్కు చేసిన రెండు కార్లు, ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొంత కాలంగా చెట్టుకు చెదలు పట్టి ప్రమాదకరంగా మారిందని స్థానికులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలిపారు. కూలిన వృక్షాన్ని డీఆర్ఎఫ్ బృందం సభ్యులు తొలగించారు. చెట్టు విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది.

నేటి నుంచి ఎస్‌పీసీఎల్ క్రికెట్ పోటీలు


క్రీడా స్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లోని క్వారీ స్థలంలో మంగళవారం నుంచి సికింద్రాబాద్ పార్లమెంట్ క్రికెట్ లీగ్ (ఎస్‌పీసీఎల్) పోటీలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు పోటీలను రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్‌యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, టీమ్ ఇండియా మాజీ సారథి మహమ్మద్ అజహరుద్దీన్ ప్రారంభించనున్నారు. నాలుగు రోజులు పాటు జరిగే ఈ పోటీల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని క్రీడకారులు పాల్గొనున్నారు. ఈ క్రమంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నగర కార్యదర్శి భవానీశంకర్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, టీ హోప్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ ఉపేందర్‌రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా రహమత్‌నగర్ డివిజన్‌లో జరిగే క్రికెట్ పోటీలను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు నిర్వహించే ఎగ్జిబిషన్ ఈ నెల 7వ తేదీ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు.

విట్టల్‌వాడిలో అభివృద్ధి పనుల ప్రారంభం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: విట్టల్‌వాడిలో వాటర్ చేపట్టనున్న సీవరేజ్, సీసీ రోడు పనులను హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీరామన్ గౌడ్ ప్రారంభించారు. ఇటీవల ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రూ. 40 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేసిన విషయం విదితమే. అందుకు సంబంధించిన పనులను కార్పొరేటర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... త్వరగా ఆయా పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. స్థానికులను ఇబ్బందులు గురికాకుండా పనులను త్వరతిగతిన పూర్తిచేయాలన్నారు. టీఆర్ఎస్ సీనియర్ నేతలు జి.రామన్‌గౌడ్, బస్తీ నేతలు సత్యం గౌడ్, సత్యనారాయణ లాల్, సాయినాథ్ గౌడ్, సుజాత, అనీష్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు టీవీ, డిజిటల్ మీడియా ఫెడరేషన్ కార్యవర్గం

బంజారాహిల్స్: గతేడాది డిసెంబర్ 31న జరిగిన తెలుగు టెలివిజన్ - డిజిటల్ ఓటిటి మీడియా పరిశ్రమ లోని 24 క్రాఫ్ట్స్ ఫెడరేషన్ ఎన్నికల్లో యునానిమస్ గా గెలిచిన కార్యవర్గ ప్రమాణం స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్, తెలుగు టెలివిజన్ డిజిటల్-ఓటీటీ ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.ప్రసాదరావు, విశిష్ట అతిథులుగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి పి. ఎస్.ఎన్.దొర, కోశాధికారి వి.సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నూతన అధ్యక్షుడిగా కొయ్యలముడి రాకేష్, ప్రధాన కార్యదర్శిగా పుట్ట విజయ్‌కుమార్, కోశాధికారిగా కక్ర నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మోహన్ రాజ్, రమేష్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా సి.హెచ్.ప్రసాద్, ఎం. సంపత్ మడగలతో పాటు వివిధ విభాగాల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు.


నూతన కార్యవర్గం

మోదీ వైఫల్యాలపై దేశ వ్యాప్త ప్రచారం

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలైరామన్

హిమాయత్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ పాలన ఆద్యంతం రాజ్యాంగ హక్కులను హరించడమేనని, మోదీ హటావో-దేశ్ బచావో అనే నినాదంతో దేశ వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్ పేర్కొన్నారు.

ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర విస్తత స్థాయి సమావేశం హిమాయత్‌నగర్ సత్యనారాయణరెడ్డి భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 16 శాతం నిరుద్యోగం పెరిగిందని ధ్వజమెత్తారు. వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, రాజకీయ పార్టీలపై చేస్తున్న కక్ష సాధింపు చర్యలను దేశ ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర మాట్లాడుతూ... మోదీ విదేశాల్లోని నల్లధనం తీసుకురాకపోగా, దేశ సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మహేందర్, శ్రీమాన్, యుగంధర్ రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేందర్, మహేష్, శ్రీనాథ్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, సుధీర్, రవి కుమార్, నయీమ్, 40 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుమలైరామన్

మురుగుతో పరేషాన్


ఫిలింనగర్ సినార్ వ్యాలీ ముందు పేరుకుపోయిన మురుగు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని సినార్ వ్యాలీ ముందున్న ప్రధాన రహదారిలో నిత్యం మురుగు సమస్య తీవ్రమవుతున్నారు. ఇక్కడ పెద్ద ఎత్తున మురుగు పొంగుతుండటంతో ఈ మురుగు రోడ్డంతా వ్యాపించి వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధాన రోడ్డుపై ఇంత పెద్ద సమస్య ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ


పింఛన్లను పంపిణీ చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని వాసవి సేవాకేంద్రంలో 500 మంది వృద్ధులకు సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు. అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ వృద్ధులు ఒక్కొక్కరికి రూ. 1200 ప్రకారం పింఛన్లను అందజేశారు. ప్రత్యేక అతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, వాసవి సేవా కేంద్రం అధ్యక్షుడు రమేష్, కొండ్లె మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి జ్ఞానచందర్, కోశాధికారి సురేందర్‌గుప్తా, ప్రభాకర్ గుప్తా, వనం యాదయ్య, రవీందర్ గుప్తా, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్


గ్యార్వీ షరీఫ్ వేడుకల్లో పాల్గొన్న వినోద్‌రెడ్డి తదితరులు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లో స్ట్రీట్ నంబర్ 14లోని ఆదర్శ్‌బస్తీలో స్థానిక ముస్లిం నేతలు ఫసీ అజర్, ఉస్మాన్‌ఖుర్షీద్‌ల ఆధ్వర్యంలో గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, నేతలు అయూబ్ ఖురేషీ, డివిజన్ అధ్యక్షుడు నయిమ్‌లతో పాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీని తప్పించడమంటే..

టీడీపీకి రాజ్యాధికారం ఇవ్వడం కాదు

- జనసేన అధినేత పవన్‌కు చేగొండి హరిరామజోగయ్య చురకలు
- చంద్రబాబును అధికారంలోకి తేవడానికి కాదు కాపులు పవన్ వెంట నడిచేది
- సీఎం పదవి చెరిసగం అని బాబుతో చెప్పించగలరా అంటూ లేఖాస్త్రం



పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజ్యాధికారం నుంచి తప్పించడమంటే టీడీపీకి పూర్తిగా రాజ్యాధికారం కట్టబెట్టడం కాదని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామ జోగయ్య చురకలు అంటించారు. పవన్ తనకు అధికారం ముఖ్యం కాదు.. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని అంటుంటారని, అలాగైతే అధికారం చంద్రబాబుకు ధారపోస్తే మీరు కలలుగంటున్న రాష్ట్ర ప్రయోజనాలు ఎలా దక్కుతాయని జనసైనికులు అడిగే ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతారని జోగయ్య ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం ఆయన పవన్‌నుద్దేశించి సూటిగా పలు ప్రశ్నలు సంధిస్తూ ఒక లేఖ రాశారు. దానిని ఆయన మీడియాకు విడుదల చేశారు. ''జనసైనికులు సంతృప్తిపడేలా సీట్ల పంపకంలో కాకపోయినా ముఖ్యమంత్రి పదవిలోనైనా రెండున్నర సంవత్సరాలు జనసేనకు కట్టబెట్టనున్నట్లు ముందుగానే చంద్రబాబు నోటితో చెప్పించగలరా?

పవన్‌కళ్యాణ్, చంద్రబాబునాయుడు అసెంబ్లీ సీట్ల పంపకం, ఉమ్మడి మేనిఫెస్టో విషయంలో దఫదఫాలుగా సమావేశాలు నిర్వహిస్తుండడం గమనిస్తూనే ఉన్నాం. కానీ వారిద్దరి మధ్యలో ఏయే చర్చలు జరిగాయో, ఎవరికెన్ని సీట్లు ఇస్తారో, ఏయే అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని అంగీకరించారో వివరిస్తూ ఓ ఎల్లో టీవీ ఛానల్లో జనసేనకు 30 సీట్లని, ఓ ఎల్లో వార్తా పత్రికలో 27 సీట్లని ప్రకటనలు చేయడం ఆశ్చర్యంగా ఉంది. చంద్రబాబును అధికారంలోకి తేవడానికి కాదు కాపులు పవన్ వెంట నడిచేది. 175 సీట్లు ఉన్న రాష్ట్రంలో కనీసం 50 సీట్లయినా జనసేన దక్కించుకోగలిగితేనే రాజ్యాధికారం పూర్తిగా కాకపోయినా పాక్షికంగానైనా దక్కే అవకాశం ఉంటుంది.'' అని లేఖలో పేర్కొన్నారు.


సమ్మిళిత ప్రగతి

బడ్జెట్ సంయుక్త సమావేశాల్లో గవర్నర్ జస్టిస్ నజీర్

- రాష్ట్రంలో పెరిగిన వృద్ధి రేటు... తగ్గిన పేదరికం
- విద్యా సంస్కరణలు, వైద్య విప్లవం, పారిశ్రామిక పురోభివృద్ధి

సాక్షి, అమరావతి: సంక్షేమం – అభివృద్ధి సమ్మిళితంతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, రాష్ట్ర ప్రగతికి మానవ వనరులనే చుక్కానిగా చేసుకుని కార్యాచరణను వేగవంతం చేసిందన్నారు. నవరత్నాల పథకాలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. నీతి ఆయోగ్ తాజా నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక గణన నిష్పత్తి 2015–16లో 11.77 శాతం ఉండగా 2022–23 నాటికి 4.19 శాతానికి తగ్గడమే అందుకు నిదర్శనమన్నారు. గత నాలుగేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.4.23 లక్షల కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం వినూత్న విధానాలకు అంకురార్పణ చేసిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేయడంతో పాటు సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిబద్ధతను గవర్నర్ అభినందించారు. ఇది రాష్ట్ర చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా తొలి రోజు సోమవారం శాసనసభ, శాసన మండలి సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించారు. అంతకుముందు అసెంబ్లీ ప్రాంగణం వద్ద గవర్నర్‌కు ముఖ్యమంత్రి జగన్ సాదర స్వాగతం పలికారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ నజీర్

అన్ని స్థానాలూ గెలిపించుకుందాం

కలిసికట్టుగా సాగుదాం

- ఒంగోలు పార్లమెంట్ పరిధి ఇన్‌చార్జిల సమావేశంలో నిర్ణయం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఒంగోలు పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజకవర్గాల నేతలు నిర్ణయించుకున్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సోమవారం వారు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిలు తాటిపర్తి చంద్రశేఖర్, దద్దాల నారాయణలు ఏకతాటిపైకి వచ్చి మళ్లీ అధికారం సాధించే లక్ష్యంతో పనిచేద్దామని ప్రతిన బూనారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని నియోజకవర్గాల్లో పార్టీ విజయం సాధించేలా కృషి చేద్దామని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఎన్నికల నిర్వహణ, ప్రచారం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమ్మేళనం పార్టీ క్యాడర్ లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు నాయకులంతా ఒక్కటే అనే సంకేతాన్ని ఇవ్వగలిగింది.



విజయవాడలో సమావేశమైన ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలు

8 వరకు అసెంబ్లీ సమావేశాలు

- 7న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్
- బీఏసీ సమావేశంలో నిర్ణయం
- సమావేశానికి హాజరైన సీఎం జగన్



బీఏసీ సమావేశంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తదితరులు

సాక్షి, అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాలను ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశం నిర్ణయించింది. సోమవారం ప్రారంభమైన అసెంబ్లీ సమా వేశాల్లో మొదటిరోజు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. అనంతరం స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన బీఏసీ సమావేశమైంది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మంగళవారం చర్చ చేపట్టాలని, బుధ వారం 2024–25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్థిక, శాసనసభ వ్యవహా రాల మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జోగి రమేష్, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఈ సమావేశానికి హాజ రయ్యారు. టీడీఎల్పీ ఉప నేత అచ్చెన్నాయుడు గైర్హా జరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శాసనసభలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ.. టీడీపీ ప్రతిసారి సభను తప్పుదోవ పట్టించేలా ప్రవర్తిస్తోందన్నారు. టీడీపీ బీఏసీ సమావేశానికి హాజరుకాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

ఏపీకి తీరని నష్టం చేసిన కాంగ్రెస్

- రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకుండా కాంగ్రెస్ ఘోర నేరం చేసింది
- రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ విజయసాయి రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పార్లమెంటరీ సంప్రదాయాలను సైతం తుంగలో తొక్కి అశాస్త్రీయంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించి, ఏపీకి తీరని నష్టం చేసిందని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నటికీ క్షమించరని అన్నారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ, పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ప్రకటిస్తూ ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఏపీకి కాంగ్రెస్‌ను విలన్‌గా అభివర్ణించారు. రాష్ట్రం ప్రత్యేక హోదా పొందలేకపోవడానికి కాంగ్రెస్ పార్టీ చేసిన ఘోర నేరమే కారణమన్నారు. ఆనాడు తెలంగాణలో అధికారంలోకి రావడానికి రాష్ట్ర విభజన చేసి ఏపీకి కంటితుడుపు చర్యగా ప్రత్యేక హోదాను చట్టంలో పెట్టకుండా కేవలం ప్రకటన మాత్రమే చేసిందని చెప్పారు. ఈ అంశాన్ని విభజన బిల్లులో పొందుపరిచి పార్లమెంట్ ఆమోదం పొంది ఉంటే రాష్ట్రానికి హోదా చట్టబద్ధంగా వచ్చేదన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని తెలిపారు. హోదాపై కాంగ్రెస్ కపట నాటకం ఆడి ఈరోజు వైఎస్సార్‌సీపీని నిందిస్తోందన్నారు. ఎవరో మాణిక్కం ఠాగూర్ అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిద్ర లేచిన దగ్గర నుంచి వైఎస్సార్‌సీపీని ఆడిపోసుకోవడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ యవనికపై కుటుంబ సమస్యలు తీసుకురావద్దని కాంగ్రెస్‌కు హితవు పలికారు. రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగడం సరైన చర్య కాదని చెప్పారు.

హోదా కోసం ప్రధానమంత్రికి పదే పదే విజ్ఞప్తి

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటికి ఎనిమిదిసార్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రధాన మంత్రిని కలిసి ప్రత్యేక హోదా కోసం విజ్ఞప్తి చేశారని విజయసాయిరెడ్డి చెప్పారు. నోడల్ ఏజెన్సీ అయిన హోం శాఖ మంత్రిని కలిసిన పన్నెండుసార్లూ ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించారన్నారు. లోక్‌సభ, రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యులు లెక్కలేనన్నిసార్లు ప్రత్యేక హోదా కోసం ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారని తెలిపారు.

భాషా సేవకులకు విశిష్ట పురస్కారాలు

- ఏపీ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో ప్రదానం
- సుద్దాల అశోక్‌తేజ, తమ్మారెడ్డి భరద్వాజ, కొమ్మినేని తదితరులకు జీవన సాఫల్య పురస్కారాలు
- పలువురు సీనియర్ జర్నలిస్టులకు తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు

ఏఎన్‌యూ (గుంటూరు): పాత్రికేయ, సినీ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురు రచయితలకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఏపీ ఎన్‌ఆర్‌ఐ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జీవన సాఫల్య, తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ.. పత్రిక, రచనా రంగంలో విశేష సేవలందించిన రచయితలను సన్మానించి, వారిని గౌరవించాలన్న లక్ష్యంతో ఈ పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. తద్వారా తెలుగు భాషకు సేవ చేసేవారిని మరింతగా ప్రోత్సహించాలనేది తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్నారై సొసైటీ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు వెంకట్ ఎస్ మేడపాటి, ఏపీ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్, వెంకటేశ్వర విశ్వ విద్యాలయం మాజీ వీసీ కొలకలూరి ఇనాక్, ఏఎన్‌యూ రెక్టార్ పి.వరప్రసాదమూర్తి ప్రసంగించారు.

జీవన సాఫల్య పురస్కార గ్రహీతలు వీరే

తమ్మారెడ్డి భరద్వాజ, సుద్దాల అశోక్‌తేజ, వంగూరి చిట్టెన్‌రాజు, చల్లా అనంతపద్మనాభస్వామి, కుప్పిలి పద్మ, కొమ్మినేని శ్రీనివాసరావు, వీవీఆర్ కృష్ణంరాజు, సి.మదన్‌మోహన్, చలసాని నరేంద్ర, యాబలూరి సీతారామశర్మ, గుళ్లపల్లి దిన్నాబాబు, రేవూరు ఉమామహేశ్వరరావు, తుమ్మలపల్లి రఘురాములు, గద్దం కృష్ణమూర్తి, గండూరి రాజశుక, తుర్లపాటి నాగభూషణరావు, నందం రామారావు, బైస దేవదాస్, కలిమిశ్రీ జీవన సాఫల్య పురస్కారాలు అందుకున్నారు.



సుద్దాల అశోక్‌తేజకు జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న విజయబాబు, వెంకట్ ఎస్ మేడపాటి తదితరులు

తెలుగు భాషా సేవారత్న పురస్కార గ్రహీతలు

తెలుగు భాషా సేవారత్న పురస్కారాలు అందుకున్న వారిలో సాక్షి అసిస్టెంట్ ఎడిటర్ పోతుకూరు శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు వాకా మంజుల, పీఎంఎస్ ప్రసాద్, రెంటాల జయదేవ్, వీఎస్ఎస్ కృష్ణకుమార్, నిమ్మరాజు చలపతిరావు, ఘంటా విజయ్‌కుమార్, అంకంరెడ్డి నానాజీ, మాశర్మ, పొలమరశెట్టి గణపతిరావు, జయప్రకాశరావు, పొత్తూరి సుబ్బారావు, బోణం గణేశ్, బి.అశోక్‌కుమార్, చిలుకూరి శ్రీనివాసరావు, పులివర్తి కృష్ణమూర్తి ఉన్నారు.

నగర వార్తలు

7న నిమ్స్‌మేలో రుణమేళా

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణ సంస్థలో ఈ నెల 7న రుణమేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రుణమేళా కొనసాగుతుందన్నారు. వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు బ్యాంకుల నుంచి రుణాలను పొందడానికి ప్రాజెక్టు నివేదిక తయారీ, రుణం పొందే ప్రక్రియ, అందుకు సంబంధించిన పత్రాలపై ఈ మేళాలో వివరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అర్హులకే అవకాశం ఇవ్వాలి'



మాట్లాడుతున్న రాపోలు భాస్కర్

పంజగుట్ట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన వృత్తివిద్యా కోర్సులను అమలు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్న ఏజెన్సీకి కాంట్రాక్ట్ ఇవ్వాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపాల్ సెక్రటరీలకు లేఖ రాసినట్లు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యం పెంచేందుకు ఒకేషనల్ కోర్సులు ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో 492 జిల్లా పరిషత్ పాఠశాలలను ఎంపిక చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించేందుకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. అయితే కొందరు ఉన్నతాధికారులు లంచాలు తీసుకుని ఎలాంటి అర్హతలేని సంస్థలకు టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. అర్హత లేనివారికి టెండర్లు ఇచ్చి విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తగదన్నారు. కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఏజెన్సీల కేటాయింపులో జరిగిన అవకతవకలపై విచారణ చేయించాలని, అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హారిజంటల్ వద్దు... వర్టికల్ ముద్దు

నిబంధనల ప్రకారం గురుకుల ఫలితాలు ప్రకటించాలి



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న గురుకుల మహిళా అభ్యర్థులు

కవాడిగూడ: గురుకులాల పోస్టుల భర్తీలో హారిజంటల్ విధానాన్ని అమలు చేయొద్దని డిమాండ్ చేస్తూ గురుకుల పోటీ పరీక్షల మహిళా అభ్యర్థులు సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళా అభ్యర్థులు జోత్స్న, అస్మా, దీప్తి, సుజాత, మాధురి, ప్రసన్న మాట్లాడుతూ... గత ప్రభుత్వం గురుకులాల్లో ఖాళీగా ఉన్న 9210 పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించిందన్నారు. ప్రస్తుతం ఫలితాలకోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. కొందరు పురుష అభ్యర్థులు హారిజంటల్ విధానాన్ని అమలు చేసి ఫలితాలు ప్రకటించాలని కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. హారిజంటల్ విధానాన్ని అమలు చేస్తే మహిళా అభ్యర్థులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం వర్టికల్ విధానంలోనే గురుకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వాకర్లకు మెరుగైన వసతులు

కేబీఆర్ పార్కును సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్స్, సందర్శకులకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. సోమవారం ఆయన జోనల్ కమిషనర్ రవికిరణ్, యూబీడీ అడిషనల్ కమిషనర్ సునందలతో కలిసి బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును పరిశీలించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులు, నిర్వహణ, పునరుద్ధరణ పనులపై ఆరా తీశారు. వాక్ వే, హెర్బల్ గార్డెన్, రాక్ గార్డెన్, ఫ్లూమియర్ గార్డెన్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన థీమ్ పార్కును పరిశీలించారు. పాత్ వే ఎత్తుపల్లాలు లేకుండా సరిచేయాలని, వీలైనన్ని చోట్ల మొక్కలు నాటాలని కమిషనర్ ఆదేశించారు. వాకర్స్ సేదదీరే ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. పార్కింగ్ స్థలాల వద్ద పేవ్‌మెంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్స్, సందర్శకులకు అవసరాలను తెలుసుకుని వాటిని సమకూర్చనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను మరింతగా మెరుగుపరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్ఈ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



కేబీఆర్ పార్కును సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

మూసీ రివర్ ఫ్రంట్ కార్యాలయం తరలింపు?

సాక్షి, సిటీబ్యూరో: తార్నాకలోని మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఔటర్ సమీపంలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ కార్యాలయ భవనంలోకి మార్చనున్నారు. ప్రస్తుతం మూసీ రివర్ ఫ్రంట్‌తో పాటు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ రెండింటికి ఆమ్రపాలి మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో అన్ని విభాగాలు ఒకేచోట ఉండేవిధంగా ఈ మార్పు చేసినట్లు తెలిసింది. మరోవైపు మూసీ ప్రక్షాళనను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న దృష్ట్యా ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ఈ మార్పు దోహదం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

సీఆర్వోగా ఫణీంద్ర రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారిగా జి.ఫణీంద్రరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సుదీర్ఘకాలం పనిచేసిన బాలమాయదేవి బీసీ సంక్షేమం శాఖ కమిషనర్‌గా బదిలీఅయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న ఐఏఎస్ అధికారి ఫణీంద్రరెడ్డికి సీఆర్వోగా పోస్టింగ్ లభించింది.

భువనగిరి ఘటనపై విచారణ జరిపించాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పరశురామ్ డిమాండ్

ముషీరాబాద్: భువనగిరి ఎస్సీ హాస్టల్ విద్యార్థులు గాదే వైష్ణవి, కోడి భవ్య శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.పరశురామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15 రోజుల క్రితం హాస్టల్ వంట గది కేంద్రంగా జరిగిన అసాంఘిక కార్యకలాపాలపై భవ్య ప్రశ్నించడం జరిగిందని, అప్పుడే అధికారులు సరిగ్గా స్పందించి ఉంటే ఇలా జరిగి ఉండేది కాదన్నారు. అధికారుల అలసత్వంపై విచారణ జరిపించి వాస్తవాలు వెలికి తీయాలని కోరారు. విద్యార్థిని భవ్య కాళ్లు, చేతులు, మెడ, ఇతర శరీర భాగాలపై పంటి గాట్లు ఉన్నాయని, ఇది ఆత్మహత్య కాదు, హత్య అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వాస్తవాలు వెలికితీసి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య సీతారామారావు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం నైపుణ్యాభివృద్ధి వృత్తి ప్రణాళిక కేంద్రం, మ్యాజిక్ బజ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా 'సాఫ్ట్ స్కిల్స్ ట్రెయినింగ్ ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్' అనే అంశంపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ వీసీ ఆచార్య సీతారామారావు మాట్లాడుతూ... విద్యార్థులకు అకాడమిక్ పరంగా మంచి విద్య అవసరమని, అలాగే తాను చదువుకున్న అంశంపై వృత్తి నైపుణ్యం కూడా ప్రధానమన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికంగా పరిజ్ఞానం పెంపొందించుకుంటే మెరుగైన అవకాశాలు దక్కుతాయన్నారు. అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.ఆర్.ఎన్.రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, డీన్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పలు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పార్లమెంటులో వర్గీకరణ బిల్లు పెట్టాలి

ముషీరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెట్టకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం పెండింగ్‌లో పడి నేటికి 20 ఏళ్లు గడుస్తున్నా రాజకీయ పార్టీలు కమిషన్లు, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలోకి ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణపై అనేక కమిషన్లు వేసినా మాదిగలకు న్యాయం చేయలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పి పదేళ్లు గడుస్తున్నా అందుకు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. మాదిగలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బీజేపీ ప్రభుత్వం తక్షణమే పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చిలకమర్రి గణేష్, శ్యామ్‌రావు, వరలక్ష్మి, కొల్లూరు వెంకట్, జిల్లా వెంకట్, బోయ ప్రవీణ్, నక్క రమేష్, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

చర్లపల్లి టెర్మినల్ వల్ల పేదల ఇళ్లకు ముప్పు

సాక్షి, సిటీబ్యూరో: చర్లపల్లి టెర్మినల్ విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోతున్న వారికి రైల్వేశాఖ తిరిగి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ ప్రతినిధి ఎస్. జీవన్‌కుమార్, సామాజిక కార్యకర్త శంకర్, రోహిత్ ఓ ప్రకటనలో కోరారు. సుమారు రూ.350 కోట్లకు పైగా వ్యయంతో దక్షిణమధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్ విస్తరణ చేపట్టింది. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 6 ప్లాట్‌ఫాంలు వినియోగంలోకి రానున్నాయి. రైల్వేస్టేషన్ విస్తరణతో పరిసరాల్లోని భరత్ నగర్,మహాలక్ష్మి నగర్ తదితర కాలనీలకు చెందిన ప్రజలు నష్టపోయే అవకాశం ఉందని జీవన్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.టెర్మినల్ విస్తరణపై స్థానిక ప్రజలకు ఎలాంటి సమాచారం లేదని, త్వరలో ఇళ్లను తొలగించాల్సి ఉంటుందని రైల్వే అధికారులు నోటీసులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్న ఫలంగా ఆయా కాలనీలకు చెందిన ప్రజలు ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు.రైల్వే స్టేషన్‌కు ఉత్తరం వైపున మహాలక్ష్మీనగర్ కాలనీ నుంచి ప్రధాన రహదారి కి వెళ్లే రోడ్డును 30 అడుగుల నుంచి 80 అడుగులకు పెంచుతున్నారని, ఈ నేపథ్యంలో రోడ్డుకు ఇరు వైపులా మార్కింగ్ చేసినట్లు తెలిపారు. 14 ఇళ్లు, మరో 5 నివాస స్థలాల యజమానులకుకు నోటీసులు ఇచ్చారన్నారు. వారు పక్కా ఇళ్లు నిర్మించుకుని, ఇంటినెంబర్‌లు, విద్యుత్ కనెక్షన్‌లు కూడా పొందారని, పరిహారం ఇవ్వకుండా ఆ ఇళ్లను తొలగించరాదని డిమాండ్ చేశారు.బాధితులు ఇంటి రుణాలు కూడా ఇంకా చెల్లించలేదని, వారి ఇళ్ల డాక్యుమెంట్‌లు బ్యాంకుల్లోనే ఉన్నట్లు తెలిపారు.చర్లపల్లి టెర్మినల్ వంటి భారీ నిర్మాణం చేపట్టినప్పుడు ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉండేదని, ఇప్పటికైనా రైల్వేశాఖ పారదర్శకంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీనియర్ నేషనల్ త్రోబాల్ టోర్నీకి తెలంగాణ జట్లు



మహిళా, పురుషుల జట్లతో అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్: ఢిల్లీలోని రోహిణి సెక్టార్‌లో ఈ నెల 8 నుంచి 11 వరకు నిర్వహించనున్న 45వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన మహిళ, పురుషుల జట్లు పాల్గొంటున్నట్లు తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి జగన్మోహనగౌడ్‌లు తెలంగాణ జెర్సీని ఆవిష్కరించి ఆయా జట్లకు ప్లే కిట్లను పంపిణీ చేశారు. అనంతరం జట్ల వివరాలు వెల్లడించారు.

పురుషుల జట్టు సభ్యులు వీరే...

శామ్యూల్ (కెప్టెన్), ధీరజ్, నితిన్, సాహిల్, మణిదీప్, సంతోష్, విశాల్, శ్రీకాంత్, బాలాజీ, శివరాజ్, విశ్వనాథ్, కార్తీక్, జయనాథ్, తేజలు ప్లేయర్స్‌గా ఉంటారు. వీరికి కోచ్‌గా పీవీ చక్రపాణి, మేనేజర్‌గా శరత్‌రెడ్డిలు వ్యవహరిస్తారు.

మహిళా జట్టు సభ్యులు వీరే...

శ్రీలేఖ (కెప్టెన్), హారిక, జాహ్నవి, అనన్య, అంకిత, నిషిక, శైలు, అనూష, ఎస్తేర్, మెరిన్, నైషా, షారన్, ప్రియాంక, యేషశ్రీ, సంతోషిణిలు ప్లేయర్స్ ఉంటారు. వీరికి కోచ్‌గా సిద్ధూ, మేనేజర్‌గా కిరణ్‌చారిలు వ్యవహరిస్తారు.

యాభై ఏళ్ల ప్రేమ

1974.
సరిగ్గా యాభై ఏళ్ల క్రితం మొదటిసారి సుధామూర్తి, నారాయణమూర్తి పూణెలో కలిశారు. వారి మధ్య ప్రేమ చిగురించడానికి దోహదం చేసింది పుస్తక పఠనం. ఆ ప్రేమ కథ ఏమిటో 50 ఏళ్ల తర్వాత 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ 2024'లో పంచుకున్నారు సుధామూర్తి. తమ సుదీర్ఘ వైవాహిక జీవితం సఫలం కావడానికి ఇద్దరూ తీసుకున్న జాగ్రత్తలు చెప్తూ ఈనాటి యువతకు అనుభవంతో నిండిన సూచనలు చేశారు.



● 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ 2024'లో సుధామూర్తి

పుస్తకం కలిపింది ఇద్దరినీ


అందమైన ప్రేమకథలు, సఫలమైన ప్రేమకథలు తెలుసుకోవడం బాగుంటుంది.

'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో ఫిబ్రవరి 5న ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి పాల్గొన్నారు. చిత్రా బెనర్జీ దివాకరుని రాసిన బయోగ్రఫీ 'యాన్ అన్‌కామన్ లవ్: ది ఎర్లీ డేస్ ఆఫ్ సుధా అండ్ నారాయణమూర్తి' విడుదలైన సందర్భంగా తనకు నారాయణమూర్తికీ మధ్య ఎలా ప్రేమ పుట్టిందో కొద్దిగా సిగ్గుపడుతూ, ముసిముసిగా నవ్వుకుంటూ గుర్తు చేసుకున్నారు. ఆ ప్రేమ కథ వినండి.

●●●

1974 అక్టోబర్.

పూణెలోని 'టెల్కో'లో మొదటి మహిళా ఇంజనీరుగా చేరిన సుధ రోజూ కంపెనీ బస్‌లో వచ్చి వెళుతుండేవారు. ప్రసన్న ఆమె కొలీగ్. అతను ఏదో ఒక పుస్తకం చదువుతుంటే ఏ పుస్తకమూ అని సుధ తొంగి తొంగి చూసేవారు. అతను చదివే ప్రతి పుస్తకం మీద ఒకే పేరు ఉండేది... మూర్తి అని. ఒకరోజు ఉండబట్టలేక 'ఎవరీ మూర్తి' అని అడిగారు సుధ. 'నా రూమ్మేటు. పుస్తకాల పిచ్చోడు. చాలా పుస్తకాలు చదువుతాడు' అన్నాడు ప్రసన్న. 'నీకూ పుస్తకాల పిచ్చేగా. కావాలంటే పరిచయం చేస్తానురా' అన్నాడు. 'అమ్మో... బేచిలర్‌ల రూముకు వెళ్లడమా' అని సుధ జంకారు. కాని కుతూహలం పట్టలేక 'ఫలానా రోజున ఐదు నిమిషాలకు వచ్చి వెళతా' అని ఫిక్స్ చేశారు. అప్పటి నుంచి ఆమె ఆలోచనలు రకరకాలుగా సాగాయి. ఈ మూర్తి ఎలా ఉంటాడు? పొడవుగా ఉంటాడా... రింగుల రింగుల జుట్టుతో ఉంటాడా.. షోగ్గా (అప్పటికి హిందీ సినిమాల ఫ్యాన్ కాబట్టి) రాజేష్ ఖన్నాలా ఉంటాడా అని ఒకటే ఊహలు. తీరా రూముకు వెళ్లేసరికి దళసరి కళ్లద్దాల బక్కపలచటి యువకుడు ఎదురుపడ్డాడు. సుధని చూసి, ఆమెకు పుస్తకాలంటే ఇష్టమని తెలిసి తన దగ్గరున్న పుస్తకాలన్నీ చూపించాడు. ఆమె బయల్దేరే ముందు అబ్బాయిలు వేసే పాచిక 'కావాలంటే తీసుకెళ్లి చదివి ఇవ్వు' అన్నాడు. కొన్నిరోజుల తర్వాత 'మనం డిన్నర్ చేద్దామా' అని ఆహ్వానించాడు. దానికీ భయమే సుధకు. 'వస్తా. కాని మన కామన్‌ఫ్రెండ్ ప్రసన్న కూడా మనతో ఉండాలి. నా వాటా బిల్లు డబ్బులు నేనే కడతా' అందామె. వారి స్నేహం బలపడింది. ఒక రోజు నారాయణమూర్తి ధైర్యం చేసి సుధతో చెప్పాడు– 'ఆరోజు నువ్వు మొదటిసారి నా రూమ్‌కు వచ్చి వెళ్లాక అంతవరకూ లేని వెలుగు వచ్చినట్టయ్యింది. జీవితం పట్ల ఇంత ఆసక్తి ఉన్న అమ్మాయిని నేను చూళ్లేదు'... ఆ మాటలే ప్రేమను ప్రపోజ్ చేయడం. ఆమె సంతోషంగా నవ్వడమే ప్రేమను అంగీకరించడం. ప్రేమ మొదలైన నాలుగేళ్లకు సుధ.. సుధామూర్తి అయ్యారు.



● సుధామూర్తి బయోగ్రఫీ

●●●



● సుధామూర్తి, నారాయణ మూర్తి

'నారాయణమూర్తి, నేను భిన్నధృవాలం. నేను అన్నింటికీ మాట్లాడతాను. అతను అసలు మాట్లాడడు. నాకు అన్నింట్లో జోక్యం కావాలి. అతను అవసరమైతే తప్ప జోక్యం చేసుకోడు. మా జీవితంలో అనంగీకారాలు, ఆర్గ్యుమెంట్లు లేవని కాదు. ఇన్ఫోసిస్ మొదలెడుతున్నప్పుడు నువ్వు ఇందులో ఉండకూడదు అన్నాడు నారాయణమూర్తి. ఐదేళ్లు నేను పిల్లల్ని చూసుకుంటూ ఉండిపోయాను. అప్పుడప్పుడు కొంత చివుక్కుమంటూండేది. కాని తర్వాత ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌కు చైర్మన్‌గా నేను సామాజిక సేవతో ఎందరి జీవితాలకో చేయూతనిచ్చి తృప్తి పొందాను. వైవాహిక బంధంలో భార్యాభర్తలు ఎవరిని వారులా ఉండనివ్వాలి. నారాయణమూర్తి కోరుకున్నట్టుగా నేను అతణ్ణి ఉండనిచ్చాను, నాలా నన్ను అతను ఉండనిచ్చాడు' అన్నారామె.

●●●

'ఇన్ఫోసిస్ పెట్టాక అతి కష్టమ్మీద ఒక క్లయింట్ దొరికాడు. కాని పేమెంట్స్ ఇష్టమొచ్చినప్పుడు ఇచ్చేవాడు. నారాయణమూర్తికి ఉద్యోగుల జీతాలు సమయానికి చెల్లించాలని నియమం. అతను టెన్షన్ పడుతుంటే– ఎందుకంత టెన్షన్... నగలు బ్యాంకులో కుదవ పెట్టి డబ్బు తెస్తాను. సర్దుబాటు చేసుకో అన్నాను. నారాయణమూర్తి కదిలిపోయాడు. ఎందుకంటే ఏదో అవసరం వచ్చి గతంలో తల్లి నగలు కుదవ పెట్టాల్సి వచ్చిందట. అవి విడిపించుకోలేకపోయారు. అది గుర్తొచ్చి వద్దు వద్దు అన్నాడు. ఏం పట్టించుకోకు.. లోను తీసుకోవడానికి సెంటిమెంట్లు ఏమిటి అని తెచ్చి ఇచ్చాను. ఆ రోజు గాజులు లేని నా బోసి చేతులను చూసి నారాయణమూర్తి చాలా బాధ పడ్డాడు. కొన్నాళ్లకు విడిపించాడనుకోండి. ఈ మాత్రం సర్దుబాట్లు కాపురంలో అవసరం' అన్నారామె.

●●●

వైవాహిక బంధం ఎలా నిలబడుతుంది? ఆడియెన్స్‌లో ఎవరో అడిగారు.

'నమ్మకం, సహనం, సర్దుబాటుతనం వల్ల మాత్రమే. జీవితంలో సహనం ముఖ్యమైనది. సహనంగా ఉంటే జీవితం మనకు కావలసినవి ఇస్తుంది. వైవాహిక జీవితంలో అనుకున్నవన్నీ చేసే స్వేచ్ఛ, వీలు లేకపోవచ్చు. అప్పుడు ఉన్న పరిమితుల్లోనే ఎలా ఆనందంగా ఉండాలో తెలుసుకోవాలి. నారాయణమూర్తి ఇన్ఫోసిస్ మొదలుపెట్టి బిజీగా ఉండగా నేను ఐదేళ్లూ పిల్లల్ని చూసుకుంటూ కూడా పుస్తకాలు రాసి సంతోషపడ్డాను. వీలైనంతగా కొత్త ప్రాంతాలు చూశాను. మగవాళ్లకు సాధారణంగా ఆడవాళ్లు తమ కంటే తెలివితక్కువగా ఉండాలని ఉంటుంది. అవసరమైతే వారిని అలా అనుకోనిచ్చేలా చేస్తూ స్త్రీలు తమ సామర్థ్యాలను వీలైనంత ఉపయోగించుకోవాలి. జీవితంలో, వైవాహిక జీవితంలో రాణించాలి' అన్నారు సుధామూర్తి.

– జైపూర్ నుంచి
సాక్షి ప్రతినిధి

పురస్కారం

జనం మెచ్చిన పాప్ ప్రభంజనం



పాప్ పవర్‌హౌజ్ టేలర్ స్విఫ్ట్ పేరు పలికితే 'రికార్డ్' అనే శబ్దం ప్రతిధ్వనిస్తుంది. 2024 గ్రామీ అవార్డ్‌లలో టేలర్ ఆల్బమ్ 'మిడ్‌నైట్స్' 'బెస్ట్ ఆల్బమ్ ఆఫ్ ద ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. దీంతో బెస్ట్ ఆల్బమ్ విభాగంలో వరుసగా నాలుగు సార్లు అవార్డ్ గెల్చుకున్న తొలి మహిళా గాయనిగా రికార్డ్ సృష్టించింది టేలర్ స్విఫ్ట్....

'ఏ గూటి చిలక ఆ గూటి పలుకే పలుకుతుంది' అంటారు. పలుకే కాదు... పాట కూడా పాడుతుంది అనుకోవచ్చు. అయితే అందరి విషయంలోనూ ఇది నిజం కాకపోవచ్చు. టేలర్ స్విఫ్ట్ విషయంలో మాత్రం అక్షరాలా నిజమైంది. 'పెన్సిల్వేనియాలోని రీడింగ్ హాస్పిటల్‌లో పుట్టిన టేలర్ పుట్టగానే ఏడ్చింది అంటే నేను నమ్మను. పుట్టగానే తీయగా పాట పాడి ఉంటుంది' అని ఆమె అభిమానులు చమత్కరిస్తుంటారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే 'ఇల్లంతా సంగీతమే' అన్నట్లుగా ఉండేది టేలర్ ఇల్లు. తండ్రి స్కాట్ కింగ్స్ లీ స్విఫ్ట్ స్టాక్‌బ్రోకర్. సంగీతప్రేమికుడు. తల్లి ఆండ్రియా స్విఫ్ట్ మ్యూచువల్ ఫండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసి ఆ తరువాత ఇంటికే పరిమితమైంది. ఆండ్రియా గాయకురాలు. టేలర్ తమ్ముడు నటుడు. అమ్మమ్మ ఒపెరా సింగర్.

తొమ్మిదేళ్ల వయసు నుంచి పాటలతో ప్రయాణం మొదలు పెట్టింది టేలర్. పాటలోనే కాదు నటనలోనూ అద్భుతమైన ప్రతిభ చూపేది. స్థానిక పండగల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలలో టేలర్ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. షానియా ట్వెన్ పాటలతో స్ఫూర్తి పొందిన టేలర్ జానపదాలను ఇష్టపడింది. పన్నెండేళ్ల వయసులో ఉన్నప్పుడు స్థానిక కళాకారుడు రోనీ క్రీమర్ నుంచి గిటార్ ప్లే చేయడం నేర్చుకుంది. పాటలు రాసే విషయంలో కూడా రోనీ క్రీమర్ టేలర్‌కు సహాయపడేవాడు. కెరీర్ ప్రారంభంలోనే టేలర్ అనుభవజ్ఞులైన సంగీతకారులు, గేయ రచయితలతో కలిసి పని చేసింది.

ప్రపంచంలోని ప్రముఖులతో పోటీ పడి టైమ్ మ్యాగజైన్ 'పర్సన్ ఆఫ్ ద ఇయర్–2023'కు ఎంపికైంది.

గత సంవత్సరం యూఎస్ ఎకనామిక్ రిపోర్ట్‌లో టేలర్ ప్రస్తావన కనిపించింది. 'పాప్ సింగర్ ప్రస్తావన ఈ రిపోర్ట్‌లో ఎందుకు వచ్చింది!' అని చాలామంది ఆశ్చర్యపోయారు.' ఫిలడెల్ఫియాలో టేలర్ షోలకు జనాలు విపరీతంగా తరలివచ్చారు. బుకింగ్స్‌తో హోటళ్లు కిటకిటలాడిపోయాయి. ఒక్క నెలలోనే హోటళ్ల ఆదాయం భారీగా పెరగడానికి కారణం టేలర్ స్విఫ్ట్ మ్యూజిక్ షోకు వచ్చిన అభిమానులు' అంటూ ఆ రిపోర్ట్‌లో టేలర్ స్విఫ్ట్ ప్రస్తావన కనిపిస్తుంది.



నిద్రలేని రాత్రుల మిడ్‌నైట్స్

'నా నిద్రలేని రాత్రుల నుంచి వచ్చిన ఆల్బమ్ ఇది' అని 'మిడ్‌నైట్స్' గురించి అంటోంది టేలర్ స్విఫ్ట్. 'మిడ్‌నైట్స్'ను కాన్సెప్ట్ ఆల్బమ్‌గా రూపొందించింది. ఈ ఆత్మకథాత్మక గీతరచనలో పశ్చాత్తాపం నుంచి స్వీయ విమర్శ వరకు ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. పాటల రచన, సంగీత నిర్మాణానికి సంబంధించి 'మిట్‌నైట్ ఆల్బమ్'ను విశ్లేషకులు ఆకాశానికెత్తారు. తన గత ఆల్బమ్‌లతో పాటు 'మిడ్‌నైట్స్'ను ప్రపంచవ్యాప్తంగా శ్రోతలకు వినిపించడానికి ఎరాస్ టూర్ (2023–2024)ని మొదలు పెట్టింది టేలర్ స్విఫ్ట్.



సాగుబడి

ధనిష్ట కార్తె:
ఫిబ్రవరి 6 నుంచి



అధిక పోషకాల దేశీ పంటలే ఆరోగ్యం

- ఏడేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీ వరి, కరివేపాకు పంటలు సాగు చేస్తున్న విశ్రాంత ఉద్యోగి
- 6 ఎకరాల్లో 15 రకాల దేశీ వరి రకాల సాగు.. నవార తప్ప మిగతా ధాన్యాలను విత్తనాలకే విక్రయం
- రెండెకరాల్లో కరివేపాకు విత్తనోత్పత్తి.. ఎకరానికి 40-50 కిలోల విత్తనం చాలు..మ
- 8 ఎకరాల్లో ఏటా రూ. 5-6 లక్షల నికరాదాయం పొందుతున్న గోగుల రాధాకృష్ణయ్య

అధిక పోషకాలున్న దేశీ వంగడాలతో ప్రకృతి వ్యవసాయం చేస్తేనే ఇటు భూదేవి ఆరోగ్యంతో పాటు అటు ప్రజల, పర్యావరణ, పశుపక్ష్యాదుల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని మనసా వాచా కర్మణా నమ్మిన ఆదర్శ రైతు గోగుల రాధాకృష్ణయ్య. ప్రభుత్వ ఉద్యోగం నుంచి రిటైరైన తర్వాత 8 ఎకరాల సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని పండించి తాను తింటూ, నలుగురికీ అందిస్తున్నారు. ఆయన క్షేత్రం ప్రకృతి వ్యవసాయదారులు, వ్యవసాయ విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణాలయంగా మారిపోయింది. ఈ ఏడాది జనవరి 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆహ్వానం మేరకు గోగుల విజయవాడలోని రాజభవన్‌లో తేనేటి విందులో పాల్గొనటం విశేషం. ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వటం ద్వారా ప్రకృతి సేద్యాన్ని రైతులందరికీ నేర్పించాలని సూచిస్తున్న 63 ఏళ్ల రాధాకృష్ణయ్య సేద్య అనుభవాల సారమిది..

వైఎస్సార్ జిల్లా బద్వేల్ మండలం చింతల చెరువు పంచాయతీ అబ్బుసాహేబ్ పేటకు చెందిన గోగుల రాధాకృష్ణయ్య కడప నీటిపారుదల శాఖలో సహాయ సాంకేతిక అధికారిగా పనిచేస్తూ 2013లో ఉద్యోగ పదవీ విరమణ చేశారు. వ్యవసాయంపై మక్కువతో తమకున్న 8 ఎకరాల్లో వ్యవసాయం మొదలు పెట్టారు. రెండేళ్లపాటు సాధారణ రసాయనిక వ్యవసాయం చేసినా భూమి నిస్సారం కావటం వల్ల అంతగా ఆదాయం రాలేదు. ఆ దశలో 2017లో సుభాష్ పాలేకర్ వద్ద 5 రోజుల శిక్షణ పొంది అధిక పోషక విలువలు కలిగిన దేశీ వరి వంగడాలతో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. రాధాకృష్ణయ్యకు 2017లో ప్రభుత్వం నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ షాపు మంజూరు చేసింది. దీంతో ఆయన కషాయాలు, వేప పిండి వంటి వాటిని తయారు చేసి విక్రయిస్తూ, తానూ శ్రద్ధగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

తొలుత 6 ఎకరాల్లో నవార, బర్మాబ్లాక్, పరిమళ సన్న, బహురూపి, మాపిళ్లై సాంబ 5 రకాల దేశీ వరిని సాగు చేశారు. రెండెకరాల్లో కరివేపాకు సాగు చేస్తున్నారు. తొలి రెండేళ్లు కరివేపాకు సాగు చేస్తూ ఏటా మూడు పంట కోతలు చేసేవారు. ప్రకృతి వ్యవసాయ శాఖాధికారుల సూచన మేరకు గత ఐదేళ్లుగా కరివేపాకు విత్తనోత్పత్తిపై దృష్టిపెట్టారు. ప్రస్తుతం 2 ఎకరాల్లో దేశవాళీ వరి నవార రకాన్ని, 2 ఎకరాల్లో కరివేపాకు విత్తనోత్పత్తి చేస్తున్నారు. మిగతా 4 ఎకరాల్లో పరిమళ సన్న, సుంగధి, ఇంద్రాణి, కాలాభట్, మణిపూర్ బ్లాక్, బ్లాక్ బర్మా, బహురూపి, మాపిళ్లై సాంబ, సిద్ధ సన్నాలు, కుజిపటాలియా, రత్నచోళి, రత్నశాలి వంటి 14 రకాల దేశవాళీ వరిని సాగు చేస్తున్నారు. ఈ దేశీ వరి విత్తనాలను ఏపీ, తెలంగాణ, తమిళనాడులోని పలు జిల్లాలకు చెందిన ప్రకృతి వ్యవసాయదారులకు కిలో 100–120 చొప్పున విక్రయిస్తున్నారు. వాట్సప్ వంటి సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేస్తున్నారు.

రెండెకరాల్లో నవార

కేరళకు చెందిన పోషకాల గని వంటి నవార ధాన్యాన్ని రెండెకరాల్లో పండిస్తున్నారు రాధృకృష్ణయ్య. 6 నెలలు మాగబెట్టిన ధాన్యాన్ని మర పట్టించి కిలో రూ. 120–130 చొప్పున నవార ముడి బియ్యాన్ని రాధాకృష్ణయ్య అమ్ముతున్నారు. ఈ బియ్యం తిన్న షుగర్, బీపీ, క్యాన్సర్ తదితర వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం మెరుగుపడుతున్నదని ఆయన తెలిపారు. నవార బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో ఈ ఒక్క రకాన్ని 2 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వడ్లు నలుపుగా బియ్యం ఎరుపుగా ఉండే నవారను రబీ కాలంలో సాగు చేస్తే పడిపోకుండా ఉంటుందన్నారు. మనుషులతోనే నాట్లు, కోత, నూర్పిడి చేయిస్తానని, ఎకరానికి రూ. 21 వేల ఖర్చు వస్తోందన్నారు. ఎకరానికి 18 బస్తాల ధాన్యం పండుతోంది. 76 కిలోల ధాన్యం నుంచి 51 కిలోల ముడిబియ్యం దిగుబడి వస్తోందన్నారు. వాట్సప్ ద్వారా సమాచారం తెలుసుకొని ఆర్డర్లు ఇచ్చే వారికి పార్శిల్ ద్వారా పంపుతున్నామన్నారు.

కరివేపాకు విత్తనోత్పత్తి

రాధాకృష్ణయ్య 2 ఎకరాల్లో కరివేపాకును 7 ఏళ్లుగా సాగు చేస్తున్నారు. ఏటా మూడు సార్లు కరివేపాకు అమ్మేవారు. తరువాత ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది సూచనల మేరకు నాలుగేళ్లుగా కరివేపాకు విత్తనాలు ఉత్పత్తి చేసి అమ్ముతున్నారు. ఒక్కో ఎకరాకు 500 కిలోల వరకు కరివేపాకు విత్తనాల దిగుబడి వస్తుంది. ఎకరానికి 40–50 కిలోల నాణ్యమైన విత్తనం సరిపోతుందని, పండ్లను ఎండబెట్టకుండా చెట్టు నుంచి కోసిన ఒకటి, రెండు రోజుల్లోనే నాటుకోవాలని, ఇలా చేస్తే 90% మొలక వస్తున్నదని రాధాకృష్ణయ్య తెలిపారు. ఖర్చులన్నీ పోను ఎకరానికి కనీసం రూ. 1,50,000 ఆదాయం పొందుతున్నానని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు బద్వేల్‌లోని బీబీఆర్ కళాశాలకు చెందిన అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులకు గోగుల వ్యవసాయ క్షేత్రంలోనే శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుండటం విశేషం. ఆరోగ్యంగా జీవించాలంటే పోషకాలు పుష్కలంగా ఉండే దేశీ వంగడాలతో పండించిన ప్రకృతి వ్యవసాయోత్పత్తులనే ఆహారంగా తినాలని ఆయన సూచిస్తున్నారు.

– గోసల యల్లారెడ్డి,
సాక్షి, కడప అగ్రికల్చర్, వైఎస్సార్ జిల్లా

ఆహారం ద్వారానే ఆరోగ్యం అని నమ్మి...



అధిక పోషకాలున్న దేశీ వంగడాలతో ప్రకృతి వ్యవసాయం ద్వారా మాత్రమే భూదేవి ఆరోగ్యంతో పాటు ప్రజల, పర్యావరణ, పశుపక్ష్యాదుల ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుంది. సుభాష్ పాలేకర్ 5 రోజుల శిక్షణ ద్వారా ఈ వాస్తవాన్ని తెలుసుకొని 8 ఎకరాల్లో పకృతి వ్యవసాయం చేస్తున్నాను. అంతకు ముందు రసాయనిక వ్యవసాయం వల్ల భూమి నిస్సారమై కౌలు రైతులకు గిట్టుబాటు కాకపోవటంతో నాలుగైదేళ్లు పొలాలు బీళ్లు పెట్టాం. ఇప్పుడు 2 ఎకరాల్లో నవార దేశీ వరి సాగు చేసి బియ్యం పట్టించి వాట్సప్ సాయంతో అమ్ముతున్నాను. 2 ఎకరాల్లో కరివేపాకు విత్తనోత్పత్తితో పాటు మరో 4 ఎకరాల్లో 14 రకాల అధిక పోషకాలున్న దేశీ వరి రకాల విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు విక్రయిస్తున్నాను. 8 ఎకరాల సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అన్ని ఖర్చులూ పోను రూ. 5–6 లక్షల నికరాదాయం పొందుతున్నాను. ఆహారం ద్వారానే ఆరోగ్యం అని నమ్మి రిటైరయ్యాక ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందుకు 2024 రిపబ్లిక్ డేని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్‌తో కలసి తేనీటి విందులో పాల్గొనే గౌరవం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది. మా ఇంట్లో ఇడ్లీ, దోసెలకు, మధ్యాహ్న భోజనానికి నవార బియ్యాన్నే వాడుతున్నాం.. ఆరోగ్యంగా ఉన్నాం..

– గోగుల రాధాకృష్ణయ్య (93474 10695),
దేశీ వరి, కరివేపాకు విత్తన రైతు, బద్వేల్, వైఎస్సార్ జిల్లా





మాగాణుల్లో మిథేన్‌కు చిరు చేపలతో చెక్!



వాతావరణాన్ని వేడెక్కిస్తున్న మిథేన్ కార్బన్ డయాక్సయిడ్ కన్నా 86 రెట్లు పర్యావరణానికి హాని చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలోకి విడుదలవుతున్న మిథేన్ వాయువులో 10% మేరకు వరి పొలాల నుంచే వెలువడుతోందని అంచనా. అయితే, వరి పొలాల్లోని నీటిలో (గోల్డెన్ షైనర్ రకం) చిరు చేపలను పెంచితే మూడింట రెండొంతుల మిథేన్ వాయువు తగ్గిందని కాలిఫోర్నియాకు చెందిన రిసోర్స్ రెన్యువల్ ఇన్‌స్టిట్యూట్(ఆర్ఆర్ఐ) అనే స్టార్టప్ కంపెనీ చెబుతోంది.

'ఫిష్ ఇన్ ద ఫీల్డ్స్' పేరిట పైలట్ ప్రాజెక్టు ద్వారా రెండేళ్లుగా పరిశోధనలు చేస్తున్న ఈ స్టార్టప్ కంపెనీ ఇటీవల 'ద జెఎంకప్లన్ ఇన్నోవేషన్ ప్రైజ్'ను గెల్చుకొని ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. 'వరి రైతులకు చేపల ద్వారా అదనపు ఆదాయం కూడా సమకూరుతుంది. సముద్ర చేపలను దాణాల్లో వాడే బదులు ఈ పొలాల్లో పెరిగే చేపలను వాడటం ద్వారా భూతాపాన్ని తగ్గించడానికి, చేపల జీవవైవిధ్యాన్ని పెంపొందించడానికి మా పరిశోధనలు ఉపకరిస్తాయి. 1,75,000 డాలర్ల ప్రైజ్ మనీతో మేం చేపట్టిన ప్రయోగాత్మక సాగుకు ఊతం వచ్చింది..' అన్నారు ఆర్.ఆర్.ఐ. వ్యవస్థాపకులు డెబోరా మోస్కోవిట్జ్, ఛాన్స్ కట్రానో. ఆసియా దేశాల్లో అనాదిగా సాగు చేస్తున్న వరి–చేపల మిశ్రమ సాగులో అదనపు ప్రయోజనాన్ని కొత్తగా వారు శోధిస్తున్నారు. సుస్థిర ఆక్వా సాగుతో పాటు రైతుల ఆదాయం పెరుగుదలకు, భూతాపం తగ్గడానికి ఉపకరిస్తుందంటున్నారు. మాగాణుల్లో వరితో పాటు చేపలు పెంచితే 'కార్బన్ క్రెడిట్స్' ద్వారా కూడా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది.



మార్చి 5 నుంచి ఐఐహెచ్‌ఆర్‌లో ఉద్యాన ప్రదర్శన

బెంగళూరులోని హెసరగట్ట లేక్ పోస్టు ప్రాంతంలో ఏర్పాటైన భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐసీఎఆర్- ఐఐహెచ్ఆర్) దక్షిణాదికి సరిపడే ఉద్యాన తోటలు, పంటల సాగు పరిశోధనలకు పెట్టింది పేరు. ప్రతి ఏటా ఐఐహెచ్ఆర్ నిర్వహించే ఉద్యాన ప్రదర్శన ఆధునిక పోకడలను, సరికొత్త సాంకేతికతలను రైతాంగానికి పరిచయం చేస్తుంటుంది. ఈ ఏడాది మార్చి 5–7 తేదీల్లో 'సుస్థిర అభివృద్ధి కోసం కొత్తతరం సాంకేతికతతో కూడిన ఉద్యాన పంటలు, తోటల సాగు' అనే అంశంపై జాతీయ ఉద్యాన ప్రదర్శన జరగనుంది. ఈ సందర్భంగా అనేక అంశాలపై సదస్సులు నిర్వహిస్తారు. సందర్శించదలచుకున్న వారు ఫీజు చెల్లించనవసరం లేదు. అయితే, ముందుగా వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.. https://visitor.nhf2024.in/

11న గో ఉత్పత్తులతో శిక్షణ

దేశీ ఆవులను పెంచే రైతులు, గోశాలల నిర్వాహకులు ఆవు పేడ, మూత్రంతో అనేక ఉత్పత్తులను తయారు చేసి, సోషల్ మీడియా ద్వారా వినియోగదారులకు విక్రయించటం ద్వారా ఆర్థిక స్వావలంబన పొందేందుకు ఉన్న అవకాశాలపై జగిత్యాల జిల్లా మురళీధర గోధామం వ్యవస్థాపకులు డా. చెన్నమనేని పద్మ ఈ నెల 11న(ఉ.10–సా.4 వరకు) శిక్షణ ఇవ్వనున్నారు. ఫీజు రూ.1,100. స్వయంగా హాజరై శిక్షణ పొందే ఆసక్తి గల వారు ఇతర వివరాలకు సంప్రదించాల్సిన నంబర్.. 98497 50854

16-18 తేదీల్లో అగ్రిటెక్ సౌత్

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 16–18 తేదీల్లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సాంకేతికతల ప్రదర్శన, సాంకేతిక సదస్సులు నిర్వహించనున్నట్లు సిఐఐ సీనియర్ నేత చేరబుడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతలు, ఉత్పాదకాలు, సేవలను రైతులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. సేంద్రియ వ్యవసాయం సహా అనేక ముఖ్యమైన అంశాలపై చర్చాగోష్ఠులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు.. 98491 14758, 98494 70365.

ఔషధ మొక్కల పెంపకంపై 21-23 తేదీల్లో శిక్షణ

హైదరాబాద్ బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల సంస్థ ఆవరణలో ఈ నెల 21-23 తేదీల్లో మార్కెట్‌లో గిరాకీ ఉన్న నిమ్మగడ్డి, పామరోసా, అశ్వగంధ వంటి ఔషధ, సుగంధ పంటల సాగు, ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ అవకాశాలపై ఆంగ్లంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చీఫ్ సైంటిస్ట్ కిరణ్ బాబు తెలిపారు. స్వయంగా శిక్షణకు హాజరు కావాలి. వసతి సదుపాయం లేదు. ఫీజు రూ. 3 వేలు. ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు.. 94180 97221, 94934 08227. https://www.cimap.res.in/pages/Training.aspx

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ సెమీస్ పోరు

అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ ఆతిథ్య దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. 1988లో మొదలైన అండర్-19 ప్రపంచకప్‌ల చరిత్రలో అత్యధికంగా 8 సార్లు ఫైనల్ చేరిన భారత్... 2000, 2008, 2012, 2018, 2022లలో ఐదుసార్లు విజేతగా నిలిచింది. ఉదయ్ సహరన్ నేతృత్వంలోని యువ జట్టు ఆల్‌రౌండ్ నైపుణ్యంతో ఉంది. ఈ టోర్నీలో వరుసగా ఐదు విజయాలు సాధించింది. ఈ మెగా ఈవెంట్‌కు ముందు సన్నాహకంగా ఆడిన ముక్కోణపు సిరీస్‌లో సఫారీ జట్టును భారత్ రెండు వన్డేల్లో ఓడించింది. కీలకమైన సెమీస్‌కు ముందు యువ భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచే అంశమిది. ఇదే సమరోత్సాహంతో ఆతిథ్య దక్షిణాఫ్రికాను మట్టికరిపించాలనే పట్టుదలతో ఉంది. బ్యాటింగ్‌లో ముషీర్ ఖాన్, కెప్టెన్ ఉదయ్, సచిన్ దాస్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో సౌమీ కుమార్ పాండే, నమన్ తివారి, రాజ్ లింబాని కూడా నిలకడగా రాణిస్తుండటం జట్టును పటిష్టంగా నిలిపింది. మధ్యాహ్నం 1.30 గంటలకు మొదలయ్యే ఈ సెమీస్ పోరును స్టార్‌స్పోర్ట్స్ ప్రసారం చేస్తుంది.





విశాఖలో లెక్క సరి

భారత జట్టు ప్రతీకార విజయం	రెండో టెస్టులో 106 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు	రాణించిన బుమ్రా, అశ్విన్	సిరీస్ 1-1తో సమం	ఈ నెల 15నుంచి రాజ్‌కోట్‌లో మూడో టెస్టు

భారీ లక్ష్య ఛేదనలో 'బజ్‌బాల్' మంత్రం పని చేయలేదు...దూకుడైన ఆటతో చెలరేగి విజయతీరం చేరాలనుకున్న ఇంగ్లండ్ ఆటలు సాగలేదు...భారత బౌలింగ్ సామర్థ్యం ముందు బ్యాటర్లు తలవంచారు...మన బౌలర్ల ప్రతిభకు తోడు స్వీయతప్పిదాలు పర్యాటక జట్టును దెబ్బ తీశాయి...కీలక సమయాల్లో వికెట్లు తీసిన టీమిండియా నాలుగో రోజే ఇంగ్లండ్‌ను పడగొట్టింది...హైదరాబాద్‌లో ఎదురైన ఓటమికి విశాఖపట్నంలో ప్రతీకారం తీర్చుకుంది. తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో సిరీస్‌ను 1–1తో సమం చేసి రాబోయే టెస్టులపై ఆసక్తిని పెంచింది.

తొలి ఇన్నింగ్స్‌కంటే మరింత పదునైన బంతులతో చెలరేగిన బుమ్రా ఇంగ్లండ్‌ను ఉక్కిరిబిక్కిరి చేయగా, అశ్విన్ అండగా నిలిచాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగానే ఉన్నా...పెద్దగా స్పిన్ టర్న్ లేకపోయినా క్రాలీ మినహా ఎవరూ నిలవలేకపోయారు. అద్భుత ఫీల్డింగ్ భారత బలాన్ని రెట్టింపు చేసి విజయానికి బాటలు వేసింది. స్టోక్స్ సేన తాము ఆశించినట్లుగా గెలుపు పక్షాన నిలవలేకపోయినా...నాలుగో ఇన్నింగ్స్‌లో మూడు వందల పరుగులకు చేరువగా వచ్చి గట్టి పోటీనివ్వగలిగామనే సంతృప్తితో ముగించింది.


చివరి వికెట్‌గా బుమ్రా బౌలింగ్‌లో హార్ట్‌లీ బౌల్డ్

విశాఖ స్పోర్ట్స్: భారత గడ్డపై ఒక విదేశీ జట్టు నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్యాన్ని ఛేదించి విజయాన్ని అందుకున్న సందర్భాల్లో ఆ టీమ్ సాధించిన అత్యధిక స్కోరు 276 పరుగులు...ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ అంతకంటే ఎక్కువ పరుగులే చేసింది. కానీ చివరకు ఆ పోరాటం సరిపోక వందకు పైగా పరుగుల భారీ తేడాతో ఓటమిని ఎదుర్కోవాల్సి వచ్చింది. సోమవారం నాలుగో రోజే ముగిసిన రెండో టెస్టులో భారత్ 106 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై ఘన విజయం సాధించింది. 399 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. జాక్ క్రాలీ (132 బంతుల్లో 73; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలవగా...టామ్ హార్ట్‌లీ (47 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్), బెన్ ఫోక్స్ (69 బంతుల్లో 36; 4 ఫోర్లు, 1 సిక్స్) చివర్లో ప్రతిఘటించారు. ఈ ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జస్‌ప్రీత్ బుమ్రా (9/91) మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లతో టెస్టు ఫలితాన్ని శాసించగా, అశ్విన్ 3 వికెట్లు తీశాడు. తాజా ఫలితం తర్వాత ఐదు టెస్టుల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. కొంత విరామం తర్వాత ఈ నెల 15నుంచి రాజ్‌కోట్‌లో మూడో టెస్టు జరుగుతుంది.

రూట్, స్టోక్స్ విఫలం...

ఓపెనర్ క్రాలీతో పాటు నైట్‌వాచ్‌మన్ రేహన్ అహ్మద్ (27 బంతుల్లో 28; 6 ఫోర్లు) కూడా సోమవారం ఉదయం కొద్ది సేపు భారత బౌలర్లను ఇబ్బంది పెట్టాడు. ఎట్టకేలకు బుమ్రా ఈ జోడీని విడదీసినా ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన ఒలీ పోప్ (23) ఒక్క అక్షర్ బౌలింగ్‌లోనే ఐదు ఫోర్లు బాదాడు. స్లిప్‌లో రోహిత్ సూపర్ క్యాచ్‌కు పోప్ వెనుదిరిగాడు. అయితే చెత్త షాట్‌తో రూట్ భారత్‌కు కీలక వికెట్ ఇచ్చేశాడు. అశ్విన్ బౌలింగ్‌లో మిడ్ వికెట్ వైపు గుడ్డిగా ఆడబోయిన రూట్ బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో క్యాచ్ ఇచ్చాడు. దాంతో ఇంగ్లండ్ జోరుకు కళ్లెం పడింది. ఆపై లంచ్ విరామానికి ముందు రెండు ఓవర్లలో రెండు వికెట్లు పడగొట్టిన టీమిండియా విజయానికి బాటలు వేసుకుంది. కుల్దీప్ బౌలింగ్‌లో క్రాలీ వికెట్ల ముందు దొరికిపోగా, డీఆర్‌ఎస్ ఫలితం కాస్త చర్చకు దారి తీసింది. బుమ్రా బంతికి బెయిర్‌స్టో వద్ద జవాబు లేకపోయింది. స్టోక్స్ ఉన్నంత వరకు కాస్త ఆశలు ఉన్నా...అతని రనౌట్‌తో జట్టు ఓటమి దాదాపుగా ఖాయమైంది. సింగిల్ తీసే క్రమంలో స్టోక్స్ బద్ధకంగా కదలగా...అయ్యర్ మెరుపు త్రో అతని ఆటను ముగించింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 396; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 253; భారత్ రెండో ఇన్నింగ్స్ 255; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (ఎల్బీ) (బి) కుల్దీప్ 73; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రేహన్ (ఎల్బీ) (బి) అక్షర్ 23; పోప్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 23; రూట్ (సి) అక్షర్ (బి) అశ్విన్ 16; బెయిర్‌స్టో (ఎల్బీ) (బి) బుమ్రా 26; స్టోక్స్ (రనౌట్) 11; ఫోక్స్ (సి) అండ్ (బి) బుమ్రా 36; హార్ట్‌లీ (బి) బుమ్రా 36; బషీర్ (సి) భరత్ (బి) ముకేశ్ 0; అండర్సన్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (69.2 ఓవర్లలో ఆలౌట్) 292.** వికెట్ల పతనం: 1-50, 2-95, 3-132, 4-154, 5-194, 6-194, 7-220, 8-275, 9-281, 10-292.

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో భారత్ ముందుకు దూసుకుపోయింది. ఇప్పటి వరకు ఐదో స్థానంలో ఉన్న భారత్ ఈ గెలుపుతో మూడు స్థానాలు మెరుగుపర్చుకొని రెండో స్థానానికి (52.77 పాయింట్ల శాతం) చేరుకుంది. ఆస్ట్రేలియా అగ్ర స్థానంలో (55 పాయింట్ల శాతం) కొనసాగుతోంది.

క్వార్టర్ ఫైనల్లో నిఖత్ జరీన్

స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీ



సోఫియా (బల్గేరియా): రెండు సార్లు ప్రపంచ చాంపియన్, తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మహిళల 50 కేజీల విభాగంలో సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆమె 3-2తో ఒయున్త్సెట్సెగ్ యెసుగెన్ (మంగోలియా)పై నెగ్గింది. ఈ బౌట్‌లో ఇద్దరు నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. ప్రతీ రౌండ్లోనూ పంచ్‌లతో ఒకరిపై ఒకరు పైచేయి సాధించారు. చివరకు విజయం నిఖత్‌నే వరించింది. అయితే మరో భారత స్టార్ బాక్సర్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గోహైన్ బౌట్‌లో ఊహించని రీతిలో అనర్హతకు గురై వెనుదిరిగింది. 75 కేజీల విభాగంలో ఓ రూర్కే ఆయిఫే (ఐర్లాండ్)తో తలపడుతుండగా లవ్లీనా రిఫరీ మూడో హెచ్చరికకు గురైంది. దీంతో మూడో రౌండ్ పూర్తవకముందే డిస్‌క్వాలిఫైతో బౌట్ నుంచి నిరాశగా నిష్క్రమించింది. 57 కేజీల కేటగిరీలో సాక్షి చౌదరి 5-0తో సెల్‌మౌని చాహిర (అల్జీరియా)పై ఏకపక్ష విజయం సాధించింది. ఆసియా క్రీడల కాంస్య పతక విజేత ప్రీతి పవార్ (54 కేజీలు)కు ప్రిక్వార్టర్స్‌లో 2-3తో ఫే నియ (ఐర్లాండ్) చేతిలో చుక్కెదురైంది.



'ప్లే ఆఫ్స్'కు పుణేరి పల్టన్

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో పుణేరి పల్టన్ జట్టు 'ప్లే ఆఫ్స్' దశకు అర్హత సాధించింది. సోమవారం పుణేరి పల్టన్, దబంగ్ ఢిల్లీ మధ్య జరిగిన మ్యాచ్ 'టై'గా ముగిసింది. ఇరు జట్లూ 30-30 పాయింట్ల స్కోరుతో సమంగా నిలిచాయి. పుణేరి తరఫున అస్లామ్ ముస్తఫా 10 పాయింట్లు స్కోరు చేయగా...దబంగ్ కెప్టెన్ అషు మలిక్ 8 పాయింట్లు నమోదు చేశాడు. ఈ మ్యాచ్ అనంతరం 17 మ్యాచ్‌ల ద్వారా మొత్తం 71 పాయింట్లు సాధించిన పుణేరి 'ప్లే ఆఫ్స్'కు చేరింది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 36-33 పాయింట్ల తేడాతో పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది. పట్నా తరఫున కెప్టెన్ సచిన్, సుధాకర్ చెరో 10 పాయింట్లతో చెలరేగగా జైపూర్ ఆటగాళ్లలో అర్జున్ దేశ్వాల్ (12 పాయింట్లు) రాణించాడు.

రచిన్ డబుల్ సెంచరీ



మౌంట్ మాంగనుయ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మొదటి టెస్టులో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగుల భారీ స్కోరు చేసి ఆలౌటైంది. 258/2 స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన కివీస్ జట్టులో రచిన్ రవీంద్ర (240; 26 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీ సాధించాడు. డర్రైల్ మిచెల్ (34)తో నాలుగో వికెట్‌కు 103 పరుగులు, ఫిలిప్స్ (39)తో ఆరో వికెట్‌కు 82 పరుగులు జోడించి జట్టు భారీ స్కోరుకు రచిన్ బాట వేశాడు. కెప్టెన్, ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన లెఫ్టార్మ్ స్పిన్నర్ నీల్ బ్రాండ్ 119 పరుగులిచ్చి 6 వికెట్లు తీయడం విశేషం. అనంతరం దక్షిణాఫ్రికా ఆట నిలిచే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది.

శ్రీలంక ఘన విజయం



కొలంబో: అఫ్గానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో శ్రీలంక 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 199/1తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్గానిస్తాన్ 296 పరుగుల వద్ద ఆలౌటైంది. రహ్మత్ షా (54) అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, నసీర్ జమాల్ (41 నాటౌట్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రభాత్ జయసూర్య (5/107) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. తొలి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యం (241) సాధించిన శ్రీలంక ముందు 56 పరుగుల లక్ష్యం నిలిచింది. ఓపెనర్లు కరుణరత్నే (32 నాటౌట్), నిషాన్ మదుష్క (22 నాటౌట్) 7.2 ఓవర్లలోనే అజేయంగా దీనిని అందుకున్నారు.

సహజ సంచలన విజయం

ముంబై: తెలుగమ్మాయి సహజ యమలపల్లి ముంబై ఓపెన్ (డబ్ల్యూటీఏ-125) టెన్నిస్ టోర్నీలో సంచలన విజయాన్ని నమోదు చేసింది. తొలి రౌండ్‌లో సహజ 6-4, 1-6, 6-4 స్కోరుతో వరల్డ్ నంబర్ 92, టాప్ సీడ్ కేలా డే (అమెరికా)ను ఓడించింది. మ్యాచ్‌లో 2 ఏస్‌లు కొట్టిన సహజ 4 డబుల్‌ఫాల్ట్‌లు చేసింది.

సినిమా

మరో ముందడుగు


● సాయిపల్లవి

ఆగేదే లేదన్నట్లుగా 'తండేల్' చిత్రం షూటింగ్ నాన్‌స్టాప్‌గా జరుగుతోంది. 'లవ్‌స్టోరీ' చిత్రం తర్వాత హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు డైరెక్టర్ చందూ మొండేటి. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో జాలరి రాజు పాత్రలో నటిస్తున్నారు నాగచైతన్య. రాజు మనసు గెలుచుకున్న అమ్మాయి పాత్రలో సాయిపల్లవి కనిపిస్తారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. హైదరాబాద్, కర్ణాటక, ఉడిపి, గోకర్ణ లొకేషన్స్‌లో షూటింగ్స్‌ను పూర్తి చేశారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో కీలక షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసినట్లు వెల్లడించి, ఈ సినిమా వర్కింగ్ స్టిల్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ''రాజు పాత్ర కోసం నాగచైతన్య అద్భుతంగా మేకోవర్ అయ్యారు. సాయిపల్లవి సహజ సిద్ధంగా కనిపిస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

పద్దెనిమిది ఏళ్ల తర్వాత...


● చిరంజీవి, త్రిష

పద్దెనిమిదేళ్ల తర్వాత స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు హీరో చిరంజీవి, హీరోయిన్ త్రిష. చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ ఈ భారీ బడ్జెట్ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని ఓ హీరోయిన్ పాత్రలో త్రిష నటిస్తున్నట్లుగా యూనిట్ పేర్కొంది. ఈ సినిమా కోసం 13 సెట్లను నిర్మించారు మేకర్స్. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ సెట్‌లో చిరంజీవి, త్రిషలపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు, ఓ పాటను కూడా చిత్రీకరించే పనిలో ఉందట చిత్రబృందం. అలాగే ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి మరో హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. 'విశ్వంభర'ని సంక్రాంతి పండగకి జనవరి 10న విడుదల కానుంది. ఇక 2006లో వచ్చిన 'స్టాలిన్' చిత్రం తర్వాత చిరంజీవి, త్రిష కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రం 'విశ్వంభర'యే కావడం విశేషం.

బేబీ జాన్‌తో బాలీవుడ్‌కి...



బాలీవుడ్‌లో హీరోయిన్ కీర్తీ సురేష్ ప్రస్థానం మొదలైంది. కీర్తీ సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న తొలి హిందీ చిత్రానికి 'బేబీ జాన్' టైటిల్‌ను ఖరారు చేసి, గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో వామికా గబ్బా మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. తమిళ దర్శకుడు ఎ.కాళీశ్వరన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ దర్శకుడు అట్లీ సమర్పణలో జ్యోతిదేశ్ పాండే, మురాద్ ఖేతని, ప్రియా అట్లీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆల్రెడీ షూటింగ్ మొదలైంది. 'బేబీ జాన్'ని మే 31న థియేటర్స్‌లో విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. కాగా తమిళ హిట్ విజయ్ 'తేరీ' (2016) సినిమాకు హిందీ రీమేక్‌గా 'బేబీ జాన్' రూపొందుతోందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. తమిళంలో 'తేరీ' సినిమాకు దర్శకత్వం వహించిన అట్లీ 'బేబీ జాన్' సినిమాకు నిర్మాతగా ఉండటం విశేషం. ఇదిలా ఉంటే.. ఓ రాజకీయ నాయకుడి కొడుకు ఓ అమ్మాయిపై హత్యాచారానికి పాల్పడితే, అతన్ని చంపినందుకు గాను ఓ పోలీసాఫీసర్ జీవితం ఎలాంటి మలుపు తిరిగింది? అన్నదే 'తేరీ' కథ అని తెలిసిందే.

● కీర్తీ సురేష్

అలాంటి వారికి ఆమె రాక్షసి


● జ్యోతిక

జ్యోతిక టైటిల్ రోల్‌లో నటించిన తమిళ చిత్రం 'రాక్షసి'. ఎస్‌వై గౌతమ్ రాజ్ దర్శకత్వంలో ఎస్‌ఆర్ ప్రకాశ్, ఎస్‌ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా 2019 జూలై 5న విడుదలై తమిళనాడులో హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని 'అమ్మ ఒడి' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు వడ్డి రామానుజం, వల్లెం శేషారెడ్డి. ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే వారికి ఆమె ఒక రాక్షసి అంటూ జ్యోతిక పాత్రను పరిచయం చేశారు. ఈ సందర్భంగా వడ్డి రామానుజం, వల్లెం శేషారెడ్డి మాట్లాడుతూ– ''విద్యా వ్యవస్థ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'అమ్మ ఒడి'. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే టీచర్ జ్యోతి పాత్రలో జ్యోతిక కనిపిస్తారు. డబ్బింగ్, సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి, త్వరలోనే సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం. తమిళంలో విజయం సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ హిట్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


● కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రుత్విక్, విశాఖ

రాజా ప్రేమకథ

రుత్విక్ కొండకింది, విశాఖ ధిమాన్ హీరో హీరోయిన్లుగా పరిచయమవుతున్న చిత్రం 'రాజా ది రాజా'. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో బ్రిందావన్ క్రియేషన్స్‌పై చాణక్య అద్దంకి, నిహారికా రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభం అయింది. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ రవిబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు. మణికాంత్ గెల్లి మాట్లాడుతూ– ''తెలవారితే గురువారం' సినిమా తర్వాత నేను డైరెక్షన్ చేస్తున్న మూవీ 'రాజా ది రాజా'. అందమైన ప్రేమకథ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు ప్రకృతితో ముడిపడి ఉన్న ఒక పాయింట్ కథలో ఉంటుంది'' అన్నారు. ''రెగ్యులర్ షూటింగ్ ఆరంభించాం. మే లేదా జూన్‌లో సినిమా రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు చాణక్య అద్దంకి. ''ఒక మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రుత్విక్ కొండకింది. ''హీరోయిన్ కావాలనే నా కల 'రాజా ది రాజా'తో నెరవేరుతున్నందుకు ఆనందంగా ఉంది'' అన్నారు విశాఖ ధిమాన్. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగతు, సంగీతం: మార్క్ కె. రాబిన్.

లగ్గం విందు భోజనంలా ఉంటుంది
- రాజేంద్ర ప్రసాద్

''లగ్గం' సినిమాలో ఎప్పటికీ మరచిపోలేని పాత్ర పోషిస్తున్నాను. నా కెరీర్‌లో 'పెళ్లి పుస్తకం' తర్వాత అంత గొప్ప పాత్ర 'లగ్గం'లో చేస్తున్నాను. తెలుగు వారందరికీ ఈ చిత్ర కథ, కథనాలు కనెక్ట్ అవుతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 'లగ్గం' విందు భోజనంలాంటి సినిమా'' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. సాయి రోనక్, గనవి లక్ష్మణ్ జంటగా రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'లగ్గం'. 'భీమదేవరపల్లి బ్రాంచి' మూవీ ఫేమ్ రమేష్ చెప్పాల దర్శకత్వం వహిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది.


● రాజేంద్ర ప్రసాద్, సాయిరోనక్

రమేష్ చెప్పాల మాట్లాడుతూ– ''పెళ్లి చేసుకోవడమంటే రెండు కుటుంబాలు కలవడం కాదు.. రెండు మనసులు కలవడం అని ఈ మూవీ ద్వారా చెబుతున్నా. సోమవారమే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం'' అన్నారు. ''ఈ సినిమాలో వినోదంతో పాటు భావోద్వేగాలుంటాయి. తెలంగాణ పెళ్లి సంస్కృతి ప్రతి ఒక్కరికి వాళ్ల లగ్గాన్ని గుర్తు చేస్తుంది. పెళ్లి కాని వారికి ఇలా లగ్గం చేసుకోవాలనిపిస్తుంది'' అన్నారు సాయి రోనక్. రోహిణి, ఎల్బీ శ్రీరాం, కృష్ణుడు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: బాల్ రెడ్డి, సంగీతం: చరణ్ అర్జున్.


● రకుల్, జాకీ భగ్నానీ


● స్నేహితులతో రకుల్, జాకీ భగ్నానీ

దోస్తులతో మస్త్ మజా

థాయ్‌ల్యాండ్‌లో మస్త్ మజా చేస్తున్నారు కాబోయే దంపతులు నటుడు-నిర్మాత జాకీ భగ్నానీ, హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్. ఈ నెల 21న గోవాలో జాకీ, రకుల్‌ల వివాహం జరగనుందని బాలీవుడ్‌లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జాకీ, రకుల్ కలిసి థాయ్‌ల్యాండ్ ట్రిప్‌కు వెళ్లారు. క్లోజ్ ఫ్రెండ్స్‌తో సహా థాయ్‌లో వాలిపోయారు. పెళ్లికి ముందు అబ్బాయిలు బ్యాచిలర్ పార్టీ, అమ్మాయిలు బ్యాచిలరెట్ పార్టీ చేసుకుంటారనే విషయం తెలిసిందే. జాకీ-రకుల్ ఈ పార్టీని థాయ్‌ల్యాండ్‌లో ప్లాన్ చేసుకున్నారని భోగట్టా. ఈ పార్టీలో పాల్గొన్న వారిలో మంచు లక్ష్మి, ప్రగ్యా జైస్వాల్ వంటి తారలు ఉన్నారు. ఈ సరదా ట్రిప్ ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇక కుటుంబ సభ్యులు, అత్యంత స్నేహితుల సమక్షంలో ముందు గోవాలో వివాహం చేసుకుని ఆ తర్వాత ముంబైలో ఓ గ్రాండ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నారట రకుల్, జాకీ.

వినోదం పంచే మూర్తి

అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రల్లో 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రం రూపొందింది. శివ పాలడుగు దర్శకత్వంలో ఫ్లై హై సినిమాస్‌పై హర్ష గారపాటి నిర్మించారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''విలన్‌గా అయినా, కమెడియన్‌గా అయినా ప్రేక్షకుల్ని ఇట్టే ఆకట్టుకుంటారు అజయ్ ఘోష్ గారు. 'మ్యూజిక్ షాప్ మూర్తి' ద్వారా ఓ డిఫరెంట్ కంటెంట్‌తో మరోసారి మెప్పిస్తారాయన. ఇందులో ఆయన పాత్ర పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ప్రస్తుతం కొత్త కథలు, డిఫరెంట్ కాన్సెప్ట్ మూవీస్ ప్రేక్షకుల్ని ఎక్కువగా ఆకట్టుకుంటున్నాయి.. అలాంటి వైవిధ్యమైన కథతో మా సినిమా రాబోతోంది. మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: పవన్, కెమెరా: శ్రీనివాస్ బెజుగమ్.


● అజయ్ ఘోష్, చాందిని

సాక్షి బిజినెస్
మంగళవారం
6-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
354	82
71,731	21,772

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	15,582	▽	47
డోజోన్స్	38,330	▽	342
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,613	▽	3
డాక్స్	16,904	▽	14
హాంగ్‌సెంగ్	2,702	▽	28
నికాయ్	36,354	△	196

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,512
బంగారం (99.5 స్వచ్ఛత)	62,262
వెండి (కేజీ)	70,417

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.64	83.66
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.55	106.10
€	యూరో	ఒకటి	88.45	90.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.13	55.05
¥	జపాన్ ఎన్ (100)	ఛాయనకతకి	43.00	69.00
S$	సింగపూర్ డాలర్	ఛాయనకతకి	59.39	64.10
SAR	సౌదీ రియాల్	ఛాయనకతకి	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయనకతకి	21.72	23.51
¥	చైనా యువాన్	ఛాయనకతకి	10.42	12.49

జోస్ ఆలుక్కాస్ 'వాలెంటైన్స్ డే' యాడ్ ఫిల్మ్



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల సంస్థ– జోస్ ఆలుక్కాస్ ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక యాడ్ ఫిల్మ్‌ను విడుదల చేసింది. దాదాపు 20 సెకన్ల నిడివితో రూపొందించిన ఈ యాడ్... ఒక యువకుడు ప్రేయసికి ఉంగరం బహూకరణతో తన ప్రేమ వ్యక్తీకరణ నేపథ్యంతో సాగుతుంది. వాలెంటైన్స్ కలెక్షన్ రూ.6,500 నుంచి ప్రారంభమవుతుందని ఈ మేరకు విడుదల చేసిన ఒక ప్రకటనలో సంస్థ తెలిపింది. వజ్రాభరణాలపై 25% వరకూ, ప్లాటినంపై 7 శాతం తగ్గింపుసహా ఈ సందర్భంగా పలు ఆఫర్లు అందుబాటులో ఉన్నట్లు ప్రకటన వివరించింది.

ఈఈఎస్ఎల్‌మార్ట్‌లో విద్యుత్ ఆదా చేసే ఉత్పత్తులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగంలో ఉన్న ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) తాజాగా ఈ–కామర్స్ విక్రయాలను ప్రారంభించింది. ఈఈఎస్ఎల్‌మార్ట్.ఇన్ పేరుతో బీటా వర్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ వేదికగా విద్యుత్ ఆదా చేసే ఉత్పత్తులను ఈఈఎస్ఎల్ విక్రయిస్తుంది. ప్రస్తుతానికి 3 స్టార్ ఎల్ఈడీ బల్బులు, ఇన్వర్టర్ ఎల్ఈడీ ల్యాంప్స్, బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్స్ అమ్మకాలను మొదలుపెట్టింది. రాబోయే రోజుల్లో 5 స్టార్ ఎల్ఈడీ బల్బులు, ల్యాంప్స్, అత్యంత సమర్థవంతమైన ఏసీలు, మోటార్లు, ఈ–సైకిళ్లు, ఇండక్షన్ కుక్ స్టవ్‌లను పరిచయం చేస్తారు. ఎల్ఈడీ బల్బు ధర రూ.89 ఉంది. నాలుగు గంటల బ్యాటరీ బ్యాకప్ అందించే 10 వాట్ల ఎల్ఈడీ ఎమర్జెన్సీ ఎల్ఈడీ బల్బ్ ధర రూ.459. బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్ ఖరీదు రూ.3,199 ఉంది.

హ్యుందాయ్.. ఐపీవో బాట

- కనీసం రూ. 27,500 కోట్ల సమీకరణ
- 15–20 శాతం మధ్య వాటా విక్రయం!



న్యూఢిల్లీ: ఆటో రంగ దక్షిణ కొరియా దిగ్గజం హ్యుందాయ్ మోటార్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. దేశీ అనుబంధ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్(హెచ్ఎంఐఎల్)ను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయడం ద్వారా కనీసం 3.3 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 27,500 కోట్లు) సమీకరించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. దేశీయంగా కార్ల తయారీకి అతిపెద్ద కంపెనీలలో మారుతీ సుజుకీ ఇండియా తదుపరి రెండో ర్యాంకులో నిలుస్తున్న హెచ్ఎంఐఎల్.. ఐపీవో ద్వారా 15–20 శాతం వాటాను విక్రయించే వీలున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వెరసి 3.3–5.6 బిలియన్ డాలర్లు సమీకరించవచ్చని అంచనా వేశాయి. అంచనాలకు అనుగుణంగా హెచ్ఎంఐఎల్ పబ్లిక్ ఇష్యూకి వస్తే బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసీ రికార్డును అధిగమించే వీలుంది. రూ. 21,000 కోట్ల సమీకరణ చేపట్టిన ఎల్ఐసీ ఇష్యూ.. అతిపెద్ద ఐపీవోగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ అంశాలపై కంపెనీ ప్రతినిధులు స్పందించకపోవడం గమనార్హం! దేశీయంగా 1996లో హెచ్ఎంఐఎల్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం విభిన్న విభాగాలలో 13 రకాల మోడళ్ల కార్లను విక్రయిస్తోంది. దేశవ్యాప్తంగా 1,366 అమ్మకాల ఔట్‌లెట్లు, 1,549 సర్వీసు పాయింట్లను కలిగి ఉంది.

జనవరిలో సేవలు భేష్

న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం జనవరిలో మంచి పనితీరును ప్రదర్శించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 61.8కి ఎగసింది. గడచిన ఆరు నెలల్లో సూచీ ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, కొత్త వ్యాపారాలు వేగంగా విస్తరించడం దీనికి కారణమని ఈ మేరకు జరిగిన సర్వే వివరించింది. డిసెంబర్‌లో ఈ సూచీ 59 వద్ద ఉంది. కాగా, ఈ సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ దిగువకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. వ్యాపార విశ్వాసం కూడా మరింత పటిష్టమైనట్లు సర్వే పేర్కొంది. మరోవైపు సేవలు–తయారీ కలగలిపిన హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ డిసెంబర్‌లో 58.5 వద్ద ఉంటే, జనవరిలో 61.2కు ఎగసింది.



ఆఖర్లో అమ్మకాల బెల్



- సెన్సెక్స్ 354 పాయింట్లు డౌన్
- 82 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ
- 71,731– 21,772 వద్ద ముగింపు
- టాటా మోటార్స్, ఎల్ఐసీ జోరు

ముంబై: చివరి గంటలో ఒక్కసారిగా ఊపందుకున్న అమ్మకాలు దేశీ స్టాక్ మార్కెట్లను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 354 పాయింట్లు పతనమై 71,731 వద్ద ముగిసింది. నిఫ్టీ 82 పాయింట్లు కోల్పోయి 21,772 వద్ద నిలిచింది. అయితే తొలుత హుషారుగా ప్రారంభమైన మార్కెట్లు పరిమిత శ్రేణిలో స్వల్ప లాభాల మధ్య కదిలాయి. చివర్లో ఇన్వెస్టర్లు అమ్మకాలు చేపట్టడంతో కుదేలయ్యాయి. వెరసి ఒక దశలో 72,386 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్ చివర్లో 71,602 వరకూ నీరసించింది. నిఫ్టీ సైతం 21,964– 21,727 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులను చవిచూసింది. ఆసియా, యూరప్ మార్కెట్ల బలహీనతలు సెంటిమెంటును దెబ్బతీసినట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. బ్లూచిప్స్ రిలయన్స్, ఎయిర్‌టెల్, మారుతీ సైతం ఇండెక్సులను బలహీనపరచినట్లు పేర్కొన్నారు.

కారణాలివీ...

జనవరి నెలకు యూఎస్ ఉద్యోగ గణాంకాలు బలపడటంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపునకు మొగ్గు చూపకపోవచ్చన్న అంచనాలు పెరిగినట్లు నిపుణులు తెలియజేశారు. ఇటీవల యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ 4 శాతం ఎగువకు చేరడం, దేశీయంగా తాత్కాలిక బడ్జెట్‌కు ముందు మార్కెట్ల ర్యాలీ వంటి అంశాలు ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణకు ఉసిగొల్పినట్లు విశ్లేషించారు.

దిగ్గజాల తీరిలా

నిఫ్టీ దిగ్గజాలలో టాటా మోటార్స్ 6 శాతం ఎగసింది. కోల్ ఇండియా, బీపీసీఎల్, సన్ ఫార్మా, సిప్లా, ఓఎన్‌జీసీ, ఎంఅండ్ఎం, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్ 5–2% మధ్య జంప్‌చేశాయి. అయితే యూపీఎల్ 11 శాతం పతనంకాగా.. బజాజ్ ఫైనాన్స్, ఫిన్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, గ్రాసిమ్, మారుతీ, అల్ట్రాటెక్, హెచ్‌సీఎల్ టెక్, టైటన్, అపోలో హాస్పిటల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌యూఎల్, ఆర్ఐఎల్ 3.2–1.2 శాతం మధ్య క్షీణించాయి. క్యూ3 ఫలితాల నిరాశతో యూపీఎల్ 11 శాతం పతనమైంది.

షేర్ల స్పీడ్...

టాటా మోటార్స్: క్యూ3 (అక్టోబర్–డిసెంబర్)లో నికర లాభం రెట్టింపై రూ. 7,100 కోట్లను తాకడంతో 6 శాతం జంప్‌చేసి రూ. 950 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 8 శాతం దూసుకెళ్లి రూ. 950 వద్ద చరిత్రాత్మక గరిష్టాన్ని అందుకుంది! కంపెనీ మార్కెట్ విలువ రూ. 15,950 కోట్లు బలపడి రూ. 3.07 లక్షల కోట్లను దాటింది.

ఎల్ఐసీ: లిస్టయిన తదుపరి తొలిసారి రూ. 1,000 మార్క్‌ను అందుకుంది. 6 శాతం లాభపడింది. తద్వారా రూ. 6 లక్షల కోట్ల మార్కెట్ విలువను అధిగమించింది. ఒక్క రోజులో రూ. 35,230 కోట్లను జమ చేసుకుంది. విలువరీత్యా గత నెలలో ఎస్‌బీఐను దాటేసింది.

ఎయిర్‌టెల్ లాభాల ట్యూన్

- క్యూ3లో రూ. 2,442 కోట్లు
- నెలకు కనీస రీచార్జ్ రూ. 155



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 54 శాతం జంప్‌చేసి రూ. 2,442 కోట్లను అధిగమించింది. అధిక విలువ చేకూరే కస్టమర్ల సంఖ్య పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,588 కోట్లు ఆర్జించింది. ఆఫ్రికన్ కరెన్సీ విలువ క్షీణించినప్పటికీ మొత్తం ఆదాయం 6 శాతం బలపడి రూ. 37,900 కోట్లకు ఎగసింది. దీనిలో దేశీ ఆదాయం 11 శాతం వృద్ధితో రూ. 27,811 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. 35,804 కోట్ల టర్నోవర్ నమోదైంది. దేశీ బిజినెస్ పురోగతిలోనే కొనసాగుతున్నదని, త్రైమాసికవారీగా 3 శాతం మెరుగుపడిందని కంపెనీ ఎండీ గోపాల్ విఠల్ తెలియజేశారు.

జనవరి నుంచి అప్

2023 జనవరి నుంచి ప్రీపెయిడ్ మొబైల్ వినియోగదారులు నెల రోజులపాటు సర్వీసులు అందుకునేందుకు కనీసం రూ. 155 చెల్లించేలా ఎయిర్‌టెల్ టారిఫ్‌ను సవరించింది. ఇది 56 శాతం అధికమైనప్పటికీ ఆర్‌వోసీఈ 9.4 శాతానికి పరిమితంకావడంతో మొబైల్ సర్వీసుల రేట్లను మరింత పెంచవలసి ఉన్నట్లు గోపాల్ పేర్కొన్నారు. పరిశ్రమ నిలదొక్కుకునేందుకు టారిఫ్ పెంపు అత్యావశ్యకమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సమీక్షా కాలంలో మొత్తం కస్టమర్ బేస్ 8 శాతం పెరిగి 55.1 కోట్లను తాకింది. దీనిలో దేశీయంగా 7.5 శాతం వృద్ధితో 39.7 కోట్లకు చేరింది. ఆఫ్రికాలో 9 శాతం అధికంగా 15.17 కోట్లకు చేరింది.

ఏఆర్‌పీయూ ప్లస్

ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 7.7 శాతం మెరుగుపడి రూ. 208గా నమోదైంది. ప్రీమియమైజేషన్‌లో భాగంగా 7.4 మిలియన్ల 4జీ, 5జీ కస్టమర్లను జత చేసుకున్నట్లు ఎయిర్‌టెల్ వెల్లడించింది. వీరి సంఖ్య 24.49 కోట్లను తాకింది. ఈ కాలంలో దేశీయంగా రూ. 7,756 కోట్లుసహా మొత్తం పెట్టుబడి వ్యయాలు రూ. 9,274 కోట్లకు చేరాయి. నెట్‌వర్క్ కవరేజీ పటిష్టతకు మరో 12,300 టవర్లకు తెరతీసినట్లు కంపెనీ వెల్లడించింది. నెలకు డేటా వినియోగం 8.2 శాతం వృద్ధితో 22 జీబీకి చేరింది. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసుల కస్టమర్ బేస్ 29 శాతం ఎగసి 73 లక్షలను తాకింది. ఏఆర్‌పీయూ 6.5 శాతం క్షీణించి రూ. 583కు పరిమితమైంది. నికర రుణ భారం రూ. 2.09 లక్షల కోట్ల నుంచి రూ. 2.02 లక్షల కోట్లకు తగ్గింది. మొత్తం ఉద్యోగుల సంఖ్య 4.1 శాతం బలపడి 17,924కు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు బీఎస్‌ఈలో 3.2 శాతం క్షీణించి రూ. 1,114 వద్ద ముగిసింది.

బీఎస్‌ఈ లాభం రెట్టింపు

క్యూ3లో రూ. 108 కోట్లు



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం బీఎస్‌ఈ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 108 కోట్లను అధిగమించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 52 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 76 శాతం జంప్‌చేసి రూ. 431 కోట్లను దాటింది. వెరసి ఒక త్రైమాసికంలో ఎక్స్ఛేంజీ చరిత్రలోనే అత్యధిక టర్నోవర్ సాధించింది. గత క్యూ3లో రూ. 245 కోట్ల ఆదాయం నమోదైంది. మ్యూచువల్ ఫండ్ పంపిణీ ప్లాట్‌ఫామ్.. బీఎస్‌ఈ స్టార్ ఎంఎఫ్ ద్వారా లావాదేవీలు 60 శాతం ఎగశాయి.

ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈ షేరు 4.2% ఎగసి రూ. 2,570 వద్ద ముగిసింది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆంధ్రప్రదేశ్‌లో 234 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు

జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలోని వివిధ ఆరోగ్య వ్యవస్థలలో ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు దరఖాస్తులు కోరుతోంది. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్, తదితర ఆసుపత్రుల్లో పోస్టులు భర్తీ కానున్నాయి.

» మొత్తం పోస్టుల సంఖ్య: 234
» విభాగాల వారీగా ఖాళీలు: జనరల్ మెడిసిన్–38, ఆబ్‌స్టేట్రిక్స్ అండ్ గైనకాలజీ–37, పీడియాట్రిషియన్–114, కార్డియాలజిస్ట్/జనరల్ మెడిసిన్–29, ఎపిడెమియాలజిస్ట్–15.
» అర్హత: అభ్యర్థులు ఎంబీబీఎస్‌తో పాటు సంబంధిత స్పెషాలిటీలో ఎంపీహెచ్, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.1,10,000 నుంచి రూ. 1,40,000, ఎపిడెమియాలజిస్ట్ పోస్టులకు రూ.60,000.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్‌ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 07.02.2024.
» వెబ్‌సైట్: apmsrb.ap.gov.in

టీఎస్ఆర్‌జేసీ సెట్-2024

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్(ఆంగ్ల మాధ్యమం)మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ ఆర్జేసీ సెట్)–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా బాలురకు 15, బాలికలకు 25 గురుకుల జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

» మొత్తం సీట్ల సంఖ్య: 2,996.
» గ్రూపుల వారీగా సీట్లు: ఎంపీసీ–1496, బైపీసీ–1440, ఎంఈసీ–60.
» అర్హత: 2024 మార్చిలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.
» పరీక్ష విధానం: పరీక్ష మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. విద్యార్థులు ఎంపిక చేసుకునే గ్రూప్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఎంపీసీ పరీక్షకు ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్,బైపీసీకి ఇంగ్లిష్, బయాలజీ ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 31.01.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.03.2024
» ప్రవేశ పరీక్షతేది: 21.04.2024.
» మొదటి దశ కౌన్సిలింగ్ తేది: మే 2024.
» వెబ్‌సైట్: https://tsrjdc.cgg.gov.in


దక్షిణ రైల్వేలో 2860 అప్రెంటిస్‌లు

దక్షిణ రైల్వే వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 2860.
» వర్క్‌షాప్‌లు/యూనిట్‌లు: సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్(పాదనూర్, కోయంబత్తూర్), క్యారేజ్ అండ్ వేగన్(పెరంబూర్), రైల్వే హాస్పిటల్(పొరంబూర్), తిరువనంతపురం డివిజన్, పాలక్కడ్ డివిజన్,సాలెమ్ డివిజన్, లోకో(పెరంబూర్), ఎలక్ట్రికల్(పెరంబూర్), ఇంజనీరింగ్(అరక్కోనం), చెన్నై డివిజన్, మెకానికల్(డీజిల్), క్యారేజ్ అండ్ వేగన్ ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్ (అరక్కోనం, అవది, తంబరం, రాయపురం), సెంట్రల్ (పొన్మలై), తిరుచిరాపల్లి డివిజన్, మధురై డివిజన్.
» ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), ఎంఎల్‌టీ, టర్నర్, సీఓపీఏ, ప్లంబర్, పీఏఎస్ఏఏ, ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, డీజిల్ మెకానిక్, అడ్వాన్స్‌డ్ వెల్డర్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.
» అర్హత: కనీసం 50శాతం మార్కులతో పదో తరగతి, ఇంటర్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» ట్రైనింగ్ పీరియడ్: ఫిట్టర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్), మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్స్ ట్రేడులకు 15 నెలల నుంచి రెండేళ్లు, ఇతర ట్రేడులకు ఒక సంవత్సరం.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.02.2024.
» వెబ్‌సైట్: https://sr.indianrailways.gov.in

» అంతరిక్ష విభాగంలో అద్భుత కెరీర్స్
» ఆస్ట్రోనాట్‌నుంచి స్పేస్ సైంటిస్ట్ వరకు ఉద్యోగాలు
» అకడమిక్ నైపుణ్యాలతో సొంతం చేసుకోవచ్చు
» ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో సంబంధిత కోర్సులు

ఆస్ట్రానమీ.. అవకాశాలు మెనీ!



కెరీర్ గైడెన్స్

చంద్రయాన్.. ఆదిత్య ఎల్-1 మిషన్.. శాటిలైట్ ప్రయోగాల సక్సెస్. దీంతో అంతరిక్ష శాస్త్రం, సంబంధిత ప్రయోగాలు, పరిశోధనలపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. అంతరిక్ష రంగంలో కెరీర్స్, కోర్సుల గురించి యువత అన్వేషిస్తోంది! సంబంధిత కోర్సులను అభ్యసించి.. తాము కూడా అంతరిక్ష పరిశోధనల్లో పాల్పంచుకోవాలని కోరుకుంటున్నారు. ఇలాంటి వారికిఉపయోగపడేలా.. అంతరిక్ష విభాగంలో అందుబాటులో ఉన్న కోర్సులు, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం...

నిప్పులు కక్కుతూ.. నింగికి ఎగసే శాటిలైట్ ప్రయోగాలను వీక్షిస్తుంటే.. అదొక అద్భుత అనుభూతి. కాని మన కంటికి కనిపించే ఈ అంతరిక్ష ప్రయోగాల వెనుక ఎంతో మంది పట్టుదల, అకుంఠిత దీక్ష, కృషి దాగి ఉంటుంది. సదరు ప్రయోగం లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగి విజయవంతమయ్యేలా సైంటిస్టులు నిరంతరం పరిశోధనలు చేస్తుంటారు. శాటిలైట్స్ రూపకల్పన, పర్యవేక్షణ నైపుణ్యాలు పొందాలంటే.. అకడెమిక్‌గా సంబంధిత కోర్సులు పూర్తి చేయడం తోపాటు శిక్షణ సైతం అవసరం ఉంటుంది. ప్రస్తుతం దేశంలో పేరున్న పలు ఇన్‌స్టిట్యూట్‌లు స్పేస్ కోర్సులను అందిస్తున్నాయి.

ఇంటర్‌తోనే అంతరిక్ష కోర్సు

విద్యార్థులు ఇంటర్మీడియెట్ అర్హతతోనే అంతరిక్ష కోర్సుల్లో చేరే వీలుంది. వీటిల్లో బీటెక్‌లో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ను ప్రధానంగా పేర్కొనొచ్చు. ఈ కోర్సు ద్వారా విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు వంటి వాటిపై అవగాహన లభిస్తుంది. ఐఐటీ ఖరగ్‌పూర్, బాంబే, మద్రాస్, కాన్పూర్ తదితర టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ కోర్సు అందుబాటులో ఉంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం లభిస్తుంది.

ఐఐఎస్‌టీలో ఆస్ట్రానమీ కోర్సులు

- స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో నిపుణులైన మానవ వనరుల ఆవశ్యకతను గుర్తించిన ఇస్రో.. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ) పేరుతో తిరువనంతపురంలో ప్రత్యేక ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో బీటెక్ స్థాయిలో.. ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (ఏవియానిక్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా ఈ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.
- అదే విధంగా ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, ఎర్త్ సిస్టమ్ సైన్స్, ఆప్టికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో.. అయిదేళ్ల బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సును అందిస్తోంది. వీటికి కూడా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకు ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
- పీజీ స్థాయిలో ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఎర్త్ సైన్స్ సిస్టమ్స్ వంటి కోర్ బ్రాంచ్‌లు సహా మొత్తం పదిహేను స్పెషలైజేషన్స్‌తో ఎంటెక్ కోర్సులను ఐఐఎస్‌టీ అందిస్తోంది. గేట్ స్కోర్ ఆధారంగా వీటిలో అడుగు పెట్టొచ్చు.
- పీహెచ్‌డీ స్థాయిలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, హ్యూమానిటీస్ విభాగాల్లో పీహెచ్‌డీ అవకాశాలున్నాయి. వీటిలో పూర్తిగా అభ్యర్థులు పీజీలో చూపిన ప్రతిభ, రీసెర్చ్‌పై ఆసక్తిని పరిగణనలోకి తీసుకుని ప్రవేశాలు కల్పిస్తారు.

అన్ని బ్రాంచ్‌లకు అవకాశం

స్పేస్ సైన్స్ టెక్నాలజీ విభాగంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులే కాకుండా.. బీటెక్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల అభ్యర్థులు కూడా కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. స్పేస్ క్రాఫ్ట్ లేదా శాటిలైట్‌ను రూపొందించే క్రమంలో ఎలక్ట్రికల్, మెకానికల్ , కంప్యూటర్ సైన్స్ అభ్యర్థుల అవసరం ఏర్పడుతుంది. అప్లైడ్ సైన్సెస్‌లో నైపుణ్యంతోనూ అంతరిక్ష కెరీర్స్ సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఫిజిక్స్‌లో రీసెర్చ్ స్థాయి అభ్యర్థులకు ఉన్నత అవకాశాలు లభిస్తున్నాయి.

పీహెచ్‌డీతో సైంటిస్ట్

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఇతర ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు, రోబోటిక్స్, సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అర్హతతో అంతరిక్ష రంగంలో సైంటిస్ట్‌గా కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తోంది. బార్క్, డీఆర్‌డీఓ రీసెర్చ్ లేబొరేటరీల్లో పీహెచ్‌డీ చేసే వీలుంది. ప్రస్తుతం ఐఐఎస్‌సీ–బెంగళూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ టెక్నాలజీ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్, ఐఐటీ–ఢిల్లీ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆస్ట్రోఫిజిక్స్,ఏవియానిక్స్, కాస్మాలజీ, ఆస్ట్రానమీ విభాగాల్లో పరిశోధనలకు అవకాశం లభిస్తోంది. వీటిలో ప్రవేశానికి సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ లేదా జెస్ట్(జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్) స్కోర్‌లను ప్రామాణికంగా తీసుకుని.. పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తున్నారు.

వేతనాలు

బీటెక్ నుంచి పీహెచ్‌డీ వరకు స్పేస్ సైన్స్ టెక్నాలజీ సంబంధిత కోర్సులు పూర్తి చేసుకున్న వారికి విస్తృత కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. ఇస్రో, డీఆర్‌డీఓ, హెచ్ఏఎల్ తదితర సంస్థల్లో చేరిన వారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తాయి. అంతరిక్ష రంగంలో ఉన్నత కొలువులు పొందిన అభ్యర్థులు నెలకు రూ. రెండు లక్షల వరకూ వేతనం అందుకునే వీలుంది. అనుభవంతో సైంటిస్ట్ హోదాలో నెలకు రూ.అయిదు లక్షల వరకు వేతనం పొందొచ్చు.

స్పేస్ కెరీర్స్ ఇవిగో

ఆస్ట్రోనాట్

స్పేస్ టెక్నాలజీ లేదా స్పేస్ సైన్స్ అనగానే గుర్తొచ్చే జాబ్ ప్రొఫైల్ ఆస్ట్రోనాట్(వ్యోమగామి) అనడంలో సందేహం లేదు. ఆస్ట్రోనాట్‌గా అవకాశం పొందాలంటే.. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో మ్యాథ్స్, ఫిజిక్స్ నైపుణ్యాలు తప్పనిసరి. దీంతోపాటు శారీరకంగానూ ద్రుఢత్వం అవసరం. ఆస్ట్రోనాట్‌గా ఎంపికైన వారికి కఠోర శిక్షణనందిస్తారు. రోదసీలోని వాతావరణ పరిస్థితుల్లో ఇమడగలిగేలా శిక్షణను ఇస్తారు.

స్పేస్ ఇంజనీర్స్

అంతరిక్ష రంగంలో మరో ముఖ్యమైన కొలువు.. స్పేస్ ఇంజనీర్. స్పేస్–క్రాఫ్ట్స్, స్పేస్ వెహికిల్స్, స్పేస్ స్టేషన్స్‌ను డిజైన్ చేయడమే కాకుండా.. వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ నిరంతరం స్పేస్ క్రాఫ్ట్స్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. స్పేస్ ఇంజనీర్స్‌గా స్థిర పడాలంటే.. ఏరోస్పేస్/ఏరో నాటికల్ ఇంజనీరింగ్, ఏవియానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, స్పేస్ క్రాఫ్ట్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఎంటెక్ లేదా పీహెచ్‌డీ పూర్తి చేసుకోవాలి.

స్పేస్ సైంటిస్ట్

అంతరిక్ష శాస్త్రంలో మరో కీలక హోదాగా స్పేస్ సైంటిస్ట్‌ను పేర్కొనొచ్చు. స్పేస్ సైన్స్‌కు సంబంధించి పలు విభాగాల్లో పరిశోధనలు చేసి.. ఆయా విభాగాల్లో స్పేస్ క్రాఫ్ట్స్ రూపకల్పనకు, వాటికి ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. వీరికి ఇస్రో, షార్ వంటి సంస్థల ఆధ్వర్యంలోని లేబొరేటరీల్లో కొలువులు లభిస్తాయి.

టెక్నాలజిస్ట్స్

స్పేస్ ఇంజనీర్స్‌కు, స్పేస్ సైంటిస్ట్స్‌కు సహాయకారులుగా టెక్నాలజిస్టులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరికి కమ్యూనికేషన్ టెక్నీషియన్స్, క్యాడ్ ఆపరేటర్స్, డ్రాఫ్టర్స్,ఎలక్ట్రీషియన్స్, లేజర్ టెక్నీషియన్స్, క్వాలిటీ అష్యూరెన్స్ స్పెషలిస్ట్స్, రాడార్ టెక్నీషియన్స్, రోబోటిక్ టెక్నీషియన్స్, శాటిలైట్ టెక్నీషియన్స్ వంటి కొలువులు లభిస్తాయి.

మెటీరియాలజిస్ట్

అంతరిక్ష ప్రయోగ శాలలు, పరిశోధన సంస్థల్లో లభించే మరో ముఖ్య కొలువు ..మెటీరియాలజిస్ట్. వీరు భూ వాతావరణాన్ని పరిశీలించి, భవిష్యత్తు వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం, దానికి సంబంధించిన నివేదికలను రూపొందించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

క్లైమేటాలజిస్ట్

అంతరిక్ష రంగంలో మరో ముఖ్యమైన జాబ్.. క్లైమేటాలజిస్ట్. వీరు కూడా నిర్దిష్ట ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం, అప్పటికే దానికి సంబంధించిన ప్రయోగాల నివేదికలను విశ్లేషించి క్రోడీకరించడం తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

స్పేస్ క్రాఫ్ట్ డిజైనర్స్

స్పేస్ టెక్నాలజీ/స్పేస్ సైన్స్ విభాగంలో మరో అత్యంత కీలకమైన హోదా.. స్పేస్ క్రాఫ్ట్ డిజైనర్స్. శాస్త్రవేత్తల పరిశోధనలకు, ప్రయోగించనున్న ఉపగ్రహాల లక్ష్యాలకు అనుగుణంగా పేలోడ్ సామర్థ్యాన్ని, ప్రయోగించనున్న ఉపగ్రహాల సంఖ్యకు అనుగుణంగా స్పేస్ క్రాఫ్ట్‌ను డిజైన్ చేయడం వీరి ప్రధాన విధిగా ఉంటుంది.



మెక్సికోలో ప్రకృతి విధ్వంసానికి పరాకాష్టగా నిలిచే చిత్రమిది. రక్షిత వర్షారణ్యం మీదుగా సుమారు రూ. 8 వేల కోట్లతో పర్యాటక రైల్వే లైన్ వేసేందుకు మెక్సికో ప్రభుత్వం ఇలా వేలాది వృక్షాలను నేలమట్టం చేసిన వైనాన్ని కళ్లకుకడుతూ ఫెర్నాండో కాన్‌స్టాంటినో మార్టినెజ్ బెల్మార్ అనే పర్యావరణ ఫొటోగ్రాఫర్ దీన్ని తీశారు. ద టూరిజం బుల్డోజర్ పేరుతో తీసిన ఈ ఫొటో 2023 వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీలో విజయం సాధించిన ఫొటోల్లో ఒకటిగా నిలిచింది. ఈ పోటీలో విజేతల ఫొటోలను లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం ప్రదర్శిస్తోంది.

శిలాశాసనాలు దేశ చారిత్రక సంపద

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



శిలాశాసనాలను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బహదూర్‌పురా(హైదరాబాద్): శిలాశాసనాలు దేశ చారిత్రక సంపద అని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సాలార్ జంగ్ మ్యూజియంలోని వెస్ట్రన్ బ్లాక్‌లోని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నేషనల్ మ్యూజియం ఆఫ్ ఎపీగ్రఫీకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... శిలాశాసనాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జ్ఞానవాపి మసీదులో శివలింగం ఉందని ఈ శిలాశాసనాల ద్వారానే కోర్టు తీర్పు చెప్పిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.ఎస్.రామచంద్రమూర్తి, డాక్టర్ టీఎస్ రవి శంకర్, ఏడీఎల్ జనరల్ డైరెక్టర్ గుర్మీత్ సింగ్ చావ్లా, మ్యూజియం క్యూరేటర్ ఘనశ్యామ్ కుసుమ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ, జిల్లా అధ్యక్షులు వి.పాండు యాదవ్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

చెట్టుపై పవిత్ర గంగా జలాన్ని భద్రపరుస్తున్న మెస్రం వంశీయులు



కేస్లాపూర్ చేరిన మెస్రం వంశీయులు

మర్రిచెట్టు వద్ద బస

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా జాతరలో భాగంగా పవిత్ర గంగాజలం సేకరణ కోసం జనవరి 21న కేస్లాపూర్ నుంచి పాదయాత్ర ప్రారంభించిన మెస్రం వంశీయులు సోమవారం తిరిగివచ్చారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం హస్తిన మడుగుకు జనవరి 28న చేరుకుని అక్కడ గోదావరిలో గంగాజలం సేకరించారు. సోమవారం ఉదయం ఇంద్రాదేవి ఆలయానికి చేరుకున్నారు. పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సంప్రదాయ వాయిద్యాల నడుమ రాత్రి కేస్లాపూర్ పొలిమేరలో గల మర్రిచెట్టు(వడమర) వద్దకు చేరుకున్నారు. పవిత్ర గంగాజలాన్ని ఓ చెట్టుపై భద్రపరిచి మర్రిచెట్టు వద్ద బస చేశారు. మూడు రోజులపాటు అక్కడే సంప్రదాయ(తూమ్) పూజలు చేపట్టనున్నారు.


ఎస్ఎంఎస్ పేలింక్‌తో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల జారీ



తిరుమల: భక్తులు వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లను ఎస్ఎంఎస్ పేలింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి పొందేలా టీటీడీ ప్రయోగాత్మకంగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు గత రెండు రోజులుగా టీటీడీ జేఈవో కార్యాలయంలో వీఐపీ టికెట్లను నమోదు చేసుకుని రశీదు పొందిన భక్తులకు టికెట్లు జారీ కాగానే నేరుగా వారి మొబైల్‌కు ఎస్ఎంఎస్ లింక్ పంపుతున్నారు. సదరు లింక్‌పై భక్తుడు క్లిక్ చేసి పేమెంట్ గేట్‌వే ద్వారా నగదును చెల్లించి బ్రేక్ దర్శన టికెట్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఒకవేళ పేమెంట్ కట్టే టికెట్ లింకు రాకుండా ఉంటే ఎంబీసీ 34 వద్దకు వెళ్లి నగదు చెల్లించినట్లు చూపించి టికెట్ తీసుకోవచ్చు. సదరు టికెట్‌ను ప్రింట్ తీసుకుని దర్శనానికి వెళ్లవచ్చు.

అవినీతి ఎక్కడ ఎలా ఉందంటే...

* 2023లో వివిధ దేశాల్లో ప్రభుత్వ రంగంలో అవినీతి సూచీ ఇలా..



మూలం: ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్

* దేశాల నిపుణులు, వ్యాపారవేత్తల అభిప్రాయం ప్రకారం..

ప్రపంచ దేశాల్లో అవినీతికి అటూఇటు..

అవినీతిపై పోరాడే ప్రపంచ పౌర సమాజ సంస్థ ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ 2023లో 180 దేశాల్లో ప్రభుత్వ రంగంలో అవినీతి ఎలా ఉందో తెలుసుకొనేందుకు ఓ సర్వే చేపట్టింది. అవినీతి తీవ్రతను సున్నా (అత్యంత అవినీతి) నుంచి 100 (స్వచ్ఛమైన) మార్కుల సూచీపై కొలిచింది. ఈ అధ్యయనం ప్రకారం ప్రపంచంలోని మూడొంతులకుపైగా దేశాలు 50కన్నా తక్కువ స్కోర్‌కే పరిమితమయ్యాయి. ప్రపంచ దేశాల సగటు స్కోర్ 43గా నమోదయింది. గత పదేళ్లతో పోలిస్తే చాలా దేశాలు అవినీతి తగ్గే విషయంలో ఏమాత్రం పురోగతి లేకపోవడమో లేదా మరింత క్షీణించడమో జరిగిందని అధ్యయనం తేల్చింది. ఈ మేరకు 2023 కరప్షన్ పర్సెప్షన్ ఇండెక్స్‌ను విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం అత్యంత తక్కువ అవినీతి దేశాలుగా డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, డెన్మార్క్, నార్వే, సింగపూర్, స్వీడన్ వరుసగా నిలిచాయి. అలాగే అత్యంత అవినీతిమయమైన దేశంగా సోమాలియా అపఖ్యాతిని మూటగట్టుకోగా సిరియా, వెనెజువెలా, దక్షిణ సూడాన్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ జాబితాలో అగ్రరాజ్యం అమెరికా 69 స్కోర్‌తో 24వ స్థానంలో నిలవగా 39 స్కోర్‌తో భారత్ 93వ స్థానంలో నిలిచింది.

– సాక్షి సెంట్రల్ డెస్క్

ప్రకృతి ఒడిలో నేచర్ క్యాంప్



'ఎకో టూరిజం'లో భాగంగా మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో శిబిరం

క్యాంప్‌ఫైర్, వినోద కార్యక్రమాలు, బర్డ్ వాక్ తదితరాలు నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: ప్రకృతి ఒడిలో గడిపేందుకు అవకాశం కల్పిస్తున్న 'నేచర్ క్యాంప్'లకు మంచి స్పందన లభిస్తోంది. ఎకో టూరిజం కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న హైకింగ్, నైట్ ట్రెక్కింగ్, క్యాంపింగ్, బర్డ్‌వాక్ తదితర అడ్వెంచర్ యాక్టివిటీస్‌కు ఆదరణ పెరుగుతోంది. తాజాగా తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ శివార్లలోని మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నేచర్ క్యాంప్ నిర్వహించింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మొదలై, సోమవారం ఉదయం 11 గంటలకు ముగిసేలా క్యాంప్‌లో భాగంగా వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నేచర్‌క్యాంప్‌నకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మొదట హైకింగ్ ఈ క్యాంప్ మొదలైంది. ఆ తర్వాత మర్రిచెట్టు రచ్చబండ దగ్గర టీం బిల్డింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆ తర్వాత చెక్‌డ్యాం పాండ్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంపింగ్ సైట్ కి చేరుకొని టెంట్ వేసుకోవడం చూపారు. రాత్రి భోజనం అనంతరం అందరికి రాత్రి దీపాలు ఇచ్చి రాత్రి ట్రెక్కింగ్ చేయించారు. అనంతరం క్యాంపు వద్ద క్యాంపు ఫైర్ ఏర్పాటు చేసి వినోద కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు బర్డ్ వాక్ ఏర్పాటు చేశారు. పక్షుల గుర్తింపునకు వాటి బొమ్మలు, పేర్లతో బ్రౌచర్లు వాటి వీక్షణకు బైనాక్యులర్స్ ఇచ్చారు. టీఎస్ఎఫ్‌డీసీ ఈడీ రంజిత్ నాయక్ మాట్లాడుతూ అటవీ అభివృద్ధి సంస్థ ఎకో టూరిజం వింగ్ పరంగా ఇలాంటి నేచర్ క్యాంపులు మరెన్నో ఏర్పాటు చేస్తామన్నారు. క్యాంప్‌నకు సరోజినీ నాయుడు వనితా మహావిద్యాలయ కళాశాలకు చెందిన విద్యార్థినులు హాజరయ్యారు. క్యాంపులలో పాల్గొనాలనుకొనేవారు 9493549399 లేదా 9346364583 నంబర్లలో సంప్రదించాలని రంజిత్ నాయక్ తెలిపారు. ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్స్ మేనేజర్ కళ్యాణపు సుమన్ పాల్గొన్నారు.

నేచర్ క్యాంప్ ప్యాకేజీ వివరాలు...

- కాలేజీ విద్యార్థుల గ్రూపులకు (రూ.1,500 చొప్పున).. కనీసం 10–15 మంది ఉండాలి. ఒక్కో బ్యాచ్‌లో 50 మంది దాకా ఉండొచ్చు.
- విడిగా వస్తే (ఒక్కొక్కరికి రూ.2,400 చొప్పున).. వీరు కూడా కనీసం 10 నుంచి 15 మంది బ్యాచ్‌గా (ఆ మేరకు రిజిస్ట్రేషన్లు ఉంటేనే) నేచర్ క్యాంప్‌నకు అవకాశం ఉంటుంది.
- 12 ఏళ్లలోపు పిల్లలకు రూ.1,400 చొప్పున చార్జ్ చేస్తారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితం.
- శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి శనివారం ఉదయం 11 వరకు ఒక బ్యాచ్, శనివారం మధ్యాహ్నం 3 నుంచి ఆదివారం ఉదయం 11 వరకు రెండో బ్యాచ్‌గా క్యాంపు నిర్వహిస్తారు.
- ప్యాకేజీలో భాగంగా సాయంత్రం స్నాక్స్, రాత్రి డిన్నర్, ఉదయం స్ప్రౌట్స్, రాగి మాల్ట్, మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్ ఉంటుంది.

విశ్వవ్యాప్తం.. హిందూ ధర్మం

ముగిసిన శ్రీవేంకటేశ్వర ధార్మిక సదస్సు



తిరుమల: హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని.. ఇందుకు విస్తృత ప్రచారం చేయాలని.. ఇతర మతస్తులు స్వచ్ఛందంగా వస్తే హిందూ మతంలోకి స్వాగతించాలని ధార్మిక సదస్సు తీర్మానించింది. తిరుమల ఆస్థాన మండపంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు సోమవారం ముగిసింది. ఈ సదస్సులో పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలతో చేసిన తీర్మానాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మీడియాకు తెలియజేశారు. శ్రీవారి దివ్య వైభవాన్ని, సనాతన ధర్మాన్ని ప్రపంచమంతటా ప్రచారం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానముల ఆవిర్భావం జరిగిందన్నారు. గతంలో తాను చైర్మన్‌గా ఉన్నప్పుడు నిర్వహించిన ధార్మిక సదస్సుల్లో స్వామీజీలు చేసిన సూచనల మేరకు దళిత గోవిందం, మత్స్య గోవిందం, అర్చకులకు శిక్షణ, కల్యాణమస్తు తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. మళ్లీ ఇప్పుడు నిర్వహించిన ధార్మిక సదస్సులో పీఠాధిపతులు, మఠాధిపతులు చేసిన సూచనలతో పలు తీర్మానాలు చేశామని చెప్పారు. ఇతర మతస్తులు ఎవరైనా హిందూ మతంలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తే.. వారి కోసం తిరుమలలో ఒక ప్రాంగణం ఏర్పాటు చేయాలని.. పవిత్రజల ప్రోక్షణం తదితరాలు నిర్వహించి వారిని స్వాగతించాలని సదస్సులో తీర్మానం చేశారు. శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరణతో పాటు దేవాలయాలు లేని చోట, హరిజన, గిరిజన, మత్స్యకార ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించడం అవసరమని తీర్మానం చేశారు. గోమాతల సంరక్షణ, వేదశాస్త్రాల పరిరక్షణ ఎంతో ముఖ్యమని.. అందరికీ అర్థమయ్యేలా ధర్మాన్ని ప్రచారం చేయాలని తీర్మానించారు. హిందూ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచటానికి తగిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని.. ద్రవిడ వేదానికి తగిన ప్రోత్సాహం అవసరమని.. వివిధ పాఠశాలల్లో అమలులో ఉన్న పాఠ్య ప్రణాళికల్లో హిందూ ధర్మానికి పెద్దపీట వేయాలని తీర్మానం చేశారు. తెలుగు, సంస్కృతంలో ఉన్న హిందూ ధర్మానికి సంబంధించిన అంశాలు అర్థం చేసుకునేందుకు పిల్లలకు, యువతకు ఆ రెండు భాషలు నేర్పించాలని.. ధర్మ ప్రచారం కోసం అన్ని ప్రచార, ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలని తీర్మానించారు. ఇలాంటి ధార్మిక సదస్సులు ఏడాదికొకసారి తిరుమల లేదా తిరుపతిలో నిర్వహించాలని.. గ్రామ, జిల్లా స్థాయిల్లో కూడా తరుచూ నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ తీర్మానాలను టీటీడీతో పాటు అన్ని ధార్మిక సంస్థలు అమలు చేయాలని తీర్మానించారు.

టీఎస్..'టీజీ'గా మారుతుందా!

పాత ఏపీ సిరీస్ కూడా మారేనా?

- రాష్ట్రంలో ఏపీ, టీఎస్ రిజిస్ట్రేషన్ వాహనాలు ఒక కోటి 60 లక్షలు
- 'టీజీ' అమలైతే వాటి మార్పుపైన గందరగోళం
- వాహనదారుల్లో అనేక సందేహాలు

సాక్షి, హైదరాబాద్: బండి నంబర్ ప్లేట్ 'సిరీస్' అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 'టీఎస్' నుంచి 'టీజీ'కి మార్చనున్నట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించిన నేపథ్యంలో వాహనాల సిరీస్ మరోసారి చర్చనీయాంశమైంది. కొత్తగా నమోదయ్యే వాహనాలకు మాత్రమే 'టీజీ' అమలు చేస్తారా.. లేక ఇప్పటి వరకు నమోదైన అన్ని వాహనాలనూ పాత 'టీఎస్' నుంచి 'టీజీ'కి మార్చుకోవలసి ఉంటుందా అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో 'ఏపీ' నుంచి 'టీఎస్'కు మారినప్పుడు వాహనదారులు ఇలానే గందరగోళానికి గురయ్యారు. మొదట్లో అన్ని వాహనాలను 'ఏపీ' నుంచి 'టీఎస్'కు మార్చుకోవలసిందేనంటూ అప్పట్లో రవాణాశాఖ ప్రతిపాదించింది. కానీ లక్షలాది వాహనాలను అప్పటికప్పుడు మార్చడం అసాధ్యమని భావించారు. అలాగే చట్టబద్ధంగా హైదరాబాద్ నగరం పదేళ్ల పాటు రెండు రాష్ట్రాలకు రాజధానిగా కొనసాగుతుందంటూ రాష్ట్ర విభజన చట్టంలో ఉండడంతో 'ఏపీ' మార్పును వాయిదా వేశారు. ప్రస్తుతం ఉమ్మడి రాజధానిగా పదేళ్ల కాలం కూడా పూర్తయింది. ఈ నేపథ్యంలో పాత 'ఏపీ' సిరీస్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అమల్లోకి వచ్చిన 'టీఎస్'ను కూడా 'టీజీ' సిరీస్‌లోకి మారుస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలో కోటీ 60 లక్షలకు పైగా వాహనాలు

రవాణాశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటి 60 లక్షలకు పైగా వాహనాలు నమోదై ఉన్నాయి. వీటిలో90 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు కాగా, మరో 40 లక్షల వరకు కార్లు, 30 లక్షల వరకు బస్సులు, లారీలు, ఆటోలు, డీసీఎంలు, స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు, భారీ వాహనాలు, తేలికపాటి వస్తు రవాణా రంగానికి చెందిన వివిధ రకాల వాహనాలు ఉన్నట్లు అంచనా. గ్రేటర్ హైదరాబాద్‌లోని 3 జిల్లాల పరిధిలోనే గత డిసెంబర్ వరకు 78.61లక్షల వాహనాలు నమోదయ్యాయి.

ఒడిశాలో మార్చేశారు...

కేంద్ర మోటారు వాహన చట్టం నిబంధనల మేరకు రాష్ట్రాలు ఎంపిక చేసుకున్న వాహనాల సిరీస్‌ను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు మొదట్లో 'టీజీ' సిరీస్ అమల్లోకి రావచ్చునని భావించారు. ఈ మేరకు కొంతమంది తమ వాహనాల నంబర్ ప్లేట్‌లను 'ఏపీ' నుంచి 'టీజీ'కి మార్చుకున్నారు. కానీ అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రవాణాశాఖ 'టీఎస్'ను ప్రతిపాదించింది. దీంతో కేంద్రం కూడా 'టీఎస్'నే ఆమోదించింది. ప్రస్తుతం ఒడిశాగా పేరు మారిన నాటి ఒరిస్సా రాష్ట్రంలో వాహనాలకు 'ఓఆర్' సిరీస్ ఉండేది. ఒడిశాగా మారిన తరువాత 'ఓడీ' సిరీస్‌ను అమల్లోకి తెచ్చారు. కొత్తగా నమోదయ్యే వాటితో పాటు పాత వాటిని కూడా 'ఓడీ' లోకి మార్పు చేశారు. ఒకవేళ తెలంగాణలో అదే పద్ధతిని అమలు చేసినట్లయితే కోటీ 60 లక్షల వాహనాలనూ మార్చవలసి ఉంటుంది. ఈ తతంగం తేనెతుట్టెను కదిపినట్లవుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మరి రాష్ట్రంలో ఏ పద్ధతిని అమలు చేస్తారనేది రవాణాశాఖ విధి విధానాలను రూపొందిస్తే గానీ స్పష్టత వచ్చే అవకాశం లేదు.

మద్దికుంటను సందర్శించిన వైద్యబృందం

- క్యాన్సర్ బాధితుల వివరాల సేకరణ
- త్వరలో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామన్న డీఎంహెచ్‌వో

సాక్షి ఎఫెక్ట్

రామారెడ్డి (ఎల్లారెడ్డి): జిల్లా వైద్యాధికారులు సోమవారం కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని మద్దికుంట గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. క్యాన్సర్ బాధితుల వివరాలు సేకరించారు. మద్దికుంట గ్రామంలో ఏటా క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతున్న అంశంపై 'పల్లె కడుపున రాచపుండు'శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. సోమవారం డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శిరీష, అన్నారం మెడికల్ ఆఫీసర్ మానస మద్దికుంట గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు.



కామారెడ్డి జిల్లా మద్దికుంట గ్రామంలో ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు క్యాన్సర్‌తో మరణించారని, మరో నలుగురు చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. గ్రామంలో త్వరలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి క్యాన్సర్ బాధితులకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. వారివెంట ఎంపీటీసీ రాజేందర్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నరేందర్, వైద్య శాఖ సిబ్బంది ఉన్నారు.

కటకటాల్లోకి పంజగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు

- మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి 'ఎస్కేప్' కేసులో అరెస్టు
- కేసులో నిందితుడిగా చేర్చడంతో అజ్ఞాతంలోకి వెళ్లిన వైనం
- హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్
- విచారణకు రాకముందే గుంతకల్లులో పట్టుకున్న పోలీసులు



దుర్గారావు

సాక్షి, హైదరాబాద్ : బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కుమారుడు రహీల్ ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రజాభవన్ ఎదురుగా చోటుచేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం' కేసులో మరో పోలీసు అధికారి అరెస్టు అయ్యారు. ఆ సమయంలో పంజగుట్ట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బి.దుర్గారావును పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో నిందితుడిగా మారిన నాటి నుంచి అజ్ఞాతంలో ఉన్న దుర్గారావు హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది శుక్రవారం విచారణకు రావాల్సి ఉండగా, సోమవారం దుర్గారావును ప్రత్యేక బృందం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో అదుపులోకి తీసుకొని హైదరాబాద్ తరలించింది. ఇటీవలే బోధన్ టౌన్ మాజీ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్‌ను ఇదే కేసులో అరెస్టు చేసిన విషయం విదితమే. ప్రజాభవన్ ఎదురుగా డిసెంబర్ 24 తెల్లవారుజామున రహీల్ నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. వెంటనే అక్కడకు చేరుకున్న అప్పటి పంజగుట్ట ఇన్‌స్పెక్టర్ దుర్గారావు రహీల్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దుబాయ్‌లో ఉన్న షకీల్‌కు రహీల్ ఈ ప్రమాదంపై సమాచారం ఇచ్చాడు. తన కుమారుడిని కేసు నుంచి తప్పించడానికి పథకం వేసిన షకీల్, తన అనుచరుడు వస్సే ద్వారా నిజామాబాద్ జిల్లాకే చెందిన ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్‌ను రంగంలోకి దింపాడు. తన బ్యాచ్‌మేట్ అయిన దుర్గారావును ఫోన్‌లో సంప్రదించి ఎస్కేప్ వ్యవహారంపై చర్చించాడు. రహీల్‌ను నేరుగా వదిలేస్తే ఇబ్బందులు వస్తాయని భావించిన ఈ ద్వయం పెద్ద కథే నడిపింది. ప్రమాదం జరిగింది ప్రజాభవన్ వద్ద కావడంతో ఉన్నతాధికారులు సీసీ కెమెరాల ఫీడ్ పరిశీలించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలోనే నేరుగా వదిలేయడం, కేసు నమోదు చేయకపోవడం చేస్తే ఇబ్బందులు వస్తాయని భావించారు. అలా చేయడానికి బదులుగా రహీల్ స్థానంలో మరొకరిని పెడదామని నిర్ణయించుకున్నారు. వస్సే ద్వారా ఈ విషయం తెలుసుకున్న షకీల్ తన డ్రైవర్ అబ్దుల్ ఆరిఫ్‌ను కుమారుడి స్థానంలో ఉంచాలని సూచించాడు. దీనికి ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు అంగీకరించడంతో అసలు కథ మొదలైంది. దీనిని అమలులో పెట్టడానికి రహీల్ స్నేహితులు రంగంలోకి దిగారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించడానికి పక్కనే ఉన్న పంజగుట్ట ట్రాఫిక్ ఠాణాకు తరలిస్తుండగా, రహీల్ తప్పించుకున్నాడని కథ నడిపారు. చివరకు అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చి కొందరు నిందితులు అరెస్టు కావడంతో పాటు దుర్గారావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ వ్యవహారాన్ని మరింత లోతుగా దర్యాప్తు చేసిన వెస్ట్‌జోన్ పోలీసులు ప్రేమ్‌కుమార్‌తో పాటు దుర్గారావు పాత్రపై ఆధారాలు సేకరించారు. గత ఆదివారం ప్రేమ్‌ను అరెస్టు చేసి కేసులో దుర్గారావును కూడా నిందితుడిగా చేర్చారు. దీంతో పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన దుర్గారావు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారు. ఇతడి కోసం ముమ్మరంగా గాలించిన వెస్ట్‌జోన్ పోలీసులు గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నారు. అరెస్టు తప్పించుకోవడానికి దుర్గారావు పొరుగు రాష్ట్రానికి పారిపోవడానికి ప్రయత్నించినట్టు అధికారులు తెలిపారు. ఈ ఎస్కేప్ వ్యవహారంలో భారీ మొత్తం చేతులు మారినట్టు అనుమానిస్తున్న పోలీసులు ఆ కోణంలో ఆరా తీస్తున్నారు.

యాసంగి పంటల సాగు 97%

53 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు..

అందులో వరి సాగు 39.80 లక్షల ఎకరాలు

సాక్షి, హైదరాబాద్: యాసంగి పంటల సాగు విస్తీర్ణం 97 శాతానికి చేరుకుంది. యాసంగిలో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 54.93 లక్షల ఎకరాలు కాగా ఇప్పటివరకు 53.30 లక్షల ఎకరాల్లో నాట్లు పడినట్లు వ్యవసాయశాఖ సోమవారం ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో వెల్లడించింది. అయితే గతేడాది ఇదే సమయానికి 59.91 లక్షల ఎకరాలు సాగు అయినట్లు పేర్కొంది. వరి విస్తీర్ణం మాత్రం గతేడాది యాసంగి కంటే తక్కువ నమోదు కావడం గమనార్హం. యాసంగి వరి సాధారణ సాగు విస్తీర్ణం 40.50 లక్షల ఎకరాలు కాగా, గతేడాది ఇదే సమయానికి 45.51 లక్షల ఎకరాల్లో సాగైతే, ఈ ఏడాది ఇప్పటివరకు 39.80 లక్షల ఎకరాల్లోనే నాట్లు వేశారు. పప్పు ధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 4.21 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు 3.08 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. వాటిల్లో 2.53 లక్షల ఎకరాల్లో శనగ, 2.03 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 5.51 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.72 లక్షల ఎకరాల్లో జొన్న సాగైంది. యాసంగిలోనూ పత్తి 273 ఎకరాల్లో సాగైంది.



టెన్త్ విద్యార్థులకు బాసటగా ఎమ్మెల్యే 'మేడిపల్లి'

వేతనంలో అల్పాహారానికి రూ.1.50 లక్షల విరాళం

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముందుకొచ్చారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి సోమవారం ఆయన రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం మేడిపల్లి సత్యం మాట్లాడుతూ తాను నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ హాస్టల్‌లో చదువుకొని పీహెచ్‌డీ చేశానన్నారు. తానిచ్చిన హామీ మేరకు తాను ఎమ్మెల్యేగా తీసుకున్న మొదటి నెల వేతనం నుంచి రూ.1.50 లక్షలు ప్రభుత్వ పాఠశాలల్లోని నిరుపేద విద్యార్థుల అల్పాహారం కోసం విరాళంగా అందజేశానని చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.